www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ప్రజలు ఎన్నుకున్న రాష్ట్రప్రభుత్వాలు..

గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై నడవాలా?

ఇష్టానుసారంగా బిల్లులను తొక్కిపెట్టవచ్చా?

రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇన్నేళ్లుగా

మన దేశ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చుతున్నారా?

కేంద్రానికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నలు

కొనసాగనున్న విచారణ 2



గురువారం | 21-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 144 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి మ.12:45 తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి రా.12.09 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.8.21-9.55, దుర్ముహూర్తం: ఉ.10.13-11.03, మ.3.13-4.03, అమృతఘడియలు: సా.5.49-7.24, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.03, సూర్యాస్తమయం: 6.33 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



లోక్‌సభలో విపక్షాల నిరసన మధ్య అమిత్ షా ప్రసంగం

పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు

అరెస్టైన పీఎం, సీఎం, మంత్రులను తొలగించే బిల్లులపై నిరసన

లోక్‌సభలో 3 బిల్లుల్ని ప్రవేశపెట్టిన అమిత్‌షా

అవి దుర్మార్గం, క్రూరమంటూ ప్రతిపక్షాల ధ్వజం

రాజ్యాంగం, సమాఖ్యపై దాడి అని ఆందోళన

బిల్లు ప్రతుల్ని చింపి షాపైకి విసిరిన సభ్యులు

షావైపు దూసుకెళ్లే యత్నం.. అడ్డుకున్న మార్షల్స్

గుజరాత్ హోంమంత్రిగా అరెస్టైన అమిత్‌షా

విలువలపై మాట్లాడటమేంటి?: వేణుగోపాల్

నేను అరెస్టుకు ముందే రాజీనామా చేశా: షా

మధ్యయుగాల నాటికి దేశం తిరోగమనం

రాజ్యాంగంపై దాడి చేస్తున్నవారికి, రక్షిస్తున్న వారికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది: రాహుల్

ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు

అవినీతిని కాపాడుకునేందుకే ప్రతిపక్షాల ప్రయత్నం.. బీజేపీ ప్రత్యారోపణ

'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'కు ఆమోదం

మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లులపై లోక్‌సభ అట్టుడికింది. దీనికి సంబంధించిన మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వెంటనే ఆ బిల్లులు దుర్మార్గం, క్రూరమైనవంటూ ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో నిరసనకు దిగాయి. సభా కార్యకలాపాలను స్తంభింపజేశాయి. కొందరు ఎంపీలు బిల్లు ప్రతులను చింపి అమిత్‌షా వైపు విసిరారు. మరోవైపు బిల్లులకు మద్దతుగా ప్రతిపక్షాలను తప్పుపడుతూ అధికారపక్ష సభ్యులు నినాదాలకు దిగారు. దీనితో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు ప్రతిపక్ష సభ్యులు అమిత్‌షాను ఘెరావ్ చేసేందుకు దూసుకురాగా.. కేంద్ర మంత్రులు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, కిరణ్ రిజిజు అడ్డుగా నిలిచారు. వెంటనే మార్షల్స్ కూడా వచ్చి అమిత్ షాకు రక్షణ వలయం ఏర్పాటుచేశారు. ఈ



గందరగోళం మధ్య మూడు బిల్లులను మూజువాణి ఓటుతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి అప్పగిస్తున్నట్టుగా స్పీకర్ ప్రకటించారు. పార్లమెంటు తర్వాతి సమావేశాల్లో తొలివారం చివరిరోజున దీనిపై నివేదికను సమర్పించాలని సూచించారు. తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కాగా, పార్లమెంటు

మిగతా 2వ పేజీలో...

బెట్టింగ్ యాప్‌లలో వాటా కంపెనీలకు నష్టాల మూట!

వందల కోట్లు పెట్టి కొన్న సంస్థలకు షాక్

భారీగా పడిపోయిన షేర్లు

కొన్నవారికి నష్టం.. అమ్ముకున్న వారికి లాభం 14





ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా (ఫైల్)

దాడి చేసిన నిందితుడు రాజేశ్ సకారియా

ఢిల్లీ సీఎంపై దాడి

రేఖాగుప్తా చెంపపై కొట్టి, జుట్టు పట్టి లాగిన గుజరాత్ వాసి రాజేశ్ సకారియా

ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌లో ఘటన

రేఖ చెయ్యి, భుజం, తలకు గాయాలు

సకారియాపై హత్యాయత్నం కేసు నమోదు

దాడిని ఖండించిన రాజకీయ పక్షాలు

వీధి కుక్కలపై సుప్రీం తీర్పు మీద నిరసన తెలిపేందుకే ఢిల్లీ వెళ్లాడు: సకారియా తల్లి

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశ రాజధానిలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రతివారం 'జన్ సున్‌వాయి' (ప్రజాదర్బార్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగానే బుధవారం ఆమె సివిల్ లైన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన్ సున్‌వాయిలో పాల్గొన్నారు. ఉదయం ఒక్కొక్కరు వచ్చి తమ సమస్యలను ఢిల్లీ సీఎంకు విన్నవించుకుంటున్నారు. సరిగ్గా 8.15 గంటలకు ఓ వ్యక్తి తన వద్దనున్న కాగితాలను రేఖా గుప్తాకు అందించారు. వెంటనే అరుస్తూ ఆమెపై దాడి చేశాడు. చెయ్యి పట్టుకొని లాగి చెంపపై కొట్టాడు. ఆమెను గట్టిగా లాగినప్పటికీ.. వెనక గోడ ఉండడంతో కిందపడిపోలేదు. తర్వాత అతను ముఖ్యమంత్రి జుట్టు పట్టుకొని

మిగతా 2వ పేజీలో...

అందరివాడిని

ఏ పార్టీకీ చెందిన వ్యక్తిని కాదు

ఉపరాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతం



ఢిల్లీలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో ఖర్గే, సోనియా, పవార్, రాహుల్

దేశంలో 64 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు నాకు మద్దతునిస్తున్నాయి

అర్హుడినే ఎన్నుకోవాలని ఎన్డీఏనూ కోరుతున్నా

రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత నిర్వర్తించాను

ఇప్పుడు కూడా మళ్లీ అందుకే వచ్చాను

దేశంలో పతనమవుతున్న రాజ్యాంగ విలువలు

కొత్త ఓటర్లను చేర్చుకోవాల్సిన ఎన్నికల కమిషన్ ప్రస్తుతం ఉన్న ఓటర్లను తొలగిస్తోంది

'ఆంధ్రజ్యోతి'తో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

సుదర్శన్‌రెడ్డికి 'ఇండియా' ఎంపీల సన్మానం

నేడు నామినేషన్ 2

ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

2

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమైనదని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పదవి అని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. గతంలో వెంకయ్యనాయుడు బీజేపీకి రాజీనామా చేసిన తర్వాతే ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేశారని గుర్తు చేశారు. తాను ఏ పార్టీ వాడినీ కాదని, రాజ్యాంగంతో సుదీర్ఘమైన ప్రస్థానం ఉన్న తనకు అన్ని పార్టీలు మద్దతిస్తాయన్న ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. గతంలో బీజేపీ

మిగతా 10వ పేజీలో...

10

థర్డ్‌క్లాస్ సీఎం పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదు!

ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఏ కూటమీ సంప్రదించలేదు: కేటీఆర్

మద్యం దుకాణాల దరఖాస్తు రూ.3 లక్షలు!

రాష్ట్రంలో కొత్త దుకాణాల ఏర్పాటుకు సర్కారు అనుమతి

దరఖాస్తుల స్వీకరణకు త్వరలో ప్రకటన

డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండేళ్ల కాలానికి కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2025-27కు గాను దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఇందుకోసం త్వరలోనే ప్రకటన విడుదల కానుంది. కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 14న గెజిట్ విడుదలైన నేపథ్యంలో.. దుకాణాల దరఖాస్తు గడువును ఎక్సైజ్ కమిషనర్ నిర్ణయిస్తారు. ఏ4 దుకాణాల దరఖాస్తు రుసుమును సర్కారు ఏకంగా 50 శాతం పెంచింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న రుసుమును ప్రస్తుతం రూ.3 లక్షలుగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 2620 దుకాణాల గడువు నవంబరు 30తో ముగియనుంది. 2025 డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాల నిర్వహణ మొదలవుతుంది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు కొత్త దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతిస్తోంది. దుకాణాల్లో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు

మిగతా 13వ పేజీలో...

భూముల వేలానికి

హెచ్‌ఎండీఏ నగారా!

రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని లేఅవుట్లలో ప్లాట్లు, ఖాళీ స్థలాల విక్రయం

వచ్చే నెల 17-19 వరకు ఆన్‌లైన్‌లో వేలం

తుర్కయంజాల్‌లో గజానికి కనీస ధర రూ. 65 వేలు, బాచుపల్లిలో 70 వేలు

దాదాపు రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

కేపీహెచ్‌బీలో స్థలాల వేలం

7.8 ఎకరాలను రూ.547 కోట్లకు కొనుగోలు చేసిన గోద్రెజ్ ప్రాపర్టీస్ 14



కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్ సొసైటీ వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

అయ్యా.. యూరియా!

ఒక్క బస్తానైనా ఇవ్వండంటూ రైతుల వేడుకోలు

ఆగ్రహంతో ధర్నాలు, రాస్తారోకోలు.. తెల్లవారకముందే లైన్లలో..

రాష్ట్రానికి మరో 50వేల మెట్రిక్ టన్నుల యూరియా

కేంద్రం నిర్ణయం.. వారంలోనే ఇవ్వాలని తుమ్మల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రైతులకు బస్తా యూరియా సంపాదించడం గగనమవుతోంది. పొట్టదశకు చేరుకుంటున్న వరికి, పూత దశకొస్తున్న పత్తి పంట సహా ఇతర పంటలకు చల్లేందుకు యూరియా దొరక్కపోవడంతో రైతులు గోస పడుతున్నారు. పంటలకు ఎరువులు లేకపోతే దిగుబడి తగ్గుతుందనే ఆందోళనతో తెల్లవారముందే కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. ఓపిగ్గా క్యూలో నిల్చుంటున్నారు. యూరియా ఇవ్వాలంటూ కొన్నిచోట్ల సిబ్బంది కాళ్లు పట్టుకొని వేడుకుంటున్నారు. ఇంకొన్నిచోట్ల ఓపిక నశించి కన్నెర్ర చేస్తున్నారు. రాస్తారోకోలతో

మిగతా 3వ పేజీలో...

సాదాబైనామాల క్రమబద్ధీకరణపై

స్టేను ఎత్తేయాలి

భూభారతి చట్టం ప్రకారం ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయొచ్చు.. అడ్వకేట్ జనరల్

తదుపరి విచారణ 26కు వాయిదా 14



13

మేడారం జాతరకు

150కోట్లు మంజూరు

2024 కంటే రూ.45 కోట్లు అదనం

2026 జనవరి 28-31వరకు జాతర

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడిగా

కొప్పుల ఈశ్వర్

ఎమ్మెల్సీ కవిత స్థానంలో.. ఆమె దేశంలో లేని సమయంలో ఎన్నిక 11

సంఘం నుంచి జాగృతి నేతల తొలగింపు

ఎన్నిక అప్రజాస్వామికం: సింగరేణి జాగృతి

వీలైనంత త్వరగా సరిహద్దుల

పరిష్కారం!

2

2005 నాటి ఒప్పందం వెలుగులో కసరత్తు.. నిపుణుల బృందం ఏర్పాటు

వాణిజ్యం, విమాన సేవలు పునఃప్రారంభం

కైలాస పర్వతం, మానస సరోవరం సందర్శనకు వీలుగా మరిన్ని చర్యలు

భారత్-చైనా సంయుక్త నిర్ణయాలు

ముగిసిన చైనా విదేశాంగమంత్రి పర్యటన

అంతర్జాతీయ సవాళ్లను, ఏకపక్ష పోకడలను కలిసి ఎదుర్కొందాం!

ట్రంప్ దూకుడుపై భారత్‌కు చైనా సూచన

నాడు హైటెక్ సిటీలా.. నేడు మూసీ ప్రక్షాళనను

వ్యతిరేకిస్తున్నారు

హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునేవారంతా శత్రువులే

అలాంటి దొంగల పని పట్టాల్సింది ప్రజలే

మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వవైభవం

తెలంగాణ సమగ్రాభివృద్ధికి '2047 ప్రణాళిక'

గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపనలో సీఎం

ఫైవ్‌స్టార్ హోటల్, ఎయిర్‌పోర్టు స్థాయిలో సౌకర్యాలు ఉంటాయని వెల్లడి

అసెంబ్లీకి పోటీకి 21 ఏళ్ల వయస్సు చాలు

యువత చట్టసభల్లో ఉంటే దేశానికే మేలు

రాజీవ్ జయంతి కార్యక్రమంలో రేవంత్



ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి. మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు ప్రపంచపటంలో ప్రత్యేక స్థానముందని, 2034 నాటికి ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ హయాంలో హైటెక్ సిటీకి పునాదులు వేస్తే వ్యతిరేకించారని, నేడు మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునే వారంతా

మిగతా 13వ పేజీలో...



బబుష్కిన్

భారత ఉత్పత్తులు మేం కొంటాం

రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై అమెరికా ఆంక్షలు విధించడం అన్యాయం, ఏకపక్షం

ఈ ఏడాది చివర్లో మోదీ-పుతిన్ భేటీ: భారత్‌తో రష్యా ఎంబసీ అధికారి రోమన్ బబుష్కిన్

భారత్‌కు చమురుపై 5 శాతం రాయితీ ఇస్తాం.. రష్యా వాణిజ్య ప్రతినిధి ఇవ్‌జెనీ వెల్లడి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకే భారత్‌పై సుంకాలు: వైట్‌హౌస్ సెక్రటరీ

భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు రష్యా చమురు అమ్మి లాభపడుతున్నాయి

భారత్ కొనుగోళ్లలో 42 శాతం రష్యా నుంచే: అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్


న్యూఢిల్లీ, ఆగస్టు 20: రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై ఒత్తిడి తేవడం అన్యాయం, ఏకపక్షమని.. భారత్‌లో రష్యా రాయబార కార్యాలయ సీనియర్ అధికారి రోమన్ బబుష్కిన్ అన్నారు. ఏకపక్ష నిర్ణయాలు ఎప్పుడైనా సరఫరా చైన్లను దెబ్బతీస్తాయని.. అభివృద్ధి చెందుతున్న దేశాల ఇంధన భద్రతను అవి ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు. భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాల కారణంగా ఏవైనా సవాళ్లు ఎదురైతే.. వాటిని ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. "(అధిక సుంకాల కారణంగా) భారత ఉత్పత్తులు అమెరికాకు వెళ్లలేకపోతే.. వాటికి రష్యన్ మార్కెట్లు స్వాగతం పలుకుతాయి" అని బబుష్కిన్ భరోసా ఇచ్చారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.7 లక్షల కోట్ల)కు పెంచేందుకు ఇరుదేశాలూ కట్టుబడి ఉన్నాయని .. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ తగ్గిస్తుందని తాము అనుకోవట్లేదని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ తిరస్కరించినా.. పాశ్చాత్యదేశాలు భారత్‌కు సమాన సహకారం అందించవని.. ఎందుకంటే అది వాటి స్వభావం

మిగతా 2వ పేజీలో...

ఎన్నికైన రాష్ట్రప్రభుత్వాలు.. గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై నడవాలా?

» వారికేమైనా సంపూర్ణ అధికారాలు ఉన్నాయా?

» కేంద్రానికి రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నలు



న్యూఢిల్లీ, ఆగస్టు 20: రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలు.. గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పనిచేయాలా అని సుప్రీంకోర్టు కేంద్ర సర్కారును ప్రశ్నించింది. ఇష్టానుసారంగా ఆయన బిల్లులను తొక్కిపెట్టి వాటిని విఫలం చేయొచ్చా అని నిలదీసింది. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు నిర్దిష్ట కాలవ్యవధిని సుప్రీంకోర్టు నిర్దేశించవచ్చా అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని తెలుసుకోగోరిన సంగతి తెలిసిందే. దానిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బుధవారం విచారణ కొనసాగించింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. రాష్ట్రప్రభుత్వం పంపే బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో పెడితే.. అవి మురిగిపోయినట్లేనని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వాల వినతులను (బిల్లులను) తేల్చకుండా పెండింగ్‌లో ఉంచే సంపూర్ణ అధికారాలను గవర్నర్లకు ఇచ్చారా అని ఆయన్ను చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. 'గవర్నర్లు బిల్లులను పక్కనపెట్టేస్తే.. మెజారిటీ సంఖ్యాబలంతో ఏర్పడిన ప్రభుత్వాలు వారి ఇష్టాయిష్టాలపై ఆధారపడాలా? రాష్ట్రప్రభుత్వాలు, గవర్నర్ల నడుమ అసలు సామరస్యం ఉందా' అని అడిగారు. దీనికి తుషార్ మెహతా సమాధానమిస్తూ.. గవర్నర్ బిల్లులను ఆమోదించకపోవడం అత్యంత అరుదైన విషయమని, రాష్ట్ర బిల్లు దేశ ప్రజాస్వామ్య సంకల్పానికి విరుద్ధంగా ఉన్నప్పుడు.. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా ఉన్నప్పుడు.. ప్రస్తుత కేంద్ర చట్టానికి విరుద్ధంగా ఉన్నప్పుడు ఆమోదించకుండా నిలిపివేయవచ్చని పేర్కొన్నారు. ఈ దశలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ జోక్యం చేసుకుని.. బిల్లును మురిగిపోయేలా చేసే అధికారం గవర్నర్‌కు ఉన్నట్లయితే.. ఇదే లాజిక్ 111వ అధికరణ కింద భారత రాష్ట్రపతికి కూడా వర్తిస్తుందని.. పార్లమెంటు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా రాష్ట్రపతి కూడా నిలిపివేయవచ్చని తెలిపారు. గవర్నర్లు అప్రధాన వ్యక్తులు కాదని.. వారు కేంద్ర కేబినెట్ సలహా సహకారాలతో వ్యవహరించే రాష్ట్రపతికి ప్రతినిధులని మెహతా గుర్తుచేశారు. గవర్నర్‌గిరీ అనేది రిటైర్డ్ రాజకీయ నాయకులకు స్వర్గధామం వంటిది కాదని తెలిపారు. జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని.. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇన్నేళ్లుగా మన దేశ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చుతున్నారా అని ప్రశ్నించారు. గవర్నర్లు, ఎన్నికైన ప్రభుత్వాలు సామరస్యంగా మెలగాల్సి ఉందని.. అలా ఉంటున్నారా అని అడిగారు. రాజ్యాంగ ధర్మాసనం విచారణ గురువారం కొనసాగనుంది.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న మోదీ

సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20 : ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ కార్యదర్శి జనరల్ పీసీ మోడీకి రాధాకృష్ణన్ తరఫున ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేడీ(యూ) నేత రాజీవ్ రంజన్ సింగ్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అంతకముందు పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని ప్రేరణ స్థల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీఏ కూటమి సీనియర్ నేతలతో కలిసి రాధాకృష్ణన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి పరిశీలించిన అనంతరం రాధాకృష్ణన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనుంది.

రాజ్యాంగ రక్షణ పోరాటంలో భాగంగానే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపిక: రాహుల్

» సుదర్శన్‌రెడ్డికి ఇండీ కూటమి సన్మానం.. నేడు నామినేషన్



న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ఎంచుకోవడం రాజ్యాంగాన్ని రక్షించేందుకు జరుగుతున్న పోరాటమేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఐదు దశాబ్దాలకుపైగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు. ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రతిపక్షాలు నిర్ణయించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బుధవారం ఇండియా కూటమికి చెందిన ఎంపీలు పార్లమెంట్ సెంట్రల్ హాలులో సత్కరించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ప్రాంతానికి చెందిన నాయకుడు ఇండియా కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఇది తమకు గర్వకారణమని చెప్పారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన బిహార్‌లో 'ఓటు చోరీ'పై ఉద్యమం ప్రారంభమైందన్నారు. అక్కడి నుంచే నిప్పంటుకుని దావానలంలా దేశమంతా వ్యాపిస్తుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత, రాజ్యాంగ విలువలపై సుదర్శన్‌రెడ్డి సుమారు అరగంటసేపు చేసిన ప్రసంగం సభ్యులను ఆకట్టుకుంది. కాగా, ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మహారాష్ట్రలో సెఫాలజిస్టు సంజయ్‌పై రెండు కేసులు



నాగ్‌పూర్/ ముంబై, ఆగస్టు 20: మహారాష్ట్ర ఎన్నికల ఓటర్ల జాబితాలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేశారంటూ సెఫాలజిస్టు సంజయ్ కుమార్‌పై ఆ రాష్ట్ర పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. హింగ్నా, దేవ్‌లలి నియోజకవర్గాల్లో 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే.. అసెంబ్లీ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య బాగా తగ్గిపోయిందంటూ ఆయన కొన్నిరోజుల క్రితం 'ఎక్స్'లో పోస్టుపెట్టారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. ఎన్నికల సంఘం, బీజేపీపై 'ఓటు చోరీ' ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ డేటాను ఉదాహరణగా చూపాయి. అయితే తన డేటా విశ్లేషణలో పొరపాట్లు జరిగాయని, క్షమాపణ చెబుతున్నానని పేర్కొంటూ సంజయ్‌కుమార్ మంగళవారం తన పోస్టును తొలగించారు.

వైద్య సంస్థల నిబంధనలపై స్టే ఏమీ లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: వైద్యసంస్థల (క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్) నిబంధనలు-2012 ఇప్పటికీ అమలులోనే ఉన్నాయని, వాటిపై స్టే ఏమీ ఇవ్వలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నేత్ర వైద్య విధానాలకు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఒకే రకమైన ధరలను నిర్ణయించడాన్ని సవాల్ చేస్తూ ఆల్‌ఇండియా ఆప్తాల్మోలాజికల్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ అంశానికి సంబంధించి తాము ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొంది. ఆస్పత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలన్న నిబంధనను తప్పనిసరిగా అమలు చేసేలా ఆదేశించాలంటూ దాఖలైన మరో పిటిషన్‌పైనా ధర్మాసనం విచారణ చేపట్టింది.

పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి)

శీతాకాల సమావేశాలు నవంబర్ మూడో వారంలో ప్రారంభంకావొచ్చని అంచనా. అప్పటికల్లా జేపీసీ నివేదికను సిద్ధం చేయాల్సి ఉంటుంది. జేపీసీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ఐదేళ్లకుపైగా శిక్షపడే కేసుల్లో అరెస్టయి 30రోజులకుపైగా జైలులో ఉండే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను.. 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా మూడు బిల్లులను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రూపొందించింది. మూడు బిల్లులు ఒకే అంశానికి చెందినవే అయినా.. రాజ్యాంగంలోని విభిన్నమైన ఆర్టికల్స్‌ను సవరించేందుకు వీలుగా కేంద్రం, రాష్ట్రాలకు సంబంధించి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మరో బిల్లు, జమ్మూకశ్మీర్‌కు సంబంధించి మూడో బిల్లు సిద్ధం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు రాజ్యాంగానికి, సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని ప్రతిపక్షాల నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే కేంద్రం ఈ బిల్లులను తీసుకొచ్చిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. సాధారణంగా నేరం రుజువయ్యే వరకు ఎవరైనా నిర్దోషులేనని, కానీ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు ఈ సహజ న్యాయానికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు. కీలకమైన బిల్లు ప్రతులను సభ్యులకు అందజేయకుండా హడావుడిగా లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటని ఆర్‌ఎస్పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ నిలదీశారు. అసలు పార్లమెంటు సమావేశాలు ముగిసే ముందు హడావుడిగా బిల్లులను ప్రవేశపెట్టడం ఏమిటని కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. గతంలో గుజరాత్ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టయిన అమిత్‌షా.. ఇప్పుడు రాజకీయాల్లో నైతికత గురించి మాట్లాడుతూ, బిల్లులు ప్రవేశపెట్టడం ఏమిటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు

పదవుల నుంచి తొలగింపు బిల్లులు దేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థలకు గొడ్డలిపెట్టు అని వామపక్షాలు మండిపడ్డాయి. వీటిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించాయి. "ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర ఉన్న మోదీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ఈ బిల్లులు బహిర్గతం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని అడ్డుకునేందుకు అందరూ కలిసి రావాలి" అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ప్రజలు ఎన్నుకున్న సీఎం, మంత్రులను తొలగించడమంటే.. రాష్ట్రాలను ఎవరు పాలించాలనే దానిపై కేంద్రం పెత్తనమేనని, ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని సీపీఐ ఎంపీ సందోష్‌కుమార్ విమర్శించారు. కాగా, బీజేపీ ఓట్ల చోరీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసే ప్రయత్నమని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ విమర్శించారు.



అమిత్ షా లోక్‌సభలో బిల్లులను ప్రవేశ పెడుతున్న సమయంలో ఎన్డీయే కూటమి ఎంపీల హర్షం

జవాబుదారీతనాన్ని పెంచుతాయి: బీజేపీ

తమ అవినీతిని, అవినీతి నేతలను కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు కేంద్రం తెచ్చిన మూడు బిల్లులను తప్పుపడుతున్నాయని బీజేపీ మండిపడింది. ఇటీవల కొందరు జైలు నుంచే ప్రభుత్వాలను నడపడాన్ని చూశామని, అది సరైనదేనా ప్రతిపక్షాలు చెప్పాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బిల్లులు అత్యవసరమని, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచుతాయని చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా తెస్తున్న బిల్లులను వ్యతిరేకించడమంటే.. అవినీతిని సమర్థిస్తున్నట్లేనని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. బిల్లుల ప్రతులను చించి అమిత్‌షాపై విసరడం సిగ్గుమాలిన చర్య అని, సదరు సభ్యులపై లోక్‌సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

'పదవుల తొలగింపు' బిల్లులేంటి?


ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్షపడిన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తొలగించవచ్చు. కేసులు నమోదవడం, జైలులో ఉండటం వల్ల పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధన ఏదీ లేదు. ఢిల్లీ సీఎంగా ఉన్నప్పుడు కేజ్రీవాల్ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలుకు వెళ్లారు. జైలులో ఉన్న 6నెలల పాటు కూడా ఆయన సీఎంగానే కొనసాగారు. ఇటీవల తమిళనాడు మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలులో ఉన్నా పదవిలో కొనసాగారు. సుప్రీంకోర్టు తప్పుబట్టడంతో పదవి నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలోనే కీలక పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధుల అవినీతిని నిరోధించడానికంటూ కేంద్రం 3బిల్లులు తీసుకొచ్చింది. వీటి ప్రకారం.. కనీసం ఐదేళ్లు, ఆపై శిక్షపడే నేరారోపణలపై అరెస్టయి 30రోజులకుపైగా జైలులో ఉన్న పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి కోల్పోతారు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత నిబంధనల మేరకు తిరిగి ఆయా పదవులను చేపట్టవచ్చు.

మధ్యయుగాలకు తిరోగమిస్తున్నాం: రాహుల్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను చూస్తుంటే దేశం మధ్యయుగాల నాటి రాచరికానికి తిరోగమిస్తున్నట్టు ఉందని రాహుల్ గాంధీ విమర్శించారు. పదవుల నుంచి తొలగింపు బిల్లులకు నిరసనగా ఆయన నలుపురంగు టీషర్టు ధరించి పార్లమెంటుకు వచ్చారు. "మనం మళ్లీ మధ్యయుగాల నాటికి తిరోగమిస్తున్నాం. ఎవరైనా తమ మాట వినకపోయినా, వారి ముఖం నచ్చకపోయినా సరే రాజులు వారిని తొలగించేవారు. ఇప్పుడు కూడా ఈడీని ప్రయోగించి, ఎవరినైనా అరెస్టు చేయవచ్చు. ప్రజాస్వామికంగా ఎన్నికైన వారిని 30 రోజుల్లో తప్పించేయవచ్చు" అని విమర్శించారు. ఇక కేంద్రం తెచ్చిన బిల్లులు అప్రజాస్వామికమని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. అవినీతికి వ్యతిరేకంగా తెస్తున్నామని చెబుతూ ప్రజల కళ్లకు గంతలు కట్టాలని చూస్తున్నారని చెప్పారు. ఎవరైనా మంత్రిని, సీఎంను అరెస్టు చేసి 30 రోజులు జైలులో పెడితే.. వారి నేరమేదీ తేలకపోయినా, శిక్షపడకపోయినా కూడా పదవి నుంచి తొలగించడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు.

నేను అరెస్టుకు ముందే రాజీనామా చేశా: షా

ఈ బిల్లులను హడావుడిగా ఏమీ తీసుకురాలేదని, ప్రతిపక్షాల ఎంపీలు కూడా సభ్యులుగా ఉండే జేపీసీకి నివేదించామని అమిత్ షా చెప్పారు. బిల్లులపై ప్రతిపక్షాల అభ్యంతరాలు, సూచనలను జేపీసీకి ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. కేసీ వేణుగోపాల్ విమర్శలను తిప్పికొడుతూ.. తనపై తప్పుడు ఆరోపణలతో కేసులు నమోదు చేశారని, అయినా నైతిక విలువలు పాటిస్తూ అరెస్టుకు ముందే గుజరాత్ హోంమంత్రి పదవికి రాజీనామా చేశానని అమిత్ షా చెప్పారు. కోర్టు నిర్దోషిగా తేల్చే వరకు కూడా ఎలాంటి పదవులు తీసుకోలేదని స్పష్టం చేశారు. తీవ్రమైన నేరారోపణలు ఉన్నా రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసుకు సంబంధించి 2010 జూలైలో గుజరాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్‌షాను సీబీఐ అరెస్టు చేసింది. కొంతకాలంపాటు సబర్మతి జైలులో ఉన్నారు. అయితే అమిత్‌షా నేరం చేశారనేందుకు ఆధారాలేమీ లేవని, ఆయన నిర్దోషి అని 2014 డిసెంబర్‌లో సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చింది.



ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ద ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కొంత మంది బానిస కావడం, మనీ లాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వీటికి చెక్ పెట్టేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఇందులో పేర్కొన్న నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందించే వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.కోటి దాకా జరిమానా విధిస్తారు. ఆన్‌లైన్ గేమ్స్ ప్రకటనల్లో భాగస్వాములకు సైతం రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల జరిమానా విధిస్తారు.

ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు

» దిగ్విజయ్‌సింగ్ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ప్రైవేటు విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను తప్పనిసరి చేయడానికి పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ సారథ్యంలో విద్యపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం స్పష్టం చేసింది. ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలకు చెందిన విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ పరంగా అనుమతించదగినదిగా పేర్కొంది. ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఓబీసీలకు 27%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5% రిజర్వేషన్లను కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు పార్లమెంట్‌కు కమిటీ తన నివేదికను సమర్పించింది.

ఢిల్లీ సీఎంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

లాగాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జి భాయ్ సకారియా (41)గా గుర్తించారు. జన్ సున్‌వాయ్‌లో పాల్గొనేందుకు వచ్చిన సకారియా.. తన బంధువు ఒకరు జైల్లో ఉన్నారని, అతన్ని విడిపించాలని కోరుతూ పిటిషన్ ఇవ్వాలని చెప్పి లోపలికి వెళ్లాడు. ఉదయం 8.15 గంటలకు సీఎం రేఖాగుప్తాకు కాగితాలు ఇచ్చి, గట్టిగా అరుస్తూ ఆమె చెయ్యిపట్టి లాగి దాడి చేశాడు. ఇదంతా ఒక్క నిమిషంలోనే జరిగిందని పోలీసులు తెలిపారు. సీఎం రేఖా గుప్తాకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

పక్కా ప్రణాళికతో దాడి..

ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి పక్కా ప్రణాళికతోనే జరిగిందని సీఎం కార్యాలయం(సీఎంవో) ఓ ప్రకటనలో తెలిపింది. ఆమెను చంపడానికి పన్నిన కుట్రగా అభివర్ణించింది. నిందితుడిపై హత్యాయత్నం సహా పలు అభియోగాలతో ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. సీఎం అధికారిక నివాసం వద్దనున్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించామని.. నిందితుడు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు గుర్తించామని వివరించారు. దాడిలో రేఖా గుప్తా చేతికి, భుజానికి, తలకు గాయాలయ్యాయని ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ చెప్పారు. దాడిలో ఏదైనా రాజకీయ పార్టీ హస్తం ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని మరో మంత్రి కపిల్ మిశ్రా అభిప్రాయపడ్డారు. సీఎంపై దాడిని ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ఖండించారు. అయితే, తన కొడుకు సకారియాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని అతని తల్లి భానుబెన్ తెలిపారు. రాజ్‌కోట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వీధి కుక్కలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు ఢిల్లీ వెళ్లినట్లు చెప్పారు.

అగ్ని-5 క్షిపణి పరీక్ష సక్సెస్



న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశ వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ పరీక్ష చేపట్టినట్టు రక్షణ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. అగ్ని-5 అనేది డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేసిన అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. భారత్ వద్ద ఉన్న అగ్ని శ్రేణిలో ఇది అత్యంత అధునాతన మిస్సైల్. ఇది 5 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించగలదు.

భారత ఉత్పత్తులు మేం కొంటాం

(మొదటిపేజీ తరువాయి)



బబుష్కిన్

కాదని.. ఇటీవలికాలంలో ఆ విషయం స్పష్టంగా వెల్లడైందని బబుష్కిన్ వ్యాఖ్యానించారు. భారతదేశం రష్యాకు ఎంతో ముఖ్యమని.. ఇండియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తామెప్పుడూ గౌరవిస్తామని.. భారత్ ప్రస్తుతం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటోందన్న విషయం తమకు తెలుసని.. క్లిష్టపరిస్థితుల్లో న్యూఢిల్లీకి అండగా నిలవడానికి రష్యా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇండో-రష్యా సంబంధాలపై తమకు విశ్వాసం ఉందని, బయటి ఒత్తిళ్లు ఉన్నా రెండు దేశాల మధ్య ఇంధన సహకారం అలాగే కొనసాగుతుందని నమ్ముతున్నామని అన్నారు. ఇరుదేశాల మధ్య చమురు సరఫరా కొనసాగించడానికి కావాల్సిన విధానాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయని.. వాణిజ్యపరంగా మిగిలిన అడ్డంకులను తొలగించుకుని, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయని బబుష్కిన్ వివరించారు. అలాగే.. ఇండో-రష్యా-చైనా మధ్య సంబంధాలు సైతం ప్రాంతీయ భద్రతకు ఎంతో ముఖ్యమైనవని ఆయన వ్యాఖ్యానించారు. ఈమూడు దేశాల మధ్య త్రైపాక్షిక సమావేశం త్వరలో జరగాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చివరికి.. మోదీ-పుతిన్ ఢిల్లీలో కలిసే అవకాశం ఉందని చెప్పారు. అయితే, ఈ భేటీకి సంబంధించి తేదీలు ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించిన దేశాలే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నాయని పాశ్చాత్య దేశాలను ఉద్దేశించి ఆయన దెప్పిపొడిచారు. "పాశ్చాత్య దేశాలు నిన్ను విమర్శిస్తున్నాయంటే.. నువ్వు చేస్తున్నది సరైనదేనని అర్థం" అని వ్యాఖ్యానించారు. కాగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను ఆపడానికి అమెరికా సుంకాలతో ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుంటే.. మరోవైపు రష్యా 5 శాతం రాయితీతో భారత్‌కు చమురు విక్రయించేందుకు సిద్ధమైంది. భారత్‌తో రష్యా వాణిజ్యానికి సంబంధించి ఉప ప్రతినిధి ఇవ్‌జెనీ గ్రివా ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించారు. అయితే, ఈ రాయితీ ఇరు దేశాల వ్యాపారుల మధ్య చర్చలపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

సంపన్న కుటుంబాలకే లాభం..

భారత్‌లోని కొన్ని అత్యంత సంపన్న కుటుంబాలు రష్యా చమురును అమ్మడం ద్వారా 16 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.39 లక్షల కోట్లు) మేర లాభపడ్డాయని.. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశ మొత్తం చమురు కొనుగోళ్లలో 42 శాతం రష్యా నుంచే ఉంటున్నాయని.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముందు ఈ కొనుగోళ్లు కేవలం 1 శాతం మాత్రమే ఉండేవని సీఎన్‌బీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ధ్వజమెత్తారు. "చైనా కూడా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పెంచింది కదా? మరి ఆ దేశంపై ట్రంప్ యంత్రాంగం ఎందుకు ఇదే తరహాలో సుంకాలు విధించట్లేదు?" అని ప్రశ్నించగా.. ఆ పరిస్థితి పూర్తిగా భిన్నమైనదని, చైనా చాలాకాలంగా రష్యా నుంచి చమురు కొంటోందని.. డ్రాగన్ కొనుగోళ్లు 13% నుంచి 16 శాతానికి మాత్రమే పెరిగాయని.. భారత్ తరహాలో ఆ దేశం రష్యా నుంచి చమురును కొనుగోలు చేసి లాభానికి అమ్ముకోవట్లేదని బెసెంట్ వివరణ ఇచ్చారు.


అందుకే సుంకాలు..

రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికే భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ చెప్పారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న (రష్యా-ఉక్రెయిన్) యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ బలమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని.. అందులో భాగంగానే భారత్‌పై ఆంక్షలు సహా పలు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అంతే కాదు.. ఈ ఏడాది మేలో భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణను ఆపడానికి కూడా ట్రంప్ వాణిజ్యాన్ని ఒక సాధనంగా వాడారని తెలిపారు. నాడు ట్రంప్ జోక్యం చేసుకోకపోయి ఉంటే ఆ ఘర్షణ అణుయుద్ధానికి దారితీసి ఉండేదని ఆమె పేర్కొన్నారు.

వీలైనంత త్వరగా సరిహద్దుల పరిష్కారం!

» దానికోసం నిపుణుల బృందం

» భారత్-చైనా సంయుక్త నిర్ణయం



మంగళవారం వాంగ్ యీతో మోదీ (ఫైల్)

న్యూఢిల్లీ, బీజింగ్, ఆగస్టు 20: సరిహద్దు పునర్విభజన సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని, ఈ మేరకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని భారత్-చైనా సంయుక్తంగా నిర్ణయించాయి. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో ప్రధాని మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం సమావేశమైన అనంతరం విదేశాంగశాఖ ఒక ప్రకటన జారీ చేసింది. భారత్-చైనా సరిహద్దు అంశంపై 2005లో కుదిరిన ఒప్పందం మేరకు రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సరిహద్దు ప్రాంతాల పునర్విభజనను పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు ఈ ప్రకటన తెలిపింది. దీని ప్రకారం.. ఇరుదేశాల మధ్య లిపులేఖ్ పాస్, షిప్కీ లా, నాథూ లా కేంద్రాల ద్వారా సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించనున్నారు. మరోవైపు, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సేవలను కూడా తిరిగి ప్రారంభించాలని, వీసాలను జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కైలాస పర్వతాన్ని, మానస సరోవరాన్ని మరింత మంది భారతీయ భక్తులు, యాత్రికులు సందర్శించుకునేలా వీలు కల్పించాలని తీర్మానించారు. ప్రస్తుతం పశ్చిమ సెక్టార్‌లో ఉన్నట్టుగా తూర్పు, మధ్య సెక్టార్లలోనూ జనరల్ స్థాయి యంత్రాంగాన్ని నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనటానికి రానున్న భారత ప్రధాని మోదీకి చైనా స్వాగతం పలుకుతున్నట్లుగా ఈ ప్రకటన పేర్కొంది. అలాగే, ఎస్‌సీఓ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న చైనాకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లుగా భారత్ తెలిపింది. కాగా, భారత్‌లో ముగిసిన వాంగ్‌యీ పర్యటనపై చైనా కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. ట్రంప్ సుంకాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయ సవాళ్లను, ఏకపక్ష దుందుడుకు పోకడలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఇరుదేశాలు నిర్ణయించినట్లు పేర్కొంది.

గాజా స్వాధీనానికి ఇజ్రాయెల్ నుంచి 60వేల రిజర్వ్ బలగాలు!

టెల్ అవీవ్, ఆగస్టు 20: గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రణాళికకు ఇజ్రాయెల్ రక్షణశాఖ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం గాజాలో మరో 60 వేల మంది రిజర్వ్ బలగాలను మోహరిస్తామని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. ఇప్పటికే ఉన్న 20 వేల మంది రిజర్వ్ బలగాలకు వీరు అదనం. అయితే ఆపరేషన్ ఎప్పుడు ప్రారంభిస్తారనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. వాస్తవానికి ఈ ప్రణాళికకు ఈ నెల 12నే ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదం పొందితే ఇది అమల్లోకి వస్తుంది.

అదే జరిగితే నేను స్వర్గానికి వెళతా: ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరి, యుద్ధాన్ని ఆపగలిగితే తాను స్వర్గానికి వెళతానని ట్రంప్ అన్నారు. ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్ అనే టీవీ షోలో మాట్లాడుతూ, "ప్రస్తుతం నా పాలన సరిగా లేదనడం వింటున్నాను. కానీ, ఆ రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరితే మాత్రం స్వర్గానికి వెళతాను" అని అన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన హత్యాయత్నం నుంచి త్రుటిలో తప్పించుకున్నప్పటి నుంచి ట్రంప్‌లో ఆధ్యాత్మిక భావన పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలో యూరియా కోసం
రైతులు కాళ్లు మొక్కే దుస్థితి

- కేసీఆర్ గోదావరి జలాలతో రైతుల పాదాలు కడిగారు
- రేవంత్ రైతులతో అధికారుల కాళ్లు మొక్కిస్తున్నాడు
- ఆయనకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ యూరియాపై లేదు
- కాంగ్రెస్ మంత్రులను గ్రామాల్లో తిరగనివ్వం: హరీశ్



సిద్దిపేట/హైదరాబాద్ ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ గోదావరి జలాలతో రైతుల పాదాలు కడిగితే, రేవంత్‌రెడ్డి యూరియా కోసం రైతులతో పోలీసుల కాళ్లు మొక్కిస్తున్నాడని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యూరియా బస్తాకోసం రైతులు అధికారుల కాళ్ళు మొక్కే దుస్థితి రావడం అత్యంత బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌కు అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ, యూరియా మీద లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటించిన హరీశ్‌రావు చిన్న కోడూర్ మండలంలోని రంగనాయకసాగర్‌ను సందర్శించారు. అంతకు ముందు నంగునూర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే హక్కు లేదని, కాంగ్రెస్ మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన కొనసాగిస్తున్నారని, యూరియా సరఫరాపై ఇప్పటివరకు ఆయన ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు యూరియా అందించాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వడ్లు అమ్మి మూడు నెలలైనా రైతులకు రూ.1,300 కోట్లు బోనస్ డబ్బులు చెల్లించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని రేవంత్‌రెడ్డి గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని, రంగనాయకసాగర్ ఉన్న నీళ్లు కాళేశ్వరం జలాలు కావా అని ప్రశ్నించారు. ఎల్లంపల్లి వద్ద 5 లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా పోతోందని, మోటార్లను ఆన్ చేయాలని డిమాండ్ చేశారు.



అధికారులతో సమావేశమైన ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య; చిత్రంలో జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్

జెన్‌కోలో పదోన్నతులు, నియామకాల్లో..
రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలి

- తెలంగాణ ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జెన్‌కోలో పదోన్నతులు, నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్ సౌధలోని తెలంగాణ జెన్‌కో కార్యాలయాన్ని ఎస్సీ కమిషన్ సందర్శించింది. ఈ సందర్భంగా జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌తో పాటు డైరెక్టర్లతో సమావేశమయింది. పదోన్నతుల ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం లేదని సంఘాలు కమిషన్‌కు నివేదించడంతో.. ఆ అంశంపై కమిషన్ ఆరా తీసింది. పదోన్నతుల అంశం న్యాయస్థానంలో ఉందని, కేసు తేలిన తర్వాత ముందుకెళతామని జెన్‌కో సీఎండీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై ప్రతినెల ప్రత్యేక సమావేశంనిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

విద్యుత్ సంస్థల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి: మాదిగ ఉద్యోగుల సమాఖ్య

తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో ఉద్యోగులు/అధికారుల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య కోరింది. బుధవారం జలసౌధలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను ఫెడరేషన్ జెన్‌కో విభాగం కార్యదర్శి భాస్కర్ కలిసి, వినతిపత్రాన్ని అందించారు. పదోన్నతుల్లో కచ్చితంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి, రోస్టర్ విధానంలో లోపాల్లేకుండా చూడాలని నివేదించారు.

అయ్యో.. యూరియా!

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు బుధవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా కనిపించాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం (పీఏసీఎస్)కు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సోమారంకుంట తండాకు చెందిన గిరిజన రైతు బానోత్ వీరన్న తనకు రెండు బస్తాల యూరియా ఇవ్వాలంటూ అక్కడి సిబ్బంది కాళ్లు పట్టుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. యూరియా దొరకడం లేదనే ఆగ్రహంతో మెదక్ జిల్లా చిన్నకోడూరు, నంగునూరు, చేగుంట, సిద్దిపేట రూరల్, నర్సాపూర్, మిర్‌దొడ్డి, గజ్వేల్, హుస్నాబాద్, కొల్చారం, రామాయంపేట తదితర మండలాల్లో రైతులు రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో ఖమ్మం-వరంగల్ హైవేపై రైతులు రాస్తారోకో చేశారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో సరుకు గంటల్లోనే అయిపోవడంతో రైతులు ఆందోళన నిర్వహించారు. ఆత్మకూరులో తనకు యూరియా బస్తా దొరకదనే ఆందోళనతో ఓ వృద్ధ రైతు అక్కడున్న చెప్పుల వరుసలోనే పడుకున్నాడు. గద్వాల రూరల్‌లో, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, పెద్దకొత్తపల్లిలో రైతులు ఆందోళన నిర్వహించారు. కాగా నల్లగొండ జిల్లా తిప్పర్తిలో తెల్లవారుజామున 3 గంటలకే 250 మంది రైతులు ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (పీఏసీఎస్) వద్దకు చేరుకొని 9గంటల వరకు క్యూలో నిల్చున్నారు. అక్కడి సిబ్బంది రైతులకు తలా ఓ బస్తా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేటలో 240 మంది రైతులకు ఒక బస్తా చొప్పున అందజేశారు. కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో 225 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున ఇచ్చారు.

ఆ షాపులపై అధికారుల కొరడా

ఎరువుల నియంత్రణ చట్టాన్ని అతిక్రమించి షాపులు నిర్వహిస్తుండటంతో మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్‌లో 3, కురివిలో 2 సహా వివిధ మండలాల్లో మొత్తంగా తొమ్మిది ఎరువుల దుకాణాల లైసెన్సులను జిల్లా కలెక్టర్ తాత్కాలికంగా రద్దు చేశారు. గిరాకీ లేని సరుకులను వదిలించుకునేందుకు ఇతర ఎరువులు, పురుగుల మందులు కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామంటూ రైతులకు తేల్చి చెబుతున్న వ్యాపారులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలోని చింతకాని, నేలకొండపల్లి, రఘునాథపాలెం, సత్తుపల్లి మండలాల్లోని పలు దుకాణాలపై అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. యూరియా కోసం వెళ్లిన రైతులకు ఇతర ఎరువులు ట్యాగ్‌చేసి అమ్ముతున్నట్టు గుర్తించి ఐదు ఎరువుల దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్టు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. యజమానుల లైసెన్సులు రద్దు చేయాలని జిల్లా వ్యవసాయాధికారులకు సమాచారమిచ్చామని వెల్లడించారు.

ఆ సరుకు వారంలోనే ఇవ్వండి

ఇక రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ యూరియాను ఈ వారంలోనే సరఫరా చేయాలని కేంద్ర రసాయనాలు ఎరువులు మంత్రిత్వ శాఖకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు ఆవరణలో చేసిన నిరసన ప్రదర్శనతో కేంద్రానికి పరిస్థితులు తెలిశాయని తెలిపారు. కాగా కర్ణాటక నుంచి 10,800 టన్నుల యూరియా మొదటి షిప్‌మెంట్ ప్రారంభమైందని.. ఈవారంలో మరో మూడు షిప్‌మెంట్ల ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు డైరెక్టర్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. కొందరు బీఆర్‌ఎస్ నేతలు వారి అనుచరులను యూరియా కేంద్రాల వద్ద చెప్పులు క్యూలైన్‌లో పెట్టి యూరియా కొరతపై రైతాంగం ఆందోళన చెందే విధంగా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. ఆగస్టు 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా... ఇప్పటివరకు 5.42 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేశారు. కేటాయించిన యూరియాలో 2.88 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాకపోవడంతోనే రైతుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు.

మేజర్ అయిన యువతిని స్టేట్ హోంలో నిర్బంధించలేరు: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మేజర్ అయిన యువతిని ఆమె అభీష్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వ హోంలో నిర్బంధించలేరని హైకోర్టు స్పష్టంచేసింది. ఆ యువతి ఇష్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని, కావాలంటే ఆమెను స్వేచ్ఛగా వదిలేయాలని.. అయితే యువతి సంక్షేమాన్ని ప్రతినెలా పరిశీలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీచేసింది. స్టేట్‌హోం నుంచి విడుదలైన యువతి ప్రభుత్వ పథకాలు, సహాయం కోసం కోరవచ్చని తెలిపింది. 2018లో బాలికల అక్రమ రవాణా, వ్యభిచారం కేసులో ఓ మహిళపై పోలీసులు కేసు పెట్టారు. ఆమె వద్ద ఉన్న బాలికను స్టేట్‌హోంకు తరలించారు. తర్వాత ఆమహిళపై కేసు వీగిపోయింది. ఇప్పుడామె.. ఆ బాలిక మేజర్ అయిందని.. ఎలాంటి కేసూ పెండింగ్‌లో లేకున్నా యువతిని నిర్బంధించారని హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. యువతి అభీష్టానికి విరుద్ధంగా నిర్బంధించడానికి వీలులేదని.. ఆమె ఇష్టప్రకారం విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

తెలంగాణకు ఐఐఎం కేటాయించండి

- రాజ్యసభలో కె.లక్ష్మణ్, వద్దిరాజు డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను కేటాయించాలని ఎంపీలు కె.లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఐఐఎం సవరణ బిల్లు 2025పై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొంటూ వారు ఈ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయని, ప్రజల ఆకాంక్షల మేరకు దీనిని పూర్తిచేయాలని వారు కోరారు. కాగా, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఆధునీకరణకు కేంద్రం సహకరించాలని ఎంపీ రఘురాం రెడ్డి కోరారు. బుధవారం లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేటీపీఎస్ 820 మెగావాట్ల విద్యుత్తును అందిస్తోందని తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునికీకరణకు కేంద్రం సాంకేతిక, ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

బఫర్‌స్టాక్ వివరాలు ఎందుకు చెప్పట్లేదు?

- యూరియాపై కాంగ్రెస్ అసత్య ప్రచారం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా బఫర్ స్టాక్ గురించి ఎందుకు చెప్పడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మీ వద్ద బఫర్ స్టాక్ ఉంచుకుని, కేంద్రం యూరియా ఇవ్వడం లేదని ఎందుకు ప్రచారం చేస్తున్నరు? రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు విధానాల కారణంగా యూరియా కృత్రిమ కొరత ఏర్పడింది. నేను చెప్పినదాంట్లో ఒక్క అక్షరం తప్పుంటే రాజీనామా చేస్తా.. లేకుంటే మీరు రాజీనామా చేయాలి' అని మంత్రి తుమ్మలకు రాంచందర్‌రావు సవాల్ చేశారు. ఖమ్మం జిల్లాలో గతేడాది 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగితే, ఈసారి సాగు విస్తీర్ణం పెరగకున్నా యూరియా డిమాండ్ గతం కంటే ఎక్కువ ఎందుకు పెరిగిందో తుమ్మల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా కేటాయింపులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని నిప్పులు చెరిగారు. యూరియా కేటాయింపులపై రాష్ట్రానికి కేంద్రం ఎప్పుడూ తక్కువ చేయలేదని, దీనిపై చర్చకు రావాలని తాను గతంలో సవాల్ చేసినా కాంగ్రెస్ నాయకులు ముందుకు రాలేదన్నారు. 'కేంద్ర ప్రభుత్వం 2025 రబీ సీజన్‌కు తెలంగాణాకు 12.47 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. ఇందులో రాష్ట్రప్రభుత్వం 10.43 లక్షల మెట్రిక్ టన్నులు పంపిణీ చేయగా, 2.04 లక్షల మెట్రిక్ టన్నులు ఖరీఫ్‌కు ప్రారంభ నిల్వగా ఉంది. ఈ ఖరీఫ్‌కు కేంద్రం 5.18 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. అంటే, ఇప్పటివరకు (ఈనెల 14 వరకు) రాష్ట్ర ప్రభుత్వం వద్ద 7.22 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది' అని అన్నారు. 'ఇదీ వాస్తవమయితే, మంత్రి తుమ్మల మాత్రం రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ 3 నెలల కిందటే ప్రకటన చేశారు. దీంతో రైతులు ఎరువుల దుకాణాలకు క్యూ కట్టారు. దళారులు బ్లాక్‌మార్కెట్‌కు తరలించారు' అని అన్నారు. 'రామగుండం, క్రిబ్‌కో, ఇఫ్కో నుంచి 15 వేల మెట్రిక్ టన్నులు, కరీకల్ పోర్టు నుంచి మరో 10 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా అవుతోంది. ఇదంతా కూడా మీ ఒత్తిడితో కాదు.. మా బాధ్యతగా ఇస్తున్నం'అని పేర్కొన్నారు. కాగా, మార్వాడీ గోబ్యాక్ నినాదం వెనుక అర్బన్ నక్సల్స్ ఉన్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. ఈ నినాదం వెనుక కొంతమంది కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారన్నారు. 'మా పార్టీ సీనియర్ బీసీ నేత బండారు దత్తాత్రేయను ఉప రాష్ట్రపతిగా చేయాలని ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంగా కోరిన సీఎం రేవంత్, ఇప్పుడు కాంగ్రెస్ బీసీ సీనియర్ నేత వీహెచ్‌ను ఎందుకు ప్రతిపాదించలేదు?' అని రాంచందర్‌రావు ప్రశ్నించారు. వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్‌కు తెలుగు ప్రైడ్ ఏమైందని నిలదీశారు.

ఖమ్మంలో పెరుగుతున్న ఏసీ మిర్చి ధర

- క్వింటా రూ.15,150,
- ఒక్కరోజులోనే 600 పెరుగుదల

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం ఏసీ మిర్చి ధరల పెరుగుదల ఊపందుకుంది. జూలై నెలాఖరు వరకు ఈ మార్కెట్‌లో క్వింటా రూ.13,500 నుంచి రూ.13,900 వరకు పలికిన మిర్చి ధరలు.. ఆగస్టు నెల ప్రారంభం నుంచి క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. మూడు వారాల క్రితం ధరలతో పోలిస్తే ప్రస్తుతం క్వింటాకు రూ.1,500 పెరగడం విశేషం. ఏసీ మిర్చికి దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో 15 రోజులుగా ధరల పెరుగుదల కొనసాగుతోంది. మార్కెట్‌లో బుధవారం క్వింటాలు ఏసీ మిర్చిని రూ. 15,150 జెండాపాట ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంతే కాకుండా విదేశీ గిరాకీ కారణంగా క్వింటాకు రూ.15,500 ధర వరకు కొనుగోలు చేశామని మరి కొందరు వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో మంగళవారం క్వింటాలు ఏసీ మిర్చి ధర రూ. 14,550 ఉండగా ఒక్కరోజులోనే రూ.600 పెరగడం గమనార్హం. మార్కెట్‌లో సాధారణ రకం తేజా మిర్చి (నాన్ ఏసీ) నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ.7,000 నుంచి రూ. 9,000 ధర పలుకుతోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రత్యర్థులపై బ్రహ్మాస్త్రాలు

తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి, వరుసగా ముప్పైరోజులపాటు నిర్బంధంలో ఉంటే, మంత్రులను, ముఖ్యమంత్రులను, ఏకంగా ప్రధానిని సైతం పదవినుంచి తొలగించగల మహాశక్తివంతమైన మూడు బిల్లులను సభలో ప్రవేశపెడుతూ హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు, హితవులు అమితాసక్తికరంగా, ఉత్సాహభరితంగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి బిల్లుల అవసరాన్ని, కారణాలను, లక్ష్యాలను ఆయన బహుచక్కగా వివరించారు. సామాన్యప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారని, సగటు మనిషి ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఉన్నతమైన విలువలతో, ఆదర్శాలతో వ్యవహరించాల్సి ఉంటుందనీ, రేఖామాత్రంగా కూడా అనుమానానికి ఆస్కారం లేకుండా నడుచుకోవాల్సి ఉందని ఈ బిల్లులు ఆశిస్తున్నాయి. ప్రజల ఆశలకూ, ఆకాంక్షలకూ ప్రతీకలుగా, ప్రతినిధులుగా ఉంటున్నవారిమీద తీవ్రమైన నేరారోపణలు వచ్చి, వారు అరెస్టయిన పక్షంలో, రాజ్యాంగపరంగా వారిమీద ప్రజలు ఉంచిన విశ్వసనీయత కోల్పోయినందున, సదరు ప్రజాప్రతినిధులు తమకు తాముగా పదవుల నుంచి తప్పుకోవాలి, లేదా విధిగా తప్పించవలసి ఉంటుందని ఈ బిల్లులు ఘోషిస్తున్నాయి. రాజకీయం పాపపంకిలమూ అవినీతిమయమూ అయిపోయిన ఈ దేశంలో ఎంతో ఉన్నతమైన ఆశయాలూ లక్ష్యాలతో ప్రక్షాళనకు నడుంబిగిస్తున్న ఈ బిల్లులను విపక్షాలు మాత్రం కాదంటున్నాయి.

మచ్చపడితే, జైలుకెళితే ప్రధానినే దించేస్తానని శపథం చేస్తున్న బిల్లులను చూసి విపక్ష పార్టీలు, మరీముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ వొణికిపోతోంది. లోక్‌సభలో కాంగ్రెస్ వేణుగోపాల్ ఒకవైపు వాగ్బాణాలు సంధిస్తూంటే, తృణమూల్ ఎంపీలు బిల్లుప్రతులను చించి విసిరేశారు, హోంమంత్రి దగ్గరకు దూసుకొస్తున్న ప్రత్యర్థులను ఏకంగా మంత్రులే వెనక్కునెట్టవలసి వచ్చింది. సదరు బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమనీ, ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదకరమనీ ప్రత్యర్థులు మొత్తుకుంటున్నా, హోంమంత్రి తాను అన్నదీ, అనుకున్నదే చేశారు. లోక్‌సభనుంచి 21 మంది, రాజ్యసభ నుంచి పదిమంది కలగలిసిన సంయుక్త పార్లమెంటరీ విచారణ సంఘానికి ఈ బిల్లులు వెడతాయి. రాజకీయాలనుంచి నేరగాళ్ళను ఏరివేసే అతి ముఖ్యమైన బిల్లులు అయినందున కాబోలు, సదరు జెపీసీకి పెద్ద సమయం కూడా ఇవ్వలేదు. నవంబరు మూడోవారంలో జరిగే శీతాకాల సమావేశాల్లోగా అది తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

ఈ బిల్లులు రాజకీయాల్లో నైతికతను ప్రతిష్ఠిస్తాయని బీజేపీ నేతలు అంటున్నారు. మీ ఏలుబడిలో రాజకీయమే తప్ప నైతికత ఉన్నదా అంటూ సదరు బిల్లుల దుర్వినియోగం భవిష్యత్తులో ఎన్నిరకాలుగా, ఏయే రూపాల్లో జరగవచ్చునో విపక్షనేతలు వివరిస్తున్నారు. 'ఏముందీ, ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను పిలుస్తాడు, కేసు కట్టమంటాడు, ప్రజలు జైకొట్టి ఘనంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధి కథ కూడా ముప్పైరోజుల్లోనే ముగిసిపోతుంది' అని రాహుల్ బిల్లుల లోగుట్టు ఇదేనంటూ ఒక్క ముక్కలో తేల్చేశారు.

బీజేపీ ప్రభుత్వం సద్బుద్ధితో ఈ బిల్లులను తేలేదని, విపక్షపార్టీల ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా వేధించుకుతింటున్న క్రమంలో, ఇప్పుడు తమకు గిట్టని ముఖ్యమంత్రుల మీద కేసులుకట్టి, 31వ రోజున ఆటోమేటిక్‌గా దించేసే ఎత్తుగడ ఇదని వారివాదన. ప్రధానమంత్రికీ, కేంద్రమంత్రులకు కూడా ఇవే నియమాలు వర్తిస్తున్నప్పటికీ, కేంద్రప్రభుత్వం అమ్ములపొదిలో ఉన్న ఈడీ, సీబీఐ ఇత్యాది ఏజెన్సీలేవీ వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తాయని ఎవరూ నమ్మరు. ఈ బ్రహ్మాస్త్రాలను ధరించిన కేంద్రం తనకు గిట్టని మంత్రులూ, ముఖ్యమంత్రుల పదవులను కేవలం నేరాభియోగంతో ఊడగొట్టవచ్చు. ఆదర్శవంతమైన రాజ్యంలో, సమస్త వ్యవస్థలూ స్వతంత్రంగా వ్యవహరించగలస్థితి ఉన్నప్పుడు ఇటువంటి బిల్లులను స్వాగతించవచ్చు. కానీ, స్వయంగా సర్వోన్నత న్యాయస్థానమే కేంద్రప్రభుత్వ ఏజెన్సీలను పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయంటూ తప్పుబడుతూ, మనీలాండరింగ్ చట్టాల వంటివి రాజకీయంగా దుర్వినియోగమవుతున్నాయని ఆక్షేపిస్తున్న స్థితిలో, దోష నిర్ధారణ జరగకుండా విపక్షనేతలు నెలలతరబడి జైళ్ళలో మగ్గే అవకాశాలే అధికం. వర్షాకాల సమావేశాలు ముగిసిపోతున్న ఆఖరుక్షణాల్లో, ఎజెండాలో లేని ఈ బిల్లులను హడావుడిగా సభలో ప్రవేశపెట్టడం ఆశ్చర్యమే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, ట్రంప్ వ్యాఖ్యలు, బిహార్ సర్ సహా అనేక అంశాల్లో విపక్షాలు పాలకపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టేసిన నేపథ్యంలో, ఈ బిల్లులు దారిమళ్ళింపు చర్యగా ఉపకరించవచ్చు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీకగా సుదర్శన్‌రెడ్డి

సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఇండియా కూటమి ప్రకటించడంతో ఆయన మీడియా పతాక శీర్షికలలో ప్రధానంగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా, అస్సాం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు జస్టిస్‌గా, పదవీ విరమణ అనంతరం గోవా లోకాయుక్తగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి తాను విధులు నిర్వహించిన అన్ని పదవులకు వన్నె తెచ్చారు. ఆయన వెలువరించిన తీర్పులను గమనిస్తే సుదర్శన్‌రెడ్డి ప్రజా దృక్పథం, ఆయన దార్శనికత వ్యక్తిత్వం, విలువల పట్ల నిబద్ధత వ్యక్తమవుతాయి, ఇవే ఆయన్ను ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టాయి. న్యాయమూర్తిగా ఆయన సేవలలో స్పష్టత, నిమగ్నత ప్రస్ఫుటం. ఆయన ఎన్నో కీలకమైన తీర్పులు ఇచ్చినా ఛత్తీస్‌గడ్‌లో ఆదివాసీ యువకులతో నిర్మించిన ప్రైవేటు వ్యవస్థ సాల్వాజుడుం విషయంలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌లో భాగంగా ఇచ్చిన విలక్షణ తీర్పు మిక్కిలి ఎన్నదగినది. ఆ తీర్పులో ఆయన ఉల్లేఖించిన అనేక రాజనీతిజ్ఞుల, న్యాయ కోవిదుల ఉటంకింపులు చూస్తే ఆశ్చర్యం కలగటమే కాదు, ఆయన ప్రజా దృక్పథం కూడా స్పష్టంగా అర్థమవుతుంది.

గత దశాబ్ద కాలంగా దేశంలో రెండు పరస్పర విరుద్ధ భావనల మధ్య ఘర్షణ రాజకీయ వేదికని రక్తి కట్టిస్తున్నది. ఒకటి హిందూ భావజాలం అయితే మరొకటి భారతదేశ రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా ప్రకటితమయ్యే విలువల భావజాలం. వీటి మధ్య 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఎన్నడూ లేనంత సంఘర్షణ చోటుచేసుకున్నది. ప్రజాస్వామ్య దేశంలో అధికార – ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిపాటి. రాజకీయ పార్టీల అధినాయకులు ఎన్నికల ప్రచార సభలలో మాట్లాడిన మాటలకు, ఆయా పార్టీలు మేనిఫెస్టోలలో చేసిన వాగ్దానాలకు, అధికారం చేపట్టాక చేసే పాలనకు పొంతన ఉండదు. పాలకులు ప్రజలు కోరుకున్నట్టు పాలించడం మాని, తమకు వెన్నుదన్నుగా ఉండి నడిపిస్తున్న వారికి అనుకూలంగా పాలిస్తుంటారు. చట్టాలూ అలాగే అమలవుతుంటాయి. ప్రపంచీకరణ తీసుకొచ్చిన అత్యంత దుష్పరిణామాలలో ఒకటి 'క్విడ్ ప్రోకో' సంస్కృతి. కేంద్రంలోను, రాష్ట్రాలలోను ప్రభుత్వాలు ఏర్పరిచినవారు తీసుకునే నిర్ణయాల వెనుక ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలు స్పష్టంగానే గోచరమవుతుంటాయి. రాజ్యాంగ పీఠికలో రాసుకున్న పాఠ్యాంశాన్ని పాలకులు అప్పుడప్పుడు వల్లె వేస్తుంటారు కానీ, ఆచరణలో దానికి పూర్తి వ్యతిరేకంగా పనిచేస్తుంటారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన స్వతంత్ర ప్రతిపత్తి గల అనేక విభాగాలలో రాజకీయ జోక్యం ఇప్పుడు పెరుగుతున్నది. మన రాజకీయ వ్యవస్థ దీన్ని ఒప్పుకోకపోవచ్చు గానీ ప్రజలకు ఈ విషయంపై అవగాహన కలుగుతున్నది. దేశంలో జరిగిన అనేక సంఘటనలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.



ఇండియా కూటమి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణను సమర్థవంతమైన ప్రచార అస్త్రంగా ఎంచుకున్నది. క్రమంగా ఈ ఎన్నిక రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య పోరుగా మారుతున్నది.

వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, దాని నాయకులు ఇటీవల దేశ వాస్తవ ముఖచిత్రాన్ని గుర్తించారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఆ పార్టీ సామాజిక కులగణన జరగాలని, అన్ని రంగాలలో ఆయా వర్గాల ప్రాతిపదికన ఫలాలు అందాలని ఒక శక్తిమంతమైన ఉద్యమానికి నాంది పలికింది. ఈ ఉద్యమం ఇటీవల దేశ రాజకీయ ముఖచిత్రంలో ఒక ప్రధాన ఎజెండాగా క్రమంగా మార్పు చెందుతున్నది. ఇది ప్రజలపరంగా శుభపరిణామం.

ఇప్పుడు భిన్న దృక్పథాల మధ్య దేశం ఒక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. రాజకీయ వర్గాలు రాజ్యాంగ పరిరక్షకులుగాను, రాజ్యాంగ వ్యతిరేకులుగాను చీలిపోయారు. ఇటువంటి రాజకీయ సందర్భంలో– ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా అధికార పార్టీ ఎన్‌డీఏ ఆర్ఎస్ఎస్ నేపథ్యం గల వ్యక్తిని నిలబెడితే, ప్రతిపక్ష ఇండియా కూటమి న్యాయశాస్త్ర కోవిదుడు, దార్శనికుడు, రాజ్యాంగ నిపుణుడైన జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా బరిలో నిలిపింది. సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోను, సాంస్కృతిక రంగంలోను తనదైన పాత్రను, గురుతరమైన బాధ్యతలను నిర్వర్తించారు. అన్నిటికన్నా ముఖ్యంగా బి. సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామిక దృక్పథం కలిగినవారు.

గతంలో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నీలం సంజీవరెడ్డి అధ్యక్షుడిగా పోటీ పడగా, తన అనంతరం వి.వి. గిరిని పోటీలో నిలిపి ఆత్మప్రబోధం ప్రకారం ఓటు వేయమని ఇందిరాగాంధీ కోరారు. నేటి తరం ఆత్మలేని నాయకులకు ఆత్మ ప్రబోధాలు, విచక్షణలు ఉంటాయని ఆశించడం అత్యాశే! ఇప్పుడు పనిచేసేదల్లా పార్లమెంటు సభ్యుల మెజారిటీ, మైనారిటీ బలాబలాలు మాత్రమే. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో గెలుపు ఓటములు అంత ప్రధానమేమీ కాదు. కానీ ఇండియా కూటమి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణను సమర్థవంతమైన ప్రచార అస్త్రంగా ఎంచుకున్నది. క్రమంగా ఈ ఎన్నిక రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య పోరుగా మారుతున్నది.

• జూకంటి జగన్నాథం

సర్: సమస్యకు తప్పుడు పరిష్కారం!

ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణే (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –ఎస్ఐఆర్) పరిష్కారమని భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఇది పాత వాదనే. అయితే బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మోసాలను రాహుల్ గాంధీ బహిర్గతం చేసిన తరువాత ప్రత్యేక సమగ్ర సవరణే నిశ్చితమైన పరిష్కారమని సీఈసీ మరింతగా నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు వలలో పడ్డాడని బీజేపీ సామాజిక మాధ్యమాల గణాలు భావించాయి. ఓటర్ జాబితాలలోని లొసుగుల గురించి ఆయనెలా ఫిర్యాదు చేస్తున్నారు? వాటన్నిటినీ ప్రక్షాళన చేసేందుకే చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రతిపక్షనేత ఎందుకు మద్దతునివ్వడం లేదు? ఇత్యాది ప్రశ్నలు గుప్పించాయి. సీఈసీ సైతం ఇదే ఆలోచనాసరళిని అనుసరించారు. మూడు రోజుల క్రితం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు ఆ విషయాన్ని స్పష్టం చేసింది.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బహుశా, 'యస్ మినిస్టర్'ను చూసి ఉండకపోవచ్చు. ఆ సుప్రసిద్ధ రాజకీయ వ్యంగ్య ధారావాహిక ఆ అప్రమాణిక ఆలోచనా సరళిని 'రాజకీయవేత్త తర్క పద్ధతి' అని అభివర్ణించింది. అదిలా ఉంటుంది. 'మనం ఏదో ఒకటి చేయాలి; ఆ నిర్దిష్ట పని ఇదే; కనుక మనం దాన్ని చేయాలి'. ఒక మౌలిక ప్రశ్నను అడగకపోవడమే ఈ ఆలోచనా సరళిలోని తార్కిక దోషం: మనం చేయవలసిన ఆ 'ఏదో ఒకటి', మనం చేయవలసిన 'నిర్దిష్ట పని'గా మనకు సూచించినదేనా? రాహుల్ గాంధీని అపహసిస్తున్నవారు సరిగ్గా అడగని ప్రశ్న ఇదే: మనం చేయవలసిన పని 'ప్రత్యేక సమగ్ర సవరణ' ఓటర్ జాబితాలలోని లొసుగులు, మోసాలు, తప్పులను తొలగించేందుకు చేపట్టవలసిన 'నిర్దిష్ట చర్యేనా?' సమాధానమేమిటి? ఇదీ అని భావిస్తే సరిపోదు. మన ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణ తప్పనిసరి, తగిన ఫలితాలనిచ్చే సరైన పరిష్కారమనే నమ్మకం దురదృష్టవశాత్తు ఎవరికీ కలగడం లేదు. అయినా సీఈసీ వాదనను, దానిలో తర్క బద్ధత ఉందని భావించి, నిశితంగా పరీక్షిద్దాం.

మన ఓటర్ జాబితాలలో తీవ్ర లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ మన తార్కిక విమర్శను ప్రారంభిద్దాం. ఓటర్ జాబితాల 'సమగ్రత' విషయంలో భారత ఎన్నికల వ్యవస్థ ప్రశస్తంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే ఆ జాబితాల 'కచ్చితత్వం' లేదా 'నిర్దుష్టత' ఉండవలసిన రీతిలో లేదనేది ఒక వాస్తవం. ఇదేమీ కొత్త సమస్యకాదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ఓటర్ జాబితాలలో కచ్చితత్వం ఉండవలసిన రీతిలో ఉండడం లేదు. ఆ జాబితాలలో మార్పులు, చేర్పుల విషయమై ఆరోపణలు పెద్దగా లేకపోవడం వల్ల వాటిలో కచ్చితత్వం తక్కువగా ఉందన్న వాస్తవం ప్రజల దృష్టికి రాలేదు. మహారాష్ట్ర, మహదేవపురలో ఓటర్ జాబితాలలోని మోసాలను బహిర్గతం చేసిన తరువాత ఆ తీవ్ర లోపం దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి వచ్చింది.

ఓటర్ జాబితాలలో లొసుగులు, లోపాలు తొలగించేందుకు ఎన్నికల సంఘం గత కొద్ది సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్న సీఈసీ వాదనను కూడా అంగీకరిద్దాం. యథాలాపంగాచేసే ఓటర్ జాబితాల సవరణ పరిష్కారం కాదు, కాబోదు. ఎందుకని? పౌర బాధ్యతల స్పృహ ఉన్నవారు తమ పేర్ల చేర్పుకు లేదా తీసివేతకు లేదా దిద్దుబాటుకు, నివాస ప్రదేశాల మార్పు గురించి తెలియజేయడానికి నివేదించిన అభ్యర్థనలకే ఈ సవరణ ప్రక్రియ పరిమితమవుతుంది. వార్షిక సంగ్రహ సవరణ మెరుగైనది. భారీ సంఖ్యలో చేర్పులు, తీసివేతలను సమగ్రంగా సమీక్షించేందుకు ఈ ప్రక్రియలో అవకాశమున్నది.. అయినా ఇది కూడా సంతృప్తికరమైన పరిష్కారం కాదు. ఎందుకని? ఈ సంగ్రహ సవరణ సమయంలో బీఎల్ఓ (పోలింగ్ బూత్ స్థాయి అధికారి) ప్రతి ఇంటికి వెళ్లి యథార్థాలు తెలుసుకోవలసిన అవసరముండదు. ఏమైనా ప్రస్తుత విధానంలో సంవత్సరాలుగా అనేక లొసుగులు లోపాలు కొనసాగుతున్నాయి.



ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించినవారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పనిసరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా.

ఈ వాస్తవాల దృష్ట్యా పరిస్థితులను చక్కదిద్దేందుకు ఒక నిర్దిష్ట చర్య చేపట్టవలసిన అవసరమున్నది. ఆ నిర్దిష్ట చర్య మరింత సమగ్రంగా, క్రమబద్ధంగా ఉండాలి. అదే సమయంలో అది మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా కూడా ఉండితీరాలి. సాధారణ సవరణలు, వార్షిక సంగ్రహ సవరణలతో పాటు ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టవలసిన అవసరమున్నది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలి. కొత్త ఓటర్లను నమోదు చేయాలి. మృతులు, ఇతర ప్రదేశాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలి. ఇలా ఓటర్ జాబితాలను సవరించవలసి ఉన్నది. ఇదంతా ప్రామాణిక పద్ధతులలో జరగాలి. మరి బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఈ బాధ్యతలనే నిర్వర్తిస్తున్నది కదా అని ఆ ప్రక్రియను సమర్థిస్తున్నవారు తప్పక ప్రశ్నిస్తారు. నేను వారితో ఏకీభవించడం లేదు. వాస్తవమేమిటంటే ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించినవారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పనిసరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. మనం ఎదుర్కొంటున్న సమస్యకు ఆ 'సర్' పరిష్కారం కాదు. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా. బిహార్ 'సర్' ఎన్నికల చట్టం ఉద్దేశ్యంతో గానీ, ప్రత్యేక సవరణ స్ఫూర్తితో గానీ ముడిపడి ఉన్న ప్రక్రియ కాదు. ఈ విషయాలను మరింత వివరంగా పరిశీలిద్దాం.

బిహార్‌లో చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రకారం సంభావ్య ఓటర్లు అందరూ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిచేసి ఇవ్వాలి. ఇవ్వని పక్షంలో తమంతట తామే ఓటరుగా నమోదు అయ్యేందుకు అనర్హులవుతారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని నిబంధన ఇది. దీనికి ఏ విధమైన చట్ట ప్రాతిపదిక లేదు. చాలా చిన్న విషయంగా కనిపిస్తున్నా వాస్తవానికి మన ఎన్నికల వ్యవస్థలో ఒక మౌలిక మార్పు అని చెప్పి తీరాలి. గతంలో ఓటర్ల నమోదుకు ప్రభుత్వమే చొరవ చూపేది. ఇప్పుడు ఓటరుగా నమోదు కాదలుచుకున్న వారే అందుకు సొంతంగా శ్రద్ధ చూపాలి. అంటే వయోజనులను ఓటరుగా నమోదు చేసే బాధ్యత ఎన్నికల అధికారులకు ఉండదు. ప్రత్యేక సమగ్ర సవరణ ఆ బాధ్యతను ఓటర్ల పైనే మోపింది. ఓటర్ల నమోదులో ఇటువంటి మార్పు పర్యవసానాలు ఎలా ఉంటాయి? పేద ప్రజలు, అవిద్యావంతులు, వలస జీవులు, మైనారిటీలు, మహిళలు ఓటర్లుగా నమోదు కావడం గణనీయంగా తగ్గిపోతుందనేది పలు దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.



■ యోగేంద్ర యాదవ్

ప్రతి ఒక్క సంభావ్య ఓటర్ కూడా ఓటరుగా నమోదయ్యేందుకు తన అర్హతను నిరూపించుకునేందుకై వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తీరాలి. ఓటర్‌గా నమోదయ్యేందుకు పలు డాక్యుమెంట్లను విధిగా సమర్పించవలసిరావడమనేది ఇంతకు ముందెన్నడూ జరగలేదు. ఈ కొత్త నిబంధనకు చట్టబద్ధమైన ఆధారమేమీ లేదు. అంతే కాదు పౌరసత్వ భావనను వ్యతిరేకిస్తుంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకారం ఓటరుగా నమోదుకాగోరువారు తమ తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలు సమర్పించాలి. ఇది పౌరసత్వ భావనను తారు మారు చేస్తుంది. తన పౌరసత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యతను ఓటర్‌పైనే మోపుతుంది. ఈ అసంబద్ధతల సంచిత ప్రభావం సామూహికంగా ఓటుహక్కు తొలగింపు అనడంలో సందేహం లేదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అసంబద్ధ నిబంధనల వల్ల చాలామంది తమ ఓటుహక్కును కోల్పోతారు. బిహార్‌లో 'సర్' సాధిస్తుంది ఇదే కాదూ? ప్రత్యేక సమగ్ర సవరణ విధిగా ఓటర్ జాబితాల కచ్చితత్వాన్ని మెరుగుపరిచి తీరాలి. కానీ అలా జరగడం లేదు. ఈ బాధ్యతపై అసలు శ్రద్ధ పెట్టడం లేదని కూడా చెప్పాలి. ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించే ఎన్యూమరేషన్‌లో తొలగింపులకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అదనపు చేర్పులకు కూడా ఇవ్వాలి. బిహార్‌లో ఇలా జరగలేదు. జూన్ 25– జూలై 25 మధ్య నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో 65 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. అయితే అదనంగా ఒక్క పేరును కూడా ఆ జాబితాలలో చేర్చలేదు. నిజంగా ఇది సమగ్ర సవరణ కానేకాదు. అది సమగ్ర తొలగింపు ప్రక్రియ. ఇదొక నిష్ఠుర సత్యం.

ఓటర్ జాబితాల నుంచి నిర్దిష్ట ఓటర్ల పేర్లు తొలగించే ముందు వారు 'మృతులు', 'ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారు', 'జాడ తెలియడం లేదు' అని నమోదు చేసేముందు ఎన్నికల సంఘం నెలకొల్పిన సవివరమైన మార్గదర్శకాలను అనుసరించి ఉండవల్సింది. ఈ ప్రకారం ప్రామాణిక చట్టబద్ధ ప్రక్రియ (నోటీస్, విచారణ, అప్పీల్)ను అనుసరించి ఉన్నట్టయితే చాలా మంది 'మృత' ఓటర్ల ఫిర్యాదులకు గురికావల్సిన ఇబ్బంది ఎన్నికల సంఘంకు ఇప్పుడు ఉండేదికాదు.

ఓటర్ జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు వాటిని స్వతంత్ర తనిఖీకి నివేదించి ఉండవల్సింది. వాటి 'సంపూర్ణత్వం'పై సమాచారమున్నది గానీ, వాటి 'కచ్చితత్వం'పై సమాచారం లేదు. సువ్యవస్థిత, ఉన్నత ప్రమాణాల గణాంకాల వ్యవస్థలు ఉన్నా మన ఓటర్ జాబితాల నాణ్యత నిర్ధారణ లోపభూయిష్ఠంగా ఉండడం భారత్‌కు అప్రతిష్ఠాకరం. జనన మరణాల రిజిస్టర్‌పై స్వతంత్ర నమూనా తనిఖీ ఉన్నట్టుగానే ఓటర్ జాబితాల విషయంలో కూడా ఉండి తీరాలి. ప్రత్యేక సమగ్ర సవరణతో పాటు ఓటర్ జాబితాలలోని మోసాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై న్యాయసమ్మతమైన, విశ్వసనీయ విచారణ కూడా జరగాలి. అయితే ఈ విచారణ ఓటర్ జాబితాలను రూపొందించే బాధ్యతలలో పాల్గొంటున్న వారిచే జరిపించకూడదు. ఇది జరిగే పనేనా? ఎన్నికల సంఘం అందుకు అనుమతించదని చెప్పవచ్చు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

దోపిడీకి నిలయాలు ఈ ప్రైవేట్ వర్సిటీలు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జనవరి 2023 నాటికి వెల్లడించిన వివరాల ప్రకారం దేశ్యాప్తంగా 633 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉన్నవి. ఇందులో మన రాష్ట్రంలో డీమ్డ్ విశ్వవిద్యాలయాలు 5, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు 10 ఉన్నవి. ఉన్నత విద్యలో ప్రైవేట్ యాజమాన్యాల నమోదును పెంచడానికి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహాన్ని ఇచ్చాయి. అయితే ఈ ప్రైవేటు వ్యవస్థలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలలో తమకు ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందిస్తున్న ప్రభుత్వాలలో ధనస్వాములతో నిండి ఉన్న వారి పక్షంగానే వ్యవహరించి ఈ ప్రైవేట్ యూనివర్శిటీలకు అనుమతులను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రభుత్వం, ప్రజలు వారి వారి ఇండ్లలో లాక్ అయిన కరోనా కాలంలో, ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించింది. ఆ ప్రభుత్వంలో కొద్దిమంది ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా జీవోలను విడుదల చేయించి తెచ్చుకున్న పరిస్థితి ఉంది. ఈ ప్రైవేటు యూనివర్సిటీల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం అనేక గ్రాంట్లను విడుదల చేస్తుంది. అందులో విశ్వవిద్యాలయానికి భూమి కేటాయింపు ఒకటి కాగా, దీనితో పాటు యూజీసీ నిర్దేశించినట్లు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, హాస్టళ్లు, పరిపాలనా భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలి. అర్హత కలిగిన అధ్యాపకులు, సిబ్బందిని నియమించాలి. అయితే ఈ ప్రైవేట్ యూనివర్సిటీలలో అర్హులు కాని అధ్యాపకులకు తక్కువ వేతనాలు ఇచ్చి పాఠాలు చెప్పిస్తున్నారు. వేల కొలది సీట్లు తెచ్చుకున్న ఈ యాజమాన్యాలు కోట్లాది రూపాయలను సంపాదించడమే లక్ష్యంగా లక్షల్లో డొనేషన్లు, ఫీజులను వసూలు చేస్తూ పేద, దళిత, బడుగు వర్గాలను దోచుకుంటున్నాయి.



అసలు ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయటం వెనుక ఉన్నది వేరే భావజాలం. కొన్ని దశాబ్దాలుగా అణగారిన కులాలు, వర్గాలు విద్యా రంగంలోకి అడుగుపెడుతున్న కారణంగా వీరికి విద్యా ఫలాలు అందరాదన్న కుట్రతో, అగ్రకుల భావజాలంతో, అన్ని కులాల్లోనూ ఉన్న ధనికులకే పరిమితం అయ్యే విధంగా ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు పూనుకున్నారు. బడుగులకు విద్య నేర్చుకునే అవకాశాలను ఇవ్వరాదనేది వారి ప్రత్యేక దృష్టి. బీజేపీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన తొలి ఆధునిక కాలంలో గురుకులాల విద్యాస్థాపన లాంటిది. నాడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలకు, శూద్ర వ్యవసాయ కులాలకు మాత్రమే గురుకుల విద్యను అందించినట్లుగా నేడు విశ్వవిద్యాలయాల విద్యను కూడా ధనమున్న కులాలైన కొందరికే సొంతం చేయాలన్న ఆలోచన దీని వెనుక ఉంది. అందుకే విద్యా రంగానికి నిధులను భారీ స్థాయిలో కోత పెట్టింది. దీని స్థానంలో ప్రైవేటు వ్యక్తులను విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకోమని, మీకు నచ్చిన వారికి నచ్చిన విద్యను, ఆ విద్య ద్వారా వచ్చే జ్ఞానంతో ధనార్జనను కట్టబెట్టుకోమని తెగేసి చెబుతుంది.

గత కేసీఆర్ ప్రభుత్వం గానీ, జాతీయ స్థాయిలో ఉన్న బీజేపీ గానీ చాలా కాలం పాటు ప్రజల్ని విద్యావంతుల్ని చేసే ముఖ్య విధిని స్వీకరించలేదు. అందుకే విస్తృతంగా ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన చేపట్టాయి. ప్రైవేటు విద్యను ప్రాథమికం నుండి విశ్వవిద్యాలయం వరకు నిర్బంధం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉంది. ఈ ప్రైవేట్ లేదా గ్లోబల్ విశ్వవిద్యాలయాలతో పేద, మధ్యతరగతి వర్గాలకు, కులాలకు తీవ్రం నష్టం జరుగుతుంది. ఈ విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు ఉపకార వేతనాలు అమలు ఉండవు. ఒకవేళ ఉన్నా, వారిలో కులం – వర్గం అనే కొలమానం అంతర్లీనంగా ఉంచుకొని క్రీమీలేయర్ అంశాన్ని పైకి చూపి విద్య అవకాశాలను నిరాకరించే అవకాశం ఉంటుంది.

ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, మానవ రహిత ఉత్పాదతను పెంచే విభాగాలకే ప్రాధాన్యత. ఇవి ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచింపచేయలేని విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇది గాంధీ కలలు కన్న స్వరాజ్యం కాదు. నేటి విద్యావ్యవస్థతో విద్యార్థుల్లో సృజనాత్మకత అనేది కొరవడుతున్నది. దేశంలో నిరుద్యోగం రోజు రోజుకు పెరిగిపోతున్నది. చేతివృత్తులు, వ్యవసాయ రంగం ఒకదానికి మరొకటి విడిపోని నూలు పోగుదారం వలె పెనువేసుకున్న రంగాలు. వీటికి ఆధునికతను ఆపాదించి అభివృద్ధి పరచకుండా ఈ దేశంలో గుణాత్మకమైన మార్పును సాధించలేం.

○ చనగాని దయాకర్
టీపీసీసీ జనరల్ సెక్రెటరీ

జానపదానికి వన్నెతెచ్చిన ధ్రువతారలు

తెలుగు జానపద కళా చరిత్రలో శంకర్, సారంగపాణిలది సువర్ణాధ్యాయం. తమ మధురమైన జానపద పాటలతో తెలంగాణ కీర్తిని దశదిశలకు వ్యాపింపజేసిన కళాదిగ్గజాలు వారు. వరంగల్ జిల్లా కేంద్రంగా సృజించి, ప్రచారంలో పెట్టిన పాటలు వందలాదిగా ఉన్నాయి. ముఖ్యంగా యువతరానికి 1970–80 దశకాల్లో ఈ ఇద్దరూ ఒక రోల్ మోడల్. తెలంగాణ పల్లెల్లో పాటలేని ఊరు ఉండదు. మట్టిబిడ్డల దగ్గర ఉన్న జానపదాలను నిశితంగా పరిశీలించి, వాటిని తమ గొంతుల ద్వారా మరింత వన్నెకెక్కించారు.



1970లలో యువతను ఆకట్టుకుంటున్న జననాట్యమండలి పాటకు సమాంతరంగా జానపద పాటలతో పేరు తెచ్చుకున్నారు... తెలంగాణ మట్టిపల్లె నుండి ఎదిగి వచ్చిన శంకర్, సారంగపాణి.

వీరి కళాబృందంలో ఆర్కెస్ట్రాతో పాటు మైమ్, మిమిక్రీ వంటి కళలు కూడా ఉండేవి. ఎక్కడ ప్రోగ్రాం చేసినా ప్రజలను అమితంగా ఆకట్టుకునేవారు. పాటకు, మాటను, ఆటను జత చేసి ఉర్రూతలూగించారు. పల్లెటూరు ప్రజల అమాయకత్వాన్ని వీరి "అమ్మలారా... అయ్యలారా" పాట దృశ్యమానం చేసింది. పాటలో పల్లెటూరి యువకుడి కష్టాలను, పట్నపోళ్లు చేసే మోసాలను ఏకకాలంలో ఒక బ్యాలెగా రూపొందించి ప్రదర్శించేవారు. మూడు దశాబ్దాల పాటు వరంగల్ కేంద్రంగా ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా ఎవరో ఒకరు ఈ బ్యాలెను ప్రదర్శిస్తూనే వచ్చారు. అలాగే అత్తరుసాయబు, ఒల్లానోయి దేవా... ఓ చెల్లెమ్మా వంటి పాటలు జనాలను ఒక ఊపు ఊపిపడేశాయి. ఇక "మియ్యారు గుర్రాలు, మాయారు గుర్రాలు... పన్నెండు గుర్రాల బగ్గిపోతంది" అని శంకర్ పాడిన పాట ఇప్పటికీ ఏ జానపద ప్రేమికుడూ మరిచిపోలేడు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన ఎన్వీ రమణ సైతం ఒక సందర్భంలో శంకర్, సారంగపాణిల పాటలంటే నాకు ఇప్పటికీ ఇష్టమే అని ప్రకటించారు. అట్లా జానపదానికి కేరాఫ్‌గా శంకర్, సారంగపాణి ఎదిగి వచ్చారు. వీరిరువురు పాటెత్తుకుంటే జనాలు మైమరచిపోయేవారు.

శంకర్, సారంగపాణిలు వరంగల్‌లో స్టార్ సింగర్స్‌గా ఎదిగి వచ్చిన కాలం కూడా కీలకమైంది. అప్పటికే విప్లవోద్యమం వరంగల్‌ను కుదిపేస్తున్న కాలం. ఒకవైపు 1970లలో జననాట్యమండలి మొదలయ్యి యువతను పెద్దమొత్తంలో ఆకట్టుకుంటున్నది. అలాంటి సమయంలో జననాట్యమండలి పాటకు సమాంతరంగా జానపద పాటలతో పేరు తెచ్చుకున్నారు ఈ కళాకారుల ద్వయం. ఆ రోజుల్లో ఇది సాహసమనే చెప్పాలి. విప్లవోద్యమంలో ఎంతోమంది అప్పటికి మరణిస్తున్న కాలమది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానిక సీపీఐ నాయకుడు బి.ఆర్. భగవాన్ దాస్ ఈ ఇద్దరి మీద ఆ ప్రభావం పడకుండా కాపాడాడని ఇప్పటికీ అక్కడి ప్రజలు చెప్పుకుంటూనే ఉంటారు. ప్రజలందరు జననాట్యమండలి పాటకు వంత పాడుతున్న కాలంలో, తమ సొంత గొంతుకతో ప్రజలను ఆకట్టుకున్న జానపద కళాకారులు శంకర్, సారంగపాణి.

తమ సంగీతంతో బాలీవుడ్‌ను ఏలిన శంకర్, జైకిషన్ ద్వయంలా తెలంగాణను ఈ శంకర్, సారంగపాణిల జంట ఏలిందంటే అతిశయోక్తి కాదు. కాకతీయుల రాజధానిగా ఉన్న వరంగల్, శాతవాహనుల రాజధానిగా ఉన్న కరీంనగర్‌ల నుంచి అనేకమంది కళాకారులు వచ్చారు. అలా వచ్చిన వారి మీద శంకర్, సారంగపాణిల పాటల ప్రభావం ఎంతగానో ఉంది. రెండు మూడు తరాలను ప్రభావితం చేసిన కళా శిఖరాలు వీరు ఇరువురు. ఎలాంటి యూట్యూబ్‌లు, సోషల్ మీడియాలు లేని కాలంలో వీరి పాటలు పల్లెపల్లెకు క్యాసెట్లు, మైకుసెట్ల రూపంలో వెళ్లాయి. ఎక్కడ ఏ శుభకార్యం జరిగినా అక్కడ వీరి పాట మార్మోగాల్సిందే.

శంకర్ నేపథ్య గాయకునిగా సినిమాల్లో కొన్ని పాటలు ఆలపించాడు. ఆర్. నారాయణమూర్తి అందుకు అవకాశం కల్పించాడు. ఎంతటి హైపిచ్ పాటనైనా అవలీలగా పాడి ఆశ్చర్యపరచడం శంకర్‌కు 'గటకతో పెట్టిన విద్య'. ఒక సందర్భంలో సినీగాయనీ గాయకులతో పాట పాడడానికి స్టూడియోకి వెళ్లాడు శంకర్. ఇతడి వాలకం చూసి అక్కడున్న వారు తక్కువ అంచనా వేశారు. కానీ తర్వాత ఆయన గొంతు విప్పి "బండెనుక బండికట్టి..." పాట అందుకుంటే స్కేల్ పతాక స్థాయి దాటింది. దాంతో సదరు సినీ గాయకులు శంకర్‌కు పాదాభివందనం చేశారు. ఇక సారంగపాణి గాయకుడిగానే కాక వందలాది పాటలకు స్వరకల్పన చేసి బాణీలు కట్టిన అనుభవంతో సంగీత దర్శకునిగా మారాడు. అదే సమయంలో రైలు ప్రమాదంలో కనుమూశాడు. ఇవాళ ఈ ఇద్దరు మన ముందు లేకపోవచ్చు గానీ, వారి స్వరం మాత్రం ఇంకా కళాకారుల గుండెల్లో మార్మోగుతూనే ఉంది.

■ పసునూరి రవీందర్
తెలంగాణ సాంస్కృతికశాఖ సలహామండలి సభ్యుడు

(నేడు హన్మకొండ కాళోజీ కళాక్షేత్రంలో శంకర్, సారంగపాణి యాదిలో 'జానపద జాతర')



బోనమెత్తిన మంత్రి సురేఖ

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పోచమ్మ తల్లి బోనం ఎత్తారు. గీసుగొండ మండలంలోని తమ స్వగ్రామం వంచనగిరిలో బుధవారం సాయంత్రం జరిగిన బోనాల వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. తమ ఇంటి నుంచి బోనంతో బైలెల్లి, గ్రామస్థులతో కలిసి అమ్మవారికి సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్టు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, గీసుగొండ

మీనాక్షి 'జనహిత' యాత్రకు ఏర్పాట్లు



- 25, 26 తేదీల్లో హనుమకొండ జిల్లా పరిధిలో నిర్వహణ
- 25న ఉప్పరపల్లి నుంచి వర్ధన్నపేట వరకు..
- 26న పలు కార్యక్రమాలకు హాజరు
- హనుమకొండలో ఇరు జిల్లాల పార్టీ శ్రేణులతో సమావేశం

6


నిధుల వరద

రాబోయే మేడారం మహా జాతరకు రూ.150 కోట్ల కేటాయింపు

- వీటిలో ఐదు కీలక శాఖలకు రూ.90.87 కోట్ల నిధులు
- ఈ సారి ఐదు నెలల ముందే నిధులు విడుదల
- పారదర్శకంగా, శాశ్వత, నాణ్యతతో పనులు చేపట్టేందుకు అవకాశం
- 2024 జాతరకంటే రూ.45 కోట్లు నిధులు అదనం
- జనవరి 28నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాజాతర
- కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను కేటాయించింది. వీటిలో కీలకమైన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, గిరిజన సంక్షేమశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్(పారిశుధ్యం) శాఖలకే రూ.90.87కోట్ల నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించటంతో పాటు ప్రశాంతంగా తల్లులను దర్శించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయింపులు చేసింది. ఐదు నెలల ముందే నిధులు విడుదల కావటంతో నాణ్యతతో పనులు నిర్వహించేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టే అవకాశం ఉంది. పదేళ్ల తరువాత భారీ మొత్తంలో నిధులు కేటాయింపులు చేయటంతో హర్షం వ్యక్తం అవుతోంది.



రూ.150 కోట్లు కేటాయింపు...

మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహాజాతరను నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు రానున్నారు. 2026 మహాజాతరకు సుమారు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో శాశ్వత నిర్మాణాలతో పాటు రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధికి పనులకు ప్రభుత్వం నిధుల కేటాయింపులు చేసింది. వీటిలో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్‌శాఖకు

(మిగతా 7లో...)

2026 మహా జాతరకు వివిధ శాఖలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలు..

శాఖ	కేటాయించిన నిధులు
పంచాయితీరాజ్	రూ.51.00 కోట్లు
ఆర్అండ్‌బీ	రూ.9.95 కోట్లు
ఇరిగేషన్/సీఏడీడీ	రూ.5.90 కోట్లు
ట్రైబల్ వెల్ఫేర్(ఇంజనీరింగ్)	రూ.8.75 కోట్లు
ఆర్‌డబ్ల్యుఎస్(సానిటేషన్)	రూ. 15.15 కోట్లు
మొత్తం	రూ. 90.87 కోట్లు

నాన్ సివిల్ వర్క్స్ శాఖలు

శాఖ	కేటాయించిన నిధులు	శాఖ	కేటాయించిన నిధులు
జిల్లా పంచాయితీశాఖ	రూ. 11.62 కోట్లు	అటవీశాఖ	రూ. 50 లక్షలు
అగ్నిమాపకశాఖ	రూ.0.30 కోట్లు	మహిళా, శిశు, దివ్యాంగుల శాఖ	రూ.25 లక్షలు
మత్స్యశాఖ	రూ.0.23 కోట్లు	రెవెన్యూశాఖ	రూ.14.38 కోట్లు
పశుసంవర్ధకశాఖ	రూ.0.30 కోట్లు	దేవాదాయశాఖ	రూ.1.75 కోట్లు
ట్రైబల్ వెల్ఫేర్ (ఐటీడీఏ)	రూ.2.50 కోట్లు	ఎక్సైజ్‌శాఖ	రూ.25.00 లక్షలు
పౌర సంబంధాల శాఖ	రూ.57.85 లక్షలు	టూరిజంశాఖ	రూ.90 లక్షలు
వైద్య, ఆరోగ్యశాఖ	రూ.1.07 కోట్లు	విద్యుత్‌శాఖ	రూ.5.00 కోట్లు
పోలీసుశాఖ	రూ. 14.50 కోట్లు	రోడ్డు రవాణాశాఖ (ఆర్టీసీ)	రూ.5.00 కోట్లు
		మొత్తం:	రూ.59.13 కోట్లు

యూరియాకు కొరత లేదు..

నానో యూరియా ప్రాముఖ్యతను వివరించాలి : కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, యూరియా పంపిణీకి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అవసరం మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు యూరియాను కేటాయించామన్నారు. యూరియా పంపిణీలో వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పంపిణీ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీరోజు ఒక్కో మండలంలో మూడు గ్రామాలకు యూరియా అందించేలా ముందస్తు టోకెన్లు అందజేయాలని, ఆ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ప్రాథమిక సహకార కేంద్రాల వద్దకు ఎక్కువ మంది రైతులు వస్తున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. యూరియాకు బదులు నానో యూరియా ప్రాముఖ్యతను రైతులకు వివరించాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు

మూడు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు

కాజీపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి పొందిన కాజీపేట దర్గా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు కొనసాగనున్నాయి. గురువారం నుంచి శనివారం వరకు జరుగనున్నాయని, ఈ ఉత్సవాలకు దేశవ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున హాజరుకానున్నారని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా చెప్పారు. కాజీపేట దర్గాలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఉత్సవానికి సంబంధించి వివరాలు వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా బడే ఘర్ నుంచి వెండి పాత్రలో గంధలేపనం, వస్త్రాలను, రోజ్ వాటర్‌ను గుర్రాలు, బ్యాండ్ మేళాలతో సంధల్ యాత్ర బియాబాని సమాధికి వరకు చేరుకుంటుంది. అక్కడ రోజ్ వాటర్‌తో బియాబాని సమాధిని కడిగి శుద్ధిచేసి, గంధలేపనాన్ని పూసి, పూలమాలలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. శుక్రవారం సర్వమతాలు ఒక్కటే అనే అంశంతో యూనిటీ కాన్ఫరెన్స్‌తో పాటు దర్గాలో భక్తులు మొక్కులు చెల్లిస్తూ ఉత్సవం కొనసాగుతుంది. శనివారం బదావా ఫకీర్ల విన్యాసాలు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో ఉర్సు ఉత్సవం ముగింపు ఉంటుంది. ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం అందించామని, రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా ఇతర దేశాలనుంచి భక్తులు పెద్దఎత్తున హాజరు కానున్నారని ఖుస్రుపాషా చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ అబూబాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బియాబాని పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో దర్గా



ప్రమాద స్థలంలో నుజ్జు నుజ్జైన కారు





ప్రమాదంలో మృతిచెందిన సురేశ్, దివ్య

అయ్యో.. బిడ్డలారా!

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల దుర్మరణం





స్వల్పగాయాలతో బయటపడ్డ మోక్షజ్ఞ, లోక్షణ

- కారులో కలిసి ప్రయాణిస్తుండగా ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడిన ఇద్దరు పిల్లలు
- కల్వర్టును బలంగా ఢీకొట్టిన కారు
- వడ్డిచర్ల వద్ద ప్రమాదం.. మృతులు నెల్లూరు జిల్లావాసులు
- నిద్రలేమితో డ్రైవింగ్ చేయడమే కారణమని అనుమానాలు

7

ఉత్సాహంగా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ 7

ఇంజన్ ఫెయిల్ కావడంతో..

ఇంటికన్నెలో రెండు గంటలపాటు నిలిచిన 'ఎల్‌టీటీ'



ఇంటికన్నెలో ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు అమరుస్తున్న మరో ఇంజన్



కేసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం అప్‌లైనులో రైలు నెంబరు 18519 విశాఖపట్నం నుంచి ముంబై లోకమాన్య తిలక్ టర్మినస్(ఎల్‌టీటీ) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటల పాటు నిలిచింది. ఉదయం 10గంటల ప్రాంతంలో ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఇంటికన్నె రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం వద్దకు రాగానే ఇంజన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో నిలిచిపోయింది. సిబ్బంది మరమ్మతులకు ప్రయత్నించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వరంగల్ వైపు నుంచి కొత్త ఇంజన్‌ను తీసుకువచ్చి ఇంటికన్నెలో నిలిచిన ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు అమర్చిన అనంతరం రైలు ముందుకు కదిలింది. ఈ ఘటన ఫలితంగా రెండు గంటలపాటు అప్‌లైనులో వెనుకనున్న కొన్నిస్టేషన్ల వరకు రైళ్లు నిలిచిపోయాయి. గుంటూరు నుంచి సికింద్రాబాద్(17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను మహబూబాబాద్‌లో గంటకుపైగా నిలిపారు. ఆ తర్వాత గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ముందుకు కదిలి తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మహబూబాబాద్‌లో సుమారు 20నిమిషాల పాటు నిలించింది. అనంతరం ఎల్‌టీటీ ముందుకు కదలగా ఆ వెనుకనే ఉన్న గోల్కొండ, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా యథావిధిగా కొనసాగాయి. ఈ ఘటనతో గంటల తరబడి పడిగాపులు పడుతూ ఆయా రైళ్లలో, రైల్వేస్టేషన్లలో రైలు కోసం వేచి ఉన్న ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

సామాగ్రి జప్తునకు కోర్టు సిబ్బంది యత్నం

● అడ్డుకున్న నేషనల్ హైవే కార్యాలయ సిబ్బంది

● హనుమకొండ జిల్లా జడ్జి ఉత్తర్వులు బేఖాతరు



కోర్టు సిబ్బందిని అడ్డుకుంటున్న నేషనల్ హైవే ఉద్యోగులు

వరంగల్ లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే రోడ్డు కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేసినందుకు హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు సదరు కార్యాలయం చరాస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. ఆదేశాల అమలు కోసం బుధవారం హంటర్‌రోడ్డులోని నేషనల్ హైవే కార్యాలయానికి కోర్టు సిబ్బంది వెళ్లారు. ఆఫీసు సామగ్రి జప్తు చేస్తుండగా మేనేజర్, ఇతర సిబ్బంది కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా కోర్టు సిబ్బందిని అడ్డుకున్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు పరుస్తున్నామని, తమ విధులకు ఆటంకం కలిగించవద్దని తెలియజేసినప్పటికీ వినకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. నేషనల్ హైవే కింద సుమారు 13 గ్రామాలు 2013లో భూసేకరణ చేసి నేషనల్ హైవే అధికారులు భూ నిర్వాసితులకు నామమాత్రపు పరిహారం చెల్లించడంతో పైడిపెల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కోర్టును ఆశ్రయించడంతో చరాస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేశారు.

బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాపాక గోపీకృష్ణశర్మ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వరంగల్ నగరానికి చెందిన రాపాక గోపీకృష్ణ శర్మ ఎంపికయ్యారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలో జరిగిన ఎన్నికల్లో ఆయనను తిరిగి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామన్న నియామక పత్రం అందజేశారు. ఆరు సంవత్సరాల నుంచి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొనసాగుతున్న గోపీకృష్ణ శర్మ తిరిగి ఎన్నిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు.

లైబ్రేరియన్‌కు ఉస్మానియా డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న రాజేశ్వర్‌రావు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుండా రాజేశ్వర్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను తీసుకున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఓయూ వీసీ కుమార్ చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఆయన లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసి పట్టాను సాధించారు.

వాహనాల సమాచారం నమోదు చేయండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

రాంపూర్ డంపింగ్ యార్డ్ పరిశీలన



రాంపూర్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో చెత్త తరలిస్తున్న వాహనాల సమాచారం నమోదు జరగాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం వరంగల్ మునిసిపల్ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డ్‌ను అక్కడి సిబ్బందితో కలిసి పరిశీలించారు. సమర్థవంతంగా పనులు చేపట్టేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ నిధులతో ఇక్కడ చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. డంపింగ్ యార్డ్‌కు వచ్చే వాహనాలు ప్రతీ రోజు ఎన్ని ట్రిప్పులు చేస్తున్నాయనేది శానిటరీ జవాన్‌లు రికార్డు చేయాలన్నారు. వాహనాలకు సంబంధించిన లాగ్‌బుక్‌లు తప్పకుండా బండి వెంట ఉంచుకోవాలన్నారు. సరిగా విధులు నిర్వర్తించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్‌లో క్లీన్ చేసిన 17 ఎకరాల స్థలంలో చెత్తను డంప్ చేయాలని స్మార్ట్‌సిటీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, డీఈ రవికిరణ్, ఏఈలు రామన్న, సంతోష్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, స్మార్ట్‌సిటీ అధికారి ఆనందం పాల్గొన్నారు.

ఆదాయాన్ని పెంపొందించే యూనిట్లపై దృష్టి సారించండి

పట్టణ సమాఖ్యలు ఆదాయాన్ని పెంపొందించే యూనిట్లపై దృష్టి సారించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం భీమారంలోని కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన రుద్రమాదేవి టీఎల్‌ఎఫ్ నెలవారీ కార్యక్రమానికి కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్యలు క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు పొదుపు సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. లోన్లకు సంబంధించిన నగదు సకాలంలో చెల్లించాలన్నారు. ప్రస్తుతం 13 టీఎల్‌ఎఫ్ యూనిట్లు ఉన్నాయని ఇంకా పెద్ద యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో 150 మంది కూర్చోవడానికి వీలుగా థియేటర్‌ను నిర్మించానని గుర్తు చేశారు. వరంగల్ నగరంలో చాలా ఫంక్షన్ హాల్స్ ఉన్నాయని అందుకు అనుగుణంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. ఆ దిశగా సమాఖ్యలు ప్లాన్ చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీలు రమేష్, వెంకటరెడ్డి, కమ్యునిటీ ఆర్గనైజర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వరంగల్ ప్రభ మసక బారకుండా చేయండి

దేశంలోని నగరాలతో పోటీ పడేలా చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ కూరపాటి



మాట్లాడుతున్న కూరపాటి వెంకట్‌నారాయణ

సంగెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తర్వాత అభివృద్ధిలో ముందులో ఉన్న వరంగల్ మహా నగరాన్ని పాలకులు నిర్లక్ష్యం చేయొద్దని, మసక బారకుండా చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో అజాం జహీ మిల్లు మూసివేతకు గురైందని, సంప్రదాయ కుల వృత్తులు కాలగర్భంలో కలిసిపోతున్నాయని ఆరోపించారు. స్వరాష్ట్రంలో కూడా గత పాలకులు తమ ప్రయోజనాల కొరకు వరంగల్‌ను చెక్కలు ముక్కలుగా చేశారన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నిర్లక్ష్యం చేయకుండా యువతకు ఉపాధి మార్గాలు చూపాలన్నారు. మామూనూరు ఎయిర్ పోర్టును, ఇతర మౌలిక సదుపాయాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం మహా నగరంలో వివిధ కూడళ్లను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలన్నారు. ఫార్మసీ, ఐటీ రంగాల్లో కూడా వరంగల్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నగరానికి ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పనులు, అండర్ డ్రైనేజీ పనులు సమష్టి కృషితో సమన్వయంతో చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త సోమ రాంమూర్తి, సోమిడి శ్రీనివాస్, ఓదెల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో ఎంజీఎం వార్డులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రి పలు వార్డుల్లో చీకటి రాజ్యమేలుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వెలుతురు లేకపోవడం వల్ల వార్డులన్నీ చీకటిమయంగా మారాయి. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ట్యూబ్ లైట్లు వెలగకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని వార్డుల్లో చికిత్స అందించాలన్న కష్టంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. ఫీమేల్ సర్జికల్, మేల్ సర్జికల్, జనరల్ మెడిసిన్, ఆరోగ్యశ్రీ, ఫీమేల్ జనరల్ వార్డు, న్యూ ఎంఎంవెస్ట్, వెస్ట్‌తోపాటు ఆర్థో విభాగాల్లోని కొన్ని వార్డులు చీకటిగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళలో ఈ ప్రాంతంలో కొందరు మద్యం కూడా సేవిస్తున్నట్లు తెలుస్తోంది. సెక్యూరిటీ వారికి కనిపించకుండా చీకట్లో రోగి అటెండెన్స్ జల్సాలకు దిగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి ట్యూబ్ లైట్లు అమర్చాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గర్భాలయంలో స్తంభం మీద కురుస్తున్న దృశ్యం

కురుస్తున్న భద్రకాళి ఆలయ గర్భాలయం

మరమ్మతుల పేరుతో చెక్కులు జారీ?

పట్టించుకోని అధికారులు, ధర్మకర్తలు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ఓ స్తంభంపై నీరు కురుస్తోంది. ఆరు నెలల కిందటే దీన్ని గుర్తించిన అధికారులు మరమ్మతు కోసం అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసినట్లు వినికిడి. ఖర్చుల పద్దు కింద రాసినట్లు సమాచారం. అయితే అసలు మరమ్మతులు చేయించారా? లేదా..? చేయిస్తే ఎందుకు మళ్లీ కురుస్తోంది అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమ్మవారి దర్శనానికి ఆలయానికి రాగా, వర్షం నీరు ఆయనపై పడడంతో వెంటనే మరమ్మతులు చేయించండని అధికారులకు సూచించారు. కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఆలయానికి కమిటీ ఏర్పడి 45 రోజులు అవుతోంది. అయినా ఇప్పటి వరకు అధికారులు గానీ, ధర్మకర్తలు గానీ పట్టించుకోక పోవడం శోచనీయం. ఆలయ చైర్మన్, కొత్తగా వచ్చిన ఈవో కూడా ఈ విషయం పట్ల ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరమ్మతు విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

హనుమకొండ టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సుబేదారి సీఐ మేకల రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో దీన్‌దయాల్ నగర్‌కు చెందిన పిట్టల సౌజన్య (23), భర్త పిట్టల చిరంజీవి, అత్త సమ్మక్క అదనపు వరకట్నం కోసం శారీరకంగా వేధించడంతో ఈ నెల 16న పురుగుల మందు తాగింది. ఎంజీఎం అస్పత్రికి తరలించి చికిత్స అందించగా మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కాగా, మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భర్త చిరంజీవి, అత్త సమ్మక్కపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు వరంగల్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

ఓటేయనున్న 6,368 మంది

ఏవీవీ కళాశాలలో పోలింగ్, లెక్కింపు

12 డైరెక్టర్ స్థానాలకు 25 మంది పోటీ



వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్

వరంగల్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. మట్టెవాడ ఏవీవీ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల అధికారి ఎం.వాల్యానాయక్ ఆధ్వర్యంలో పోలింగ్ జరుగుతుంది. ఓటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ ఫొటో గుర్తింపుకార్డును చూపించి ఓటు వేయాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పది శాఖల నుంచి 6368 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అనంతరం ఓట్లను లెక్కించి విజేతల పేర్లను ప్రకటిస్తారు. బ్యాంక్ పాలకమండలిలో 12 మంది డైరెక్టర్లు ఉంటారు. కానీ ఎన్నికల బరిలో 25 మంది నిలిచారు. ఇందులో ఎస్సీఎస్టీ కోటా నుంచి ఒకరు, మహిళా కోటా నుంచి ఇద్దరు, ఓపెన్ క్యాటగిరి నుంచి 9 మంది మొత్తం 12మందిని ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి తెలిపారు.

జోష్‌మీదున్న ప్రదీప్‌రావు ప్యానెల్

1995లో బ్యాంక్‌ను స్థాపించారు. మొదట భూపతి కృష్ణమూర్తి చైర్మన్‌గా ఐదేళ్లపాటు కొనసాగారు. తదుపరి 2000వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఏకదాటిగా 25 సంవత్సరాలుగా కొనసాగుతూ వచ్చారు. ఆయన బ్యాంక్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పది శాఖలుగా విస్తరించారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రదీప్‌రావు, ఆయన ప్యానెల్ సభ్యులు పోటీలో ఉన్నారు. విస్తృతంగా ప్రచారం చేశారు. బ్యాంక్ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వ్యాపారవర్గాలను, బ్యాంక్ వాటాదారులను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎవరికి వారే..

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో మొత్తం 25మంది పోటీలో ఉండగా 12 మంది ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నాయకత్వంలో ప్యానెల్‌గా ఏర్పడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మిగితా 13 మంది పోటీలో ఉన్నప్పటికీ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోకపోవడంతో ఎవరికి వారే ఎన్నికల ప్రచారం నిర్వహించుకున్నారు. తమను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, విజేత తలెవరో మరి కొద్ది గంటల్లోనే తెలిసే అవకాశం ఉంది.

తొలుత కొండా వర్సెస్ ఎర్రబెల్లి..

వరంగల్ అర్బన్ బ్యాంక్ పాలకమండలి పదవీకాలం గత జూలై 30తోనే ముగిసింది. అంతకు ముందే ఎన్నికలు నిర్వహించాలని పాలకమండలి సహకార అధికారిని కోరింది. అయితే బ్యాంక్ లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని, ఓటరు లిస్టు సరిగ్గా లేదనే కారణంతో వాయిదా వేశారు. దీంతో ప్రదీప్‌రావు విలేకరుల సమావేశం నిర్వహించి ఇదంతా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావులే వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు వాయిదా వేయించి పర్సన్ ఇన్‌చార్జితో బ్యాంక్‌ను నడిపించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రదీప్‌రావు వ్యాఖ్యలపై కొండా దంపతులు స్పందించలేదు. ఈ క్రమంలో సహకార అధికారి ఎన్నికల తేదీని ప్రకటించడంతో కొండా ప్యానెల్, ఎర్రబెల్లి ప్యానెల్ మధ్య హోరాహోరీ ఉంటుందని భావించారు. కానీ అదేమీ జరుగలేదు.

మీనాక్షి 'జనహిత' యాత్రకు ఏర్పాట్లు

25, 26 తేదీల్లో హనుమకొండ జిల్లా పరిధిలో నిర్వహణ

25న ఉప్పెరపల్లి నుంచి వర్ధన్నపేట వరకు..



సమావేశంలో పార్టీ శ్రేణులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రెండు రోజుల పాటు హనుమకొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఆమె హనుమకొండ జిల్లాలో పర్యటిస్తారు. తొలి రోజున వర్ధన్నపేట, ఆ తరువాత హనుమకొండలో జరిగే వరంగల్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటనలో ప్రధానంగా పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ తరువాతి రోజు శ్రమదానం, తదితర కార్యక్రమాలతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ సమావేశంలో పాల్గొననున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు జిల్లా మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తదితర నేతలు పాదయాత్రలో పాల్గొననున్నారు.

కరీంనగర్ నుంచి జిల్లాలోకి ప్రవేశం

మీనాక్షి నటరాజన్ కరీంనగర్ జిల్లా మానకొండూరు నుంచి పాదయాత్రలో భాగంగా 25న హనుమకొండ జిల్లాకు చేరుకుంటారు. ఆమె నేరుగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పెరపల్లికి సుమారు సాయంత్రం 3 గంటలకు వస్తారు. అక్కడి నుంచి వర్ధన్నపేట వరకు ఆరు కిలో మీటర్ల పాదయాత్ర చేసి రాత్రి అక్కడే బస చేస్తారు. 26న వర్ధన్నపేటలోనే శ్రమదానం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఐనవోలు దేవస్థానంలో దర్శనం చేసుకుని అక్కడి నుంచి హనుమకొండలో జరిగే వరంగల్, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ సమావేశానికి హాజరవుతారు. శ్రేణుల ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆపై హైదరాబాద్‌కు పయనం కానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పార్టీ శ్రేణుల సన్నద్ధం

మీనాక్షి నటరాజన్ పాదయాత్ర వాస్తవంగా ఈ నెల తొలి వారంలోనే జరగాల్సి ఉంది. అయితే ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల ధర్నా నేపథ్యంలో రద్దు అయ్యింది. రీషెడ్యూల్ ప్రకారం 25, 26 తేదీల్లో జిల్లాలో పాదయాత్రను నిర్దేశించారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహణకు సన్నద్ధం అవుతున్నారు. ఇందు కోసం బాధ్యతలు విభజించుకొని ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఈ మేరకు హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో బుధవారం శ్రేణులతో సమావేశమై మీనాక్షి నటరాజన్ పాదయాత్ర, విజయవంతం తదితర అంశాలను చర్చించారు.

భీమానాయక్‌కు డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న డాక్టర్ భీమానాయక్

నర్సంపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జోన్ వరంగల్ చీఫ్ కన్సర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ ధారావత్ భీమానాయక్ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. నర్సంపేట మండలంలోని ఇప్పల్‌తండా గ్రామ పంచాయతీ శివారులోని లాల్‌నాయక్ తండాకు చెందిన లాల్‌నాయక్ - అంకీబాయి దంపతుల చిన్న కుమారుడు భీమానాయక్. 1994లో మెకానిక్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం 1996లో ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం 2004లో చీఫ్ కన్సర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భద్రాద్రి సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 2017-2018 విద్యా సంవత్సరం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్ కాగా, మెకానికల్ అండ్ ట్రైబోలాజికల్ ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్ హైబ్రిడ్ ఫైబో ఎలుమినా అండ్ నానో గ్రాఫేనే బెసిడ్ గ్లాస్ ఫైబర్ ఎపెక్సీ కంపోసైడ్స్‌లో డాక్టరేట్ పూర్తి చేశాడు. ఐఎస్ఆర్‌వో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ విద్యావేత్త కుమార్ మొలుగారం చేతుల మీదిగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

బీసీల కోసం పోరాడిన వ్యక్తి సంపత్‌రాజారాం

వర్ధంతి సభలో కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్



సంపత్‌రాజారాం విగ్రహానికి పూలమాల వేస్తున్న సుందర్‌రాజ్‌యాదవ్

పోచమ్మమైదాన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, బీసీ హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ధర్మపురం సంపత్ రాజారాం యాదవ్ అని కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆరెపల్లిలో నిర్వహించిన 13వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంపత్‌రాజారాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్, డాక్టర్ విజయలక్ష్మి, ఏసీపీ రవీందర్‌కుమార్, గడ్డం భాస్కర్, డాక్టర్ కూరపాటి రమేష్, గుండు అశోక్, గిరిబోయిన రాజయ్యయాదవ్, బనక సంపత్‌యాదవ్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, కావటి కవితయాదవ్, కంకణాల మల్లేశం, డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్, ఎర్ర శ్రీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7675	5300
మక్కలు	2216	1521
కందులు	5852	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6920	3450
పల్లికాయ (పచ్చిది)	5050	1575
పసుపు (కాడి)	11022	9534
పసుపు (గోల)	10099	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	14200	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖర్

- ములుగు మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్
- కేయూలో రెండో రోజు సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు
- అబ్బుర పరిచిన చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లు
- నేటితో ముగియనున్న సైన్స్ కాంగ్రెస్

కేయూ క్యాంపస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధులు లేని విధంగా ప్రజలు ఆరోగ్యమైన జీవన ప్రమాణాల పెంపుకోసం కృషి జరుగుతోందని ములుగు మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ వి. చంద్రశేఖర్ అన్నారు. కేయూలో జరుగుతున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, టెక్నికల్ సెషన్లు, విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్లు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగిన సెషన్‌లో 'జీవన ప్రమాణాలు-లైఫ్ ఎక్స్‌టెన్సీ' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. 1950లో వ్యక్తుల సగటు వయస్సు 46 ఏళ్లుగా ఉండేదని, తర్వాత 70ఏళ్లకు పెరిగిందన్నారు. సైన్స్, టెక్నాలజీలో రూపొందించిన ఔషధాలతో అంటువ్యాధుల నిర్మూలన సాధ్యం అయిందన్నారు. షుగర్, రక్తపోటు, గుండె జబ్బులులతో పాటు క్యాన్సర్లు ఎక్కువగా విస్తరిస్తున్నాయని అన్నారు. తద్వారా పెరిగిన ఆయుర్ధాయంలో నాణ్యత లోపించిందన్నారు. సగటు మనిషి జబ్బులతో సమాజానికి ఆర్థిక భారాన్ని పెంచుతున్నారని విశ్లేషించారు. దీర్ఘకాలిక వ్యాధుల్లేని జీవనం కావాలని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంచుకోవాలని సూచించారు. హైదరాబాద్ బిట్స్‌పిలానీ బయోలాజికల్ సైన్స్ ప్రొఫెసర్ నిశీత్‌గుప్తా బయోలాజికల్ సైన్స్ ప్రా ముఖ్యతను వివరించారు. సెషన్‌కు చైర్మన్‌గా ప్రొఫెసర్ జానపురెడ్డి కృష్ణవేణి వ్యవహరించగా, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ సిద్ది వీరేశం, శాస్త్రవేత్తలు, ఫార్మసిస్టులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ ఆవశ్యకతపై బొల్లికుంట పాఠశాల విద్యార్థులు రూపొందించి నమూనాను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ స్వర్ణలత

క్యాన్సర్ ట్యూమర్లను ముందే గుర్తించవచ్చు..

చిన్న ఎక్స్‌ట్రా సెల్యూలర్ వెసికుల్స్ ట్యూమర్ కణాల సమాచారాన్ని ముందే గుర్తించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చునని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల హైదరాబాద్ ప్రొఫెసర్ గీతా కె.వేముగంటి చెప్పారు. కేయూ సెనెట్ హాల్‌లో మహిళా శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గీతా కె.వేముగంటి కీలక ప్రసంగం చేశారు. చిన్న ఎక్స్‌ట్రా సెల్యూలర్ వెసికుల్స్ ట్యూమర్ కణాల మధ్య సమాచార మార్పిడిలో కీలకంగా వ్యవహరిస్తాయని చెప్పారు. వెసికుల్స్ ఇమ్యూన్ సిస్టమ్‌ను తప్పించుకునేవిధంగా పనిచేసి క్యాన్సర్‌సెల్స్‌రక్షణపొందేలా చేస్తాయని తెలిపారు.

హైదరాబాద్ ఐఐటీసీ ప్రొఫెసర్ సుంకర వర్ధినేని మనోరమ ప్రసంగిస్తూ.. వ్యక్తి, సమాజం తాత్కాలికంగా ప్రారంభించిన జీవన ప్రయాణ క్రమం వారి జీవన విధానంగా రూపొందుతుందని అన్నారు. ప్రతీ ప్రయాణం అభివృద్ధి, సేవ, సాంస్కృతిక మార్పు వైపునకు దారితీస్తోందని అన్నారు. హైదరాబాద్ డీఆర్‌డీవో శాస్త్రవేత్త టి.వెంకటమణి వ్యవస్థలో వస్తున్న ఆధునిక పోకడలపై మాట్లాడారు. యంగ్ సైంటిస్టుల మీట్‌లో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ సైంటిస్టు ప్రొఫెసర్ రామచంద్రరావు మాట్లాడుతూ.. క్యాంటం,డ్రాట్స్‌పై సౌర పటాలాలు, వైద్య రంగంలో క్యాంటం, కంప్యూటింగ్‌పై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త హర్షిత్‌రెడ్డి గంగుల అరుదైన భూ మూలకాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వరంగల్ కేఎంసీ సైంటిస్టు డాక్టర్ బి.ఫణికాంత్ జోగం మాట్లాడుతూ.. ప్రొటీన్ల మార్పిడి పై విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఫిజిక్స్ విభాగంలో హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ ఎస్.శ్రీనాథ్ అయస్కాంత పదార్థాలు రోజువారి వినియో గం, ఉపయోగాలపై మాట్లాడారు.



సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ జ్యోతి, ఇస్తారి, మమత, ఇతర అధ్యాపకులు



అబ్బురపరిచిన చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లు

యూనివర్సిటీ ఆడిటోరియం వద్ద చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లతో మినీ ప్రపంచం కన్పిస్తోంది. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులు అబ్బుర పరిచే సైన్స్ ఎగ్జిబిట్లను రూపొందించి ప్రదర్శించి తమ ప్రతిభను చూపారు. మాదక ద్రవ్యాలతో మానవ శరీరంలో సంభవించే దుష్ఫలితాలను వివరించారు. విద్యుత్ అవసరం లేకుండా చార్జింగ్ ప్రక్రియ, సోలార్ శక్తితో నడిచే యంత్రాలను తయారుచేసి ఔరా అనిపించారు. ట్రాఫిక్ నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విచ్చలవిడి డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను చూపించారు. చంద్రయాన్-3, నమునా, మరయంత్రం, స్మార్ట్ సిటీ, వాతావరణ కాలుష్యంతో పర్యావరణ ప్రభావం, సంప్రదాయ, సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని నమూనారూపంలో అబ్బురపరిచే విధంగా చూపించారు. బొల్లికుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు నగరంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ముగింపు సమావేశం

కాకతీయ యూనివర్సిటీలో రెండురోజులుగా జరుగుతున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, ఎగ్జిబిషన్లు, సదస్సులు గురువారంతో ముగియనున్నాయి. ముగింపు సమావేశం కేయూ ఆడిటోరియంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుంది. దీనికి విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, కడప యోగి వేమన మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.రామచంద్రారెడ్డి, తెలంగాణ సైన్స్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, రాష్ట్ర కాలేజీయేట్ కమిషనర్ ఎ.శ్రీదేవసేన, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ జి.హన్మంతు, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డిలు పాల్గొంటారని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు.

సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్సాహంగా ప్రజంటేషన్లు

- హాజరైన దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో రెండో రోజు బుధవారం కామర్స్, ఫిజిక్స్, మ్యాథ్స్ ఫార్మసీ, జువాలజీ విభాగాల సెమినార్ హాల్‌తోపాటు ఆడిటోరియంలో జరిగిన ప్లీనరీలు, లెక్చర్లు, ప్రజంటేషన్లపై వివరాలను తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ 2025 ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. కామర్స్ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్, 5, ఓరల్ ప్రజంటేషన్లు 8, సెనెట్ హాల్‌లో ఇన్‌వైటెడ్ లెక్చర్, ఉమెన్ సైంటిస్టు మీట్‌లు 3, కేయూ ఆడిటోరియంలో థీమటిక్ సెషన్లు, సైన్స్ ఎగ్జిబిషన్, ఫిజిక్స్ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చరు 4, ఓరల్ ప్రజంటేషన్లు 11, పోస్టర్ ప్రజంటేషన్లు 7, గణిత విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 3, ఓరల్ ప్రజంటేషన్లు 10, పోస్టర్ ప్రజంటేషన్లు 6, కెమిస్ట్రీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 10, పోస్టర్ ప్రజంటేషన్లు 8, ఫార్మసీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 23, ఓరల్ ప్రజంటేషన్లు 4, పోస్టర్ ప్రజంటేషన్లు 4, ఫార్మసీ విభాగంలోని మినీ సెమినార్ హాల్‌లో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 4, పోస్టర్ ప్రజంటేషన్లు 5, జువాలజీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 8, పోస్టర్ ప్రజంటేషన్లు 10 జరిగినట్లు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. మొత్తంగా ఇన్‌వైటెడ్ లెక్చర్ 23, ఓరల్ ప్రజంటేషన్లు 58, పోస్టర్ ప్రజంటేషన్లు 40లు జరిగాయి.

హోరెత్తించిన నృత్యాలు

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాల్లో భాగంగా బుధవారం రాత్రి కేయూ ఆడిటోరియంలో సాంస్కృతిక సంబురాలు జరిగాయి. కళాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేసి హోరెత్తించారు. నర్సంపేటకు చెందిన చోటు డప్పు కళాబృందం, వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థిని ఎం.సాయి తులసీ స్వాగత నృత్యం, ఆదిలాబాద్ జిల్లా కల్చర్ మధూరి నృత్యం, అల్లం జంపయ్య గ్రూప్ నృత్యం, రవితేజ గ్రూప్ ఫోక్ సాంగ్, నర్సంపేటకు చెందిన లలిత బృందం బంజార నృత్యం, నాగార్జున గ్రూప్ ఫోక్ డ్యాన్స్, డప్పు డ్యాన్స్, ధింసా నృత్యం, వాగ్దేవి కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం బతుకమ్మ నృత్యం, అల్లం జంపయ్య బోనాల నృత్యాలు ఆలకరించాయి.



వ్యవసాయ రంగం సాంకేతికతపై కీలక ప్రసంగం చేస్తున్న ప్రొఫెసర్ దువ్వా

అయ్యో.. బిడ్డలారా!

- రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల దుర్మరణం
- కారులో కలిసి ప్రయాణిస్తుండగా ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడిన ఇద్దరు పిల్లలు



స్వల్ప గాయాలతో బయటపడ్డ కుమారుడు మోక్షజ్ఞ్, కుమార్తె లోక్షణ

లింగాలఘణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నలను కోల్పోయి ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారిపోయారు. అప్పటిదాకా అమ్మ చెబుతున్న కబుర్లను శ్రద్ధగా వింటున్న ఇద్దరు పిల్లలు.. చూస్తుండగానే వాయువేగంతో నాన్న డ్రైవింగ్ చేస్తున్న కారు రెప్పపాటులో కల్వర్టును ఢీకొట్టింది. కళ్లు మూసి తెరిచేలోపే రక్తపు మడుగులో ఆర్తనాదాలు చేస్తున్న అమ్మానాన్నలు.. చుట్టూ పొగ మంచులా కమ్మేసిన కారు బెలూన్లు.. ఏం జరిగిందో అర్థంకాని పరిస్థితుల్లో ఇద్దరు చిన్నారులు క్షణాల్లో అనాథలుగా మారిపోయారు. జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై బుధవారం లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దద్దోలు సురేశ్(36), అతని భార్య దద్దోలు దివ్య(30) దుర్మరణం పాలయ్యారు.

లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన సురేశ్ కరీంనగర్‌లో ఓ గ్రానైట్ కంపెనీలో గ్రానైట్ మార్కర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలే సమీప బంధువుల వివాహ వేడుకల కోసం స్వస్థలానికి వెళ్లి తిరిగి కరీంనగర్‌కు బుధవారం తెల్లవారుజామున్నే భార్య దివ్య, పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణతో కలిసి సొంత కారులో బయలుదేరారు. సురేశ్ స్వయంగా డ్రైవింగ్ చేస్తున్నాడు. మార్గ మధ్యలో భోజనం ముగించుకుని మళ్లీ ప్రయాణాన్ని ప్రారంభించారు.

ఈ క్రమంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వడ్డిచర్ల వద్దకు రాగానే తీవ్రవేగంతో వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో కారు నుజ్జునుజ్జు కాగా, అందులోనే ఇద్దరు పిల్లలతో సహా సురేశ్, అతడి భార్య ఇరుక్కు పోయారు. వెంటనే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రవణ్‌కుమార్ స్థానికుల సహాయంతో క్షతగాత్రులను బయటకు తీసి 108ద్వారా జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, మార్గమధ్యలో సురేశ్ మృతి చెందగా, ఆసుపత్రికి చేరుకున్న కొద్దిసేపట్లోనే దివ్య మరణించింది. స్వల్పగాయాలతో ఇద్దరు పిల్లలు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ప్రమాదానికి సురేశ్ నిద్రమత్తు కారణంగా స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, కారులో కుడివైపున డ్రైవింగ్ సీటులో కూర్చున్న సురేశ్, అతడి వెనుక సీటులో కూర్చున్న దివ్య తీవ్ర గాయాలకు గురై ప్రాణాలు విడవగా, ఎడమ వైపు కూర్చున్న ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడటం మిరాకిల్‌గా భావిస్తున్నారు.



కారులోనే ఇరుక్కుపోయిన సురేశ్

అమ్మానాన్నకేం కాలేదుగా..

ప్రమాదంలో తీవ్రంగాగాయపడ్డ సురేశ్, దివ్య మృతి చెందారనే విషయం పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణకు చాలా సేపటిదాకా తెలియకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా ఇద్దరు పిల్లలను ఎస్సై శ్రవణ్‌కుమార్ తనవాహనంలో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితేఅక్కడకు చేరుకున్న తర్వాత అమ్మానాన్నలు కనిపించకపోయేసరికి అమ్మ, నాన్న ఎక్కడున్నారని ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. పక్కనే డాక్టర్ ఇంజక్షన్ ఇస్తున్నారని బదులివ్వడంతో అమ్మానాన్నకు ఏం కాలేదుగా.. అని అమాయకంగా అడిగిన తీరు అక్కడున్న వారి హృదయాలను మెలిపెట్టింది. ఆత్మీయులు అందుబాటులో లేకపోవడం.. ఏం జరిగిందో పిల్లలకు తెలియకపోవడంతో ఓదార్చేందుకు ఎస్సై ఇడ్లీ తెప్పించి తినిపించారు.

కారు తాకిడికి కదిలిన కల్వర్టు..

సాధారణంగా ప్రమాదం జరిగితే కేవలం వాహనం మాత్రమే ధ్వంసమవుతుంది. వాయువేగంతో వచ్చి బలంగా ఢీకొట్టడంతో ఏకంగా జాతీయ రహదారికి చెందిన కల్వర్టు పునాదితో సహా కదిలిపోవడం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని బెలూన్లు ఓపెన్ అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

వివాదాల సుడిలో వరంగల్ డీఈవో

- సర్కారుకు సరెండర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- విచారణ ప్రారంభించిన అదనపు కలెక్టర్
- బదిలీ వేటు తప్పదా...?

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి వివాదాల సుడిగుండంలో చిక్కుకున్నారు. ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయన వ్యవహార శైలిపై ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ఇటీవల ఎంఈవోలతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఏఎంవోతో దురుసుగా ప్రవర్తించడమే కాక పరుష పదజాలంతో దూషించడంతో ఈ ఆందోళన ఉధృతంగా మారింది. డీఈవోపై పలు ఆరోపణలు చేస్తూ టీఎస్‌జీహెచ్ఎంఏ, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, టీపీయూఎస్, ఎస్టీయూ, ఎస్సీఎస్టీయూఎస్ తదితర ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు వివిధ విద్యార్థి సంఘాలు కూడా ఆందోళనలు చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ సత్యశారదతో పాటు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్. నాగరాజు, ఎంపీ కడియం కావ్య, తదితర ప్రజాప్రతినిధులతో పాటు ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డికి డీఈవోను సరెండర్ చేయాలంటూ ఫిర్యాదులు చేశారు. అలాగే వరంగల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న కొంత మంది మహిళా అధికారులు సైతం డీఈవో వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వరంగల్ డీఈవో వ్యవహారశైలి, ఆరోపణలపై ఫిర్యాదు చేశారు.

కాగా, ఉపాధ్యాయ సంఘాల ఆందోళన, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డీఈవోపై విచారణకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణిని విచారణ అధికారిగా నియమించారు. సోమవారం ఉపాధ్యాయ సంఘాలతో పాటు ఏఎంవో సుజన్ తేజను అదనపు కలెక్టర్ విచారణ చేసినట్లు తెలిసింది. అలాగే కార్యాలయ సిబ్బందిని పిలిపించి వారి ఫిర్యాదు వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అలాగే ఎంఈవోలను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపినట్లు తెలిసింది. కార్యాలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులపై సైతం ఆమె విచారణ చేయనున్నట్లు తెలిసింది.

బదిలీ వేటు తప్పదా...?

డీఈవో వైఖరి, వ్యవహారశైలిపట్ల గతంలో అనేక సార్లు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్.. తమ ఫిర్యాదుపై స్పందించి డీఈవోపై వేటు వేస్తారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ధీమావ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలోనూ డైరెక్టర్ నికోలస్ వరంగల్ డీఈవోపై వేటు వేసేందుకు రేపోమాపో చర్యలు తీసుంటారనే ఉపాధ్యాయ సంఘాల నేతల్లో ప్రచారం అవుతోంది. అయితే డీఈవో మంత్రి, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తనపై చర్యలను నిలిపివేయాలని కోరినట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అక్రమాల డీఈవోను సాగనంపాలి..



డీఈవో ప్రతీ పనికి ఓ రేటును ఫిక్స్ చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. డిప్యూటేషన్లు, పోస్టింగులు, పెన్షన్లు, ఎయిడెడ్ టీచర్ల బిల్లులు తదితర అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను మారుస్తూ తనకు అనుకూలంగా మారుస్తూ లంచాలు తీసుకుంటున్నారు. ఆయన అక్రమాలకు సహకరించని ఉపాధ్యాయులను, ఆఫీస్ సిబ్బందిని దూషించడం, బెదిరించడమే కాకుండా మహిళా అధికారులని చూడకుండా దూషిస్తున్నారు. డీఈవోను వెంటనే విధుల నుంచి తొలగించాలి.

- ఎస్.రవీందర్, హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

అహంకారపూరిత డీఈవో మాకొద్దు..



ఉపాధ్యాయుల పట్ల, కార్యాలయ సిబ్బందిపట్ల అహంకార పూరిత ధోరణితో వ్యవహరిస్తూ, పరుష పదజాలంతో దూషిస్తున్న ఈ డీఈవో మాకొద్దు. డిక్టేటర్‌లాగా వ్యవహరిస్తున్న ఆయనపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

- సి.సుజన్‌ప్రసాద్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉమ్మడి జిల్లాలో జడ్జిల నియామకం

వరంగల్ లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లాలకు కొత్తగా ఎంపికైన జడ్జిలను కేటాయిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన పి.గిరిధర్‌ను నర్సంపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మల్కాజిగిరికి చెందిన బొడ్డు శ్రీవల్లి శైలజను పరకాల ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన డి.మధులిక తేజ ములుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, సికింద్రాబాద్‌కు చెందిన రాజునిధిని వరంగల్ జిల్లా నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఎక్సైజ్ కోర్టు జడ్జిగా, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన బనావత్ అనూషను హనుమకొండ జిల్లా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ పీసీఆర్ కోర్టు న్యాయమూర్తిగా ఆదేశాలు జారీ చేసింది.

కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొనుగోలు, ఇతర సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నెంబర్ 18004253424, ఫోన్ నంబర్లు 0870-2530812, 9154252936లకు కాల్ చేయాలని సూచించారు.

నిధుల వరద

(5వ పేజీ తరువాయి)

అత్యధికంగా రూ.51.30 కోట్ల నిధులు కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.9.95 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.5.90 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ(ఇంజనీరింగ్ విభాగం)కు రూ.8.57 కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్యం కోసం రూ.15.15 కోట్ల నిధులు కేటాయించారు. వివిధ అభివృద్ధి పనులకే రూ.90.87 కోట్లు కేటాయించారు. అలాగే మిగతా 15శాఖలకు రూ.59.13కోట్లు కేటాయించారు. ఇందులో ప్రధానంగా జిల్లాపంచాయతీ అధికారికి రూ.11.62కోట్లు అత్యధికంగా కేటాయించగా, పోలీస్ శాఖకు రూ.14.50కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.14.38 కోట్లు, దేవాదాయశాఖకు రూ.1.75కోట్లు కేటాయించారు.

కాగా, జాతరలో ఈసారి భక్తులు అసౌకర్యా లు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత జాతర కంటే మరింత విస్తృతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భారీగా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర వైద్య సేవ కేంద్రాలు, ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు, ఉచిత బస్సులు సంఖ్య పెంచటం, తాత్కాలిక వసతి గృహాలను ఏర్పాటు చేయటం వంటి అదనపు సౌకర్యాలు కల్పించేలా అధికారులు దృష్టి పెట్టారు. మొత్తంగా రికార్డు స్థాయిలో మేడారం జాతరకు ఈసారి రూ.150కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016లో జరిగిన మేడారం మహాజాతరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.150.50కోట్లు కేటాయించింది.

మహాజాతరకు భారీ నజరానా

కాంగ్రెస్ ప్రభుత్వం మేడారం మహాజాతరపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డికి సమ్మక్క, సారలమ్మల సెంటిమెంట్ ఉండటంతో మహాజాతర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. 2023 ఫిబ్రవరి 6వ తేదీన హత్ సే హత్ జోడో యాత్రను రేవంత్‌రెడ్డి మేడారం నుంచే ప్రారంభించి సక్సెస్ అయ్యారు. అదే సెంటిమెంట్‌తో తల్లుల జాతర అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

2024లో ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు రెండు నెలల సమయమే ఉన్నప్పటికీ రూ.105 కోట్లు ఇవ్వగా, తాజాగా ఐదు నెలల ముందే మహాజాతర కోసం రూ.150 కోట్లు కేటాయించారు. ప్రధానంగా తెలంగాణ ఏర్పడిన తరువాత మేడారం జాతర అభివృద్ధికి పాలకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. 2014, జూన్ 2న స్వరాష్ట్రం సిద్ధించినప్పటి, తొలి జాతరను మాత్రం 2016 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. 2016లో భారీస్థాయిలో మేడారం జాతరకు రూ.150.50 కోట్లు కేటాయించింది. స్వరాష్ట్రంలో భారీగా నిధులు కేటాయించి, గిరిజన జాతర వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని సంకల్పించింది. దీంతో మేడారం భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది. అయితే 2018 జాతర కోసం అధికారులు రూ.175 కోట్లతో మొదటి ప్రతిపాదనలు పం పించారు. కానీ, రూ.85.55 కోట్లు మాత్రమే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంకేటాయించింది. దీంతో రెండేళ్లకే మేడా రం జాతరకు రూ.69.95 కోట్ల కోత పడింది. ఆ తరువా త 2020లో జరిగిన మేడారం జాతర కోసం అధికారు లు రూ.128కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.75కోట్లు కేటాయించింది.

2022లో కూడా ప్రభుత్వం రూ.75కోట్లే కేటాయించింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం మేడారం జాతరపై చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వినిపించాయి. 2014 జాతరకు ఎన్నికల కోడ్ పేరుతో గత ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయకుండా చేతులెత్తేసింది. సెప్టెంబరు, అక్టోబరు నెలలోనే మహాజాతరకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో మేడారం జాతరకు రూ.105 కోట్లు కేటాయించింది. మహాజాతరకు కేవలం రెండు నెలల గడువే ఉన్నప్పటికీ యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారం మహాజాతరకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఐదు నెలల ముందే మహాజాతరకు రూ.150 కోట్లు కేటాయించారు. నిధులు కేటాయింపులు ముందుగా జరగటంతో టెండర్ల ప్రక్రియ సాఫీగా జరగటంతో పాటు ఇతర పనులను నాణ్యతతో చేపట్టే అవకాశం ఉంటుంది.

అభివృద్ధికి మరింత ఊతం

మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేయటంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గతం లో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాజాతరకు ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మేడారం మహాజాతరలో భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించటంతో పాటు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతోపాటు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

తొమ్మిది ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల



మాట్లాడుతున్న విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టం 1985ను అతిక్రమించి నిర్వహిస్తున్న తొమ్మిది ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. ఇందులో డోర్నకల్‌లో మూడు, కురవిలో రెండు, మరిపెడ, చిన్నగూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరతను అధిగమించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌శాఖల తనిఖీల్లో అన్ని మండల కేంద్రాల్లో సహకార సొసైటీల్లో యూరియా నిల్వలను పకడ్బందీగా రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారం నిర్వహిస్తున్న సాలార్‌తండాలోని ఈశ్వర్ ట్రేడర్స్‌కు షోకాజ్ మెమో ఇవ్వడం జరిగిందన్నారు. డీలర్లు ఇచ్చే యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పకడ్బందీగా స్టాక్ రిజిస్టర్లలో ఈ-పాస్ మిషన్‌లలో పొందుపరిచి బిల్లుల రూపంలో రైతుకు ప్రతి బస్తా అందించాలని చెప్పారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బీమా చెల్లింపులో జాప్యంతో ఇబ్బందుల్లో రైతులు

- పార్లమెంట్‌లో ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులకు రావలసిన పంట బీమా డబ్బుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. బీమా డబ్బులు సకాలంలో రాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఎంఎఫ్‌బీవై కింద రైతులకు మూడేళ్లుగా ఎంత మొత్తంలో డబ్బులు బకాయి ఉన్నాయి? ఆలస్యం జరిగినప్పుడు రైతులకు వడ్డీ ఇచ్చారా? భవిష్యత్‌లో ఇలాంటి జాప్యం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అని కావ్య ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2016 నుంచి ఇప్పటి వరకు రూ.1.89 లక్షల కోట్లలో రూ.1.85 లక్షల కోట్లు చెల్లించారని, ఇంకా రూ. 3,249.70 కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి గ్రీవెన్స్ కమిటీలు, ఫిర్యాదుల కోసం హెల్ప్ లైన్ 14447, ఆన్‌లైన్ పోర్టల్‌ఏర్పాటు చేశామన్నారు. ఆలస్యంగా చెల్లించినప్పుడు 12 శాతం వడ్డీ ఇవ్వాలనే నిబంధన ఉందని మంత్రి తెలిపారు.

గ్రేటర్ మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ జోనా బదిలీ

- ఆయన స్థానంలో చంద్రశేఖర్ నియామకం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సెక్రెటరీ డాక్టర్ టీకే.శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులోభాగంగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈసంపెల్లి జోనాను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా హనుమకొండకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్‌గా వెయిటింగ్‌లో ఉన్న బి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఇటీవల గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం నుంచి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన రాజేశ్వర్ స్థానం ఖాళీగా ఉండడంతో పోస్టింగ్ కోసం చూస్తున్న ఎస్.సమ్మయ్యను జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో రిపోర్టు చేయాలని డైరెక్టర్ శ్రీదేవి వెల్లడించారు.

విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్

- ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు అని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరదారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే కష్టపడి చదవాలన్నారు. చదువు కంటే విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లు అభివృద్ధి చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఎన్.శ్రీవాణి, డాక్టర్ ఇ.కుమారస్వామి, డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.శ్రీనివాస్, బి.ప్రశాంత్, ఏవో వేణుగోపాలస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పింగళి మహిళా కళాశాలలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, సునీత, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి పింగళి అటానమస్ మహిళ పింగళి కళాశాలలో బుధవారం కళాశాల బాటనీ విభాగాధిపతి డాక్టర్ డి.సునీత నేతృత్వంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి పాల్గొని మొక్కలు నాటారు. మొక్కల పెంపకం అవశ్యకతను విద్యార్థులకు చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కళాశాల ఎకోక్లబ్, బాటనీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, కళాశాల ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ టి.శ్రీలత, అధ్యాపకులు టి.జ్యోతిర్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కాళోజీ కళాక్షేత్రంలో జానపద జాతర

వడ్డెపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, అంజలి మీడియా గ్రూప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జానపద జాతరను విజయవంతం చేయాలని అంజలీ మీడియా గ్రూప్ చైర్మన్ కామిశెట్టి రాజు పిలుపు నిచ్చారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ప్రోగాం కల్చరల్ ఇన్‌చార్జి గోల్కొండ బుచ్చన్న, ధారా దేవేందర్ మాట్లాడారు. జానపద కళలతో వరంగల్ జిల్లా కీర్తిని నలుదిశలా చాటిన ప్రముఖ జానపద గాయకులు కూనమల్ల శంకర్, దీకొండ సారంగపాణి వారసత్వాన్ని కొనసాగించేందు కోసం ఈ జానపద జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు తాళ్ల సునిల్, జూపాక శివ, ఆకుల సదానందం, డాక్టర్ అనిత, లింగాల ఇమ్మానియల్, బాలాజీ, డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, కనకం రాజేందర్, పుట్ట జానకీ, రహీమా, ఉప్పరపల్లి రాజు, భిక్షపతి, సంధ్య, మధు, జ్యోష్న, చైతన్య, వేదవతి, రాజేశ్వరి, చిన్న సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం కొట్లాడకుంటే బానిసత్వం కోరుకున్నట్లే : పీఆర్‌టీయూ

మడికొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మనిషి తన హక్కుల కోసం కొట్లాడడం మరిచిపోయిన రోజు బానిసత్వం దానంతటదే దరి చేరుతుందని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె చంద్రయ్య అన్నారు. మంగళవారం కాజీపేట మండలం కడిపికొండలో జడ్పీహై స్కూల్ క్రీడా ఉపాధ్యాయులు కందికొండ సదానందం ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగి రిటైర్మెంట్ జీవితం ప్రశాంతంగా గడిపే పరిస్థితి లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఉందన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా రెండేళ్ల పీఆర్‌సీ ప్రయోజనాలు వెనక్కు వెళ్లిపోయాయాన్నారు. ప్రభుత్వం వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు బాకీ పడిందని, నెలకు రూ.700కోట్లు చెల్లిస్తామని కేబినెట్ తీర్మానం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉపాధ్యాయులు ప్రయోజనాలు కాపాడి ప్రభుత్వ పాఠశాలలను బతికించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు, పదవీ విరమణ బెనిఫిట్స్ విడుదల చేయడానికి గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ జేఏసీ ప్రకటించిన 42రోజుల కార్యాచరణకు పీఆర్‌టీయూ తెలంగాణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ఎంఈవో మనోజ్‌కుమార్, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పెండం రాజు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



డీసీసీ భవన్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ

హనుమకొండ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమం బుధవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- మడికొండ: మడికొండ చౌరస్తాలో గ్రేటర్ వరంగల్ 46, 64 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నాయకులు వస్కుల శంకర్, కంచనపెల్లి వెంకటయ్య, వస్కుల పెద్ద రాజు, నగర ఉపాధ్యక్షులు వస్కుల శ్రీను, మండల మహిళా అధ్యక్షురాలు నీలం రజిని వేణు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు వస్కుల శివ, నాగరాజు, దువ్వ విజయ్, దువ్వ చిన్నకుమార్, కొత్త క్రిష్టారెడ్డి, దండిగం సదానందం, శ్రీనివాస్, మల్లికార్జున్, క్రిష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.
- కాజీపేట: కాజీపేట చౌరస్తాలో 62 వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం కేక్ కట్ చేశారు. 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్ ఆధ్వర్యంలో డీజిల్ కాలనీ జంక్షన్ వద్ద జరిగిన రాజీవ్ జయంతి వేడుకల్లో కేక్‌కట్ చేశారు. రాజీవ్ కార్యక్రమంలో కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్, పసునూరి మనోహర్, మాచర్ల జయాకర్, నర్సింగ్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, దువ్వ రాజు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఫొటోగ్రఫీ పోటీలు

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు
- నేడు బహుమతుల ప్రదానం

వడ్డెపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో జర్నలిస్టులకు ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా కేయూ జర్నలిజం విభాగాధిపతి సంగాని మల్లేశ్వర్, ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, కేయూ పూర్వ పీఆర్‌వో వేదాంతం కృష్ణమాచార్యులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈపోటీల్లో పెద్దపల్లి వరప్రసాద్‌కు ప్రథమ బహుమతి, షర్ఫోద్దిన్ మామక్‌కు ద్వితీయ బహుమతి, మేరుగు ప్రతాప్‌కు తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. అలాగే ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్, ఆంధ్రజ్యోతి సీనియర్ ఫొటోగ్రాఫర్ సంపెట సుధాకర్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ పాలకుర్తి మధు అవార్డులకు ఎంపికయ్యారు. వీరితో పాటు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న ఫొటోగ్రాపర్లు గోవర్ధనం వేణు, ఆవుల సంపత్ అవార్డులను గెల్చుకున్నారు. ఈ అవార్డులను గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేతుల మీదుగా ప్రదానం చేస్తామని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తెలిపారు.

జీడబ్ల్యూఎంసీలో ఉద్యోగుల బదిలీలు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్
- ముగ్గురు ఆర్‌ఐల బదిలీ, 8 మందికి పోస్టింగ్‌లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పని చేస్తున్న 11 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఉద్యోగులకు ఒక చోటు నుంచి మరో చోటికి స్థానచలనం కల్పించగా, మరికొందరికి ఖాళీ అయిన స్థానాలలో పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్‌ఐలా? వసూల్ రాజాలా?' అనే వార్తకు స్పందించిన కమిషనర్.. పూర్తి సమాచారం సేకరించిన తర్వాత బదిలీల ప్రక్రియ నిర్వహించినట్టు తెలిసింది. ఇంకా కొందరు ఉద్యోగులకు బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించారు. కాగా, ఇంకా ఆర్‌ఐలలో పరకాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆర్‌ఐతో పాటు ఇద్దరు పురుషులు, ఒక మహిళా ఆర్‌ఐ ఆరేళ్లుగా ఒకేచోట్ల పని చేస్తున్నప్పటికీ వారిని బదిలీ చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇంకా పోస్టింగ్ పొందిన ఆర్‌ఐలలో ఒకరు పొలిటికల్ పైరవీతో రాగా, మరో ఇద్దరు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పి వచ్చినట్టు మునిసిపల్ కార్యాలయంతోపాటు సర్కిల్ కార్యాలయాల్లో బాహాటంగానే చర్చ జరుగుతోంది. దీనిపై కమిషనర్ రహస్య సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని బల్దియా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసం సమాజాభివృద్ధికి దోహదం

- రామకృష్ణ మఠ్ అధ్యక్షుడు స్వామి బోదమయానందజీ



సెమినార్‌లో మాట్లాడుతున్న స్వామి బోదమయానందజీ

బాలసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల పిల్లలకు నైతిక విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసం సమాజానికి, దేశ పురోగమనానికి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని హైదరాబాద్ రామకృష్ణ మఠ్ అధ్యక్షుడు స్వామి బోదమయానంద జీ అన్నారు. హనుమకొండలోని ఒక ప్రైవేటు వేడుకల మందిరంలో భవిష్యత్ తరాల బాల బాలికలు నైతిక విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసం ఎలా పెంపొందించుకోవాలి? అనే అంశంపై బుధవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. సెమినార్‌కు శ్రీరామకృష్ణ సేవా సమితి హనుమకొండ అధ్యక్షుడు కటంగూరు సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. సెమినార్‌లో స్వామి బోదమయానందజీ మాట్లాడుతూ.. పిల్లలలో, ఉపాధ్యాయులలో ఆత్మవిశ్వాసం, ఆత్మ నిబ్బరం, దేశ భక్తి తదితర విషయాలపై వివరించారు. ప్రతీ విద్యార్థి స్వామి వివేకానంద చెప్పినట్లుగా సింహంగా తయారవ్వాలని శారీరకంగా, మానసికంగా బలిష్టంగా ఉన్నప్పుడే దేశం బాగా అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించారు. వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ బాధ్యులు సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు వివేకానంద బోధనలను అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. మరో వక్త లక్ష్మణాచారి మాట్లాడుతూ.. విద్యార్థులు స్వామి వివేకానంద బోధనలను అనుసరించి ఆయన మార్గంలో నడవాలని ఎటు వంటి అప్రశుతులకు తావ్వికుండా అవమానాలకు గురికాకుండా సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఉద్బోధించారు.

వడుప్సా ప్రధాన కార్యదర్శి మాడుగుల సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనాటి సెమినార్‌లో విద్యార్థులు పాల్గొనడం వారి అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో శారద విద్యానికేతన్ వరంగల్ కరస్పాండెంట్ సేవా సమితి దర్మకర్త సురేష్, రామకృష్ణ సేవా సమితి భవన నిర్మాణానికి రూ.50వేల చెక్కును అందజేసినందున ఆయన దాతృత్వం ప్రశంసనీయమైనదని సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు స్వామి వివేకానంద పోస్టర్‌ను ఆవిష్కరించారు. హాజరైన వివిధ ప్రైవేటు పాఠశాలకు చెందిన సుమారు 12 వందల మంది విద్యార్థిని, విద్యార్థులకు స్వామి వివేకానంద పుస్తకాలను , పోస్టర్లను బహూకరించారు. కార్యక్రమంలో వడుప్సా సభ్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇంకా సేవా సమితి బాధ్యులు శ్రీనివాస స్వామి, విష్ణు వర్ధన్‌రెడ్డి, కేవీ రావు, సూర్య , అరుణ్, విష్ణు, స్వరూప, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



గోకుల్‌నగర్ నుంచి బోనాలతో బైలెల్లిన యాదవ మహిళలు

వడ్డెపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డప్పుచప్పుళ్లు.. డీజే సౌండ్స్.. పంబాల వారి పాటలు.. ఆచారమంతుల ఆటలు.. పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో వెరసి గోకుల్ నగర్ భక్తి ప్రపత్తులతో పరవశించింది. శ్రావణ మాసం చివరి బుధవారం హనుమకొండలోని గోకుల్ నగర్‌లో పోచమ్మ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా భక్తులు నిర్వహించుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా పోతురాజులు నిలిచారు. హనుమకొండ గోకుల్ నగర్ మెయిన్ రోడ్డు నుంచి అంబేద్కర్ భవన్ రోడ్డు మీదుగా గోకుల్ నగర్‌లోని పోచమ్మ దేవాలయం వరకు డప్పుచప్పుళ్లతో మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని నృత్యాలు చేస్తూ చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో యువత కేరింతలతో గోకుల్ నగర్ పులకించిపోయింది. భక్తులంతా ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. గండ దీపం వెలిగించి, బలిహరణ నిర్వహించి అమ్మవారిని కొలిచారు. గోకుల్ యాదవ సంఘం ప్రతినిధులు మూగుల కుమార్ యాదవ్, బంక సరళ సంపత్ యాదవ్, నక్క లింగయ్య యాదవ్, బంక రమేష్, బొంగు రాజు యాదవ్, సత్యం యాదవ్, బంక సతీష్, చేరాలు, రాజమల్లు, బంక చంద్రశేఖర్ తదితరులు వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని కొలిచి మొక్కులు తీర్చుకున్నారు.

- మడికొండ: పవిత్ర శ్రావణమాసం సందర్భంగా మడికొండలో పోచమ్మతల్లి బోనాల జాతర బుధవారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారి ఆలయాలకు తరలివెళ్ళి కోళ్ళు, గొర్రెలు బలి ఇచ్చి మొక్కుకున్నారు. డప్పుచప్పుళ్ళు, శివసత్తుల పూనకాలతో మహిళలు నెత్తిన బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకొని పసుపు కుంకుమ, బెల్లం శాఖ, నైవేద్యం, చీరలు అమ్మవారికి భక్తితో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలను, కుటుంబ సభ్యులను సల్లంగ చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొలిపాక వెంకటస్వామి, నర్మేటి భిక్షపతి గాండ్ల, బొల్లికొండ వినోద్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పరిశోధనల పరంగా అభివృద్ధికి కృషి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠాన్ని పరిశోధనల పరంగా అభివృద్ధి చేస్తానని సురవం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెల్దండి నిత్యానందరావు అన్నారు. బుధవారం ఆయన హనుమకొండ హంటర్‌రోడ్‌లోని తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడి విద్యార్థులకు కొత్త కోర్సులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. పీఠం ప్రాంగణంలో మొక్కను నాటారు. అలాగే మ్యూజియర్, లైబ్రరీ, ఆర్కైవ్స్‌లను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, సిబ్బంది వెంకటేశ్వర్లు, దామోదర్, రవికుమార్, సురేష్, గోపాల్‌రెడ్డి, కృష్ణ మోహన్, సతీష్, విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్, సులోచన, కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ రాజులకు శివుడంటే ఇష్టం

హనుమకొండ కల్చరల్: తెలుగు నేలను సుసంపన్నంగా పరిపాలించిన కాకతీయ ప్రభువులకు పరమశివుడంటే ఇష్టమని శివతత్వాన్ని బాగా ఆరాధించేవారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెనిదండ నిత్యానందరావు అన్నారు. బుధవారం నగర పర్యటనలో భాగంగా హంటర్‌రోడ్‌లో తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని సందర్శించిన అనంతరం నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని ఆయన కుటుంబసభ్యులతో ఆయన సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతించి రుద్రేశ్వరుడి సన్నిధిలో అభిషేకం నిర్వహింపజేసి ఆలయ నాట్య మండపంలో శేషావస్త్రాలు బహుకరించి మహదాశీర్వచనం చేశారు. వీసీ వెంట వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం డీన్ డాక్టర్ గడ్డం వెంకన్న, డాక్టర్ గంప సతీష్, సునంద తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో తెలుగు యూనివర్సిటీ వీసీ నిత్యానందరావు

హాస్టల్‌లో పాము ప్రత్యక్షం

- భయబ్రాంతులకు గురైన వైద్య విద్యార్థులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ వైద్య కళాశాల హాస్టల్‌లో పాములు సంచరిస్తున్నాయి. బుధవారం సాయంత్రం వేళ ఓ పాము హాస్టల్ గదిలో కనిపించింది. దీంతో వైద్య విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళన వ్యక్తం చేశారు. వారం కిందట కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో ఓ పెద్ద పాము రోడ్డుపై సంచరిస్తూ కనిపించింది. కేఎంసీ ఆవరణ మొత్తం విషసర్పాలతో నిండిపోయిందని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రం చేయకపోవడం వల్లే చెట్ల పొదలు పెరిగి పాముల సంచారం ఈ మధ్య ఎక్కువైందని వాపోతున్నారు. గతంలో హాస్టల్ ఆవరణతోపాటు వైద్యకళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించేవారని వైద్య విద్యార్థులు చెబుతున్నారు. ఈ మధ్య పట్టించుకోక పోవడం వల్ల ఎటువైపు చూసినా పొదలతో ఆవరణ అంతా నిండిపోయి విషసర్పాల సంచారం పెరిగిందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటీసీ పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐలలో కొత్తగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ జరిగింది. అంతకు ముందు ఏటీసీలో అడ్మిషన్ల విషయమై సెర్ప్ సీఈవో, ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షరాస్యతను పెంచడంలో భాగంగా ప్రభుత్వఐటీఐలలో విద్యార్థులను చేర్పించివారికి ఉపాధి అవకాశాలు చూపాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ మేన శ్రీనివాస్ డీఆర్‌డీఏ అడిషనల్ పీడీతో పాటు ఉపాధి శిక్షణ శాఖ ఆర్‌డీడీ సీతారాములు, హనుమకొండ ఐటీఐ ప్రిన్సిపాల్ సక్రు, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, వరంగల్ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఐటీఐలలోని ఏటీసీల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని, ఈనెల 28 చివరి తేదీ అని కాజీపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. అడ్వాన్సుడ్ టెక్నాలజీసెంటర్స్ అయిన వరంగల్, హనుమకొండ, కాజీపేటలలోని ఏటీసీలను వరంగల్ ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్‌లో నిర్మించారని, ప్రతీ ఏటీసీలో ఆరుకోర్సులు, అందులో మొదటిసంవత్సరం కోర్సులు మూడు, రెండేళ్ల కోర్సులు మూడు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతీ ఏటీసీలో 172 సీట్లు ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐల ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణా కార్యక్రమం

కాజీపేటలోని ప్రభుత్వ ఐటీఐలో ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపు 5 రోజుల పాటు కొనసాగుతుంది. వరంగల్ ఉపాధి శిక్షణ శాఖ ఆర్‌డీడీ బి.సీతారాములు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) ఏర్పాటైన నేపథ్యంలో ఆ మేరకు ఇన్‌స్ట్రక్టర్లు తమ బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నందు వల్ల వాటిని విద్యార్థులకు బోధించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ట్రైనర్లు అగర్వాల్, మధు, రాహుల్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నాగోల్, బండ్లగూడకు చెందిన బండి సందీప్ బుధవారం తన తల్లిదండ్రులు కవిత, చంద్రమౌళిని తీసుకుని కారులో హనుమకొండకు వస్తుండగా మడికొండ ఆర్ఎస్‌ఆర్ గార్డెన్స్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఒడిషాకు చెందిన డ్రైవర్ మాలి దీపాంకర్ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకొని వీరి కారును ఢీకొట్టాడు. ప్రమాదంలో కారు నడుపుతున్న సందీప్‌కు స్వల్ప గాయాలు కాగా, అతడి తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే... కమలాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతానికి చెందిన మాట్లా కిరణ్ కుమారుడు శ్రీసాద్విన్ ఆలియాస్ చెర్రి ఎల్కతుర్తిలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళి తిరిగి కమలాపూర్‌కు వెళ్లేందుకు ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో శ్రీసాద్విన్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ డ్రైవర్ యాదవరెడ్డి, ఈఎంటీ ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థిని ఎంజీఎంకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ చేరాలును ఫోన్‌లో వివరణ కోరగా రోడ్డు ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

అందం... దీనితో పాటుగా అనేక కళలలో ప్రతిభ... ఈ రెండు ఉన్న వ్యక్తులు అరుదుగా ఉంటారు. ఈసారి మిస్ యూనివర్స్ పోటీల్లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మణికా విశ్వకర్మ ఈ అరుదైన వ్యక్తుల్లో ఒకరు. ఆమె గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

అందం... ప్రతిభ... కలబోత 'మణిక'



ఎవరీ మణిక?...

రాజస్థాన్‌కు చెందిన మణిక ప్రస్తుతం ఢిల్లీలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదువుతోంది. కేవలం చదువులోనే కాకుండా అనేక కళలలో కూడా ఆమెకు ప్రవేశం ఉంది. తను చిన్నప్పుడే శాస్త్రీయ నృత్యం నేర్చుకుంది. భారతీయ విదేశాంగ శాఖ విదేశాలలో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో ఆమె నృత్య కళాకారిణిగా పాల్గొంది. మణిక మంచి పెయింటర్ కూడా! ఆమెకు లలిత కళా అకాడమీ నుంచి అవార్డులు కూడా లభించాయి. నరాలకు సంబంధించిన వ్యాధులతో పుట్టిన చిన్నారులకు సాయం అందించటానికి మణిక 'న్యూరోనోవా' అనే ఒక సంస్థను స్థాపించింది.

గెలవటానికి కారణమయిన ప్రశ్న ఇదే!

'మిస్ యూనివర్స్ ఇండియా- ఫైనల్స్'లో - "మహిళలకు విద్యను అందిస్తారా లేక పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తారా?" అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం వల్ల ఆమె ఈ పోటీని గెలవగలిగింది. "నేను మహిళకు విద్యను అందించటానికే ఇష్టపడతాను. ఎందుకంటే మహిళలకు విద్యను అందిస్తే- వారి ఒక్కరి జీవితం మాత్రమే కాదు... వారి కుటుంబాల భవిష్యత్తు, సమాజం భవిష్యత్తు, దేశం భవిష్యత్తు మారుతుంది" అని ఆమె ఇచ్చిన జవాబును జడ్జీలు మెచ్చుకున్నారు.

సూటిగా, స్పష్టంగా...

మణిక తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెబుతుంది. పోటీలో గెలిచిన తర్వాత- "చాలా మంది గెలిచిన తర్వాత తాము ఎంత కష్టపడ్డారనే విషయాన్ని చెబుతారు. కానీ నేను నాకు లభించిన మద్దతు గురించి మాట్లాడాలనుకుంటున్నా. నా కుటుంబం నాకు చిన్నప్పటి నుంచి ఎంతో మద్దతు ఇచ్చింది. నేను ఒక చిన్న పట్టణం నుంచి వచ్చాను. అయినా నేను ఈ రోజున ఈ పోటీలో గెలిచానంటే- నా కుటుంబంతో పాటుగా నా టీచర్ల పాత్ర కూడా ఎంతో ఉంది. అందుకే నేను పడిన కష్టాల గురించి కాకుండా- వారు నాకు ఇచ్చిన మద్దతు గురించి చెప్పాలనుకుంటున్నా" అని తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది.

మిస్ యూనివర్స్ పోటీ గురించి...

"అందాల పోటీలు ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపచేస్తాయి. దీనిలో గెలిస్తే- కొన్ని లక్షల మందికి స్ఫూర్తిని ఇవ్వొచ్చు. నేను అలాంటి స్థితిలో ఉన్నాననే భావన ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. 'మిస్ రాజస్థాన్' నుంచి .మిస్ యూనివర్స్ ఇండియా - ఫైనలిస్ట్'గా మారటం వెనుక ఒక ప్రస్థానం ఉంది. ఈ ప్రస్థానంలో ఎటువంటి అనిశ్చితి లేదు. నా మీద నాకు



అపారమైన నమ్మకం ఉంది. అది పునాదిగా పనిచేసింది. ఈ పునాదిపై ఏకాగ్రత, లక్ష్యం అనే భావనల ఆధారంగా ఒక సౌధాన్ని నిర్మించగలిగాను" అని ఆమె పేర్కొంది.

విజేత



కాళ్లకు చక్రాలు కట్టుకొని...
రయ్యిన దూసుకుపోతుంటే...
ఇదేదో బాగుందనుకుంది.
అమ్మానాన్నల అండతో సరదాగా స్కేటింగ్ రింక్‌లోకి దిగింది.
అలా నాలుగేళ్లప్పుడు మొదలై...
ఎన్నో పతకాలు వశమై...
ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో
అదరగొడుతోంది.
'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' గ్రహీత... ఆసియా రోలర్ స్కేటింగ్ రజత పతక విజేత...
పధ్నాలుగేళ్ల మాత్రపు జెస్సీరాజ్‌తో 'నవ్య' మాటామంతి.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి బాల పురస్కార్ అవార్డు అందుకుంటున్న జెస్సీ రాజ్

స్కేటింగ్ రాజ్

"అప్పుడు నాకు నాలుగేళ్లు. మా అమ్మానాన్న రాధ, సురేష్ నన్ను ఏలూరు ఇండోర్ స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ స్కేటింగ్ రింక్ చూపించి... 'ఇదేదో గేమ్ బాగుంది... నేర్చుకొంటావా' అని అడిగారట. నేను సరే అన్నానట. వెంటనే స్కేటింగ్ శిక్షణలో చేర్చారట. మాది ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం. వారంలో రెండు మూడు రోజులు శిక్షణ కోసం ఏలూరు తీసుకువెళ్లేవారు. సాధనలో చిన్న చిన్న దెబ్బలు తగులుతుండేవి. దాంతో భయపడి స్కేటింగ్ మానేశాను. తరువాత మా కుటుంబం మంగళగిరికి వచ్చి స్థిరపడింది. నాకు మళ్లీ స్కేటింగ్ నేర్చుకోవాలని అనిపించింది. దాంతో విజయవాడ దండమూడి రాజగోపాలరావు స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ కోచ్ సింహాద్రి వద్ద శిక్షణకు చేర్చారు.

తొలి పోటీలోనే...

రింక్‌లో వేగంగా కదలాలంటే రన్నింగ్ అవసరమని కోచ్ చెప్పారు. దాంతో రన్నింగ్‌లో కూడా శిక్షణ ప్రారంభించాను. వారంలో మూడు రోజులు పరుగు, మూడు రోజులు స్కేటింగ్. నాన్న నన్ను వెంటబెట్టుకొని స్టేడియానికి తీసుకువెళ్లేవారు. సాధనలో దెబ్బలు తగులుతుండేవి. 'వాటికి భయపడితే ఆటలో ముందుకు వెళ్లలేవు' అని నాన్న చెప్పారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ప్రొఫెషనల్ స్కేటర్‌ను అవ్వాలని అనుకున్నాను. దాని కోసం పదేళ్ల వయసులో ఆర్టిస్టిక్ సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో అభ్యాసం ప్రారంభించాను. 2020లో విజయవాడలో జరిగిన కృష్ణా జిల్లా అండర్-14 విభాగంలో పాల్గొన్నాను. తొలి పోటీలోనే రజత పతకం గెలుచుకున్నాను. మరుసటి ఏడాది జిల్లా స్థాయిలో రజతం, అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి ఈవెంట్‌లో రజతం, కాంస్యం సాధించాను. జాతీయ పోటీలకు ఎంపిక అయ్యాను.

అంతర్జాతీయ స్థాయికి...

ఎంతో ఉత్సాహంతో మొహాలీలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. అయితే అనుకున్నంతగా రాణించలేకపోయినా... రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నాను. మెరుగైన ఫలితాలు రావాలంటే మరింత కష్టపడాలని అర్థమయింది. ఏకాగ్రతతో సాధన చేశాను. 2022లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం నెగ్గాను. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కానీ అసలైన పరీక్ష నాకు న్యూజిలాండ్‌లో ఎదురైంది. గత ఏడాది జూన్‌లో అక్కడ నిర్వహించిన పసిఫిక్ ఓషియానా చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో పోటీపడ్డాను. దీని కోసం భారత్ నుంచి 18 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. వారందరినీ దాటి నేనొక్కదాన్నే చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాను. స్వర్ణ పతకం గెలుచుకున్నాను. అదే ఏడాది జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గాను. గడచిన నాలుగున్నరేళ్లలో పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో పతకాలు సాధిస్తున్నాను.

> **రన్నింగ్‌లో కూడా...**
>
> నా ప్రథమ ప్రాధాన్యం స్కేటింగ్‌కే. అలాగని రన్నింగ్‌ను వదిలేయలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయి 100, 200, 400 మీటర్ల పరుగు పందేల్లో పాల్గొంటున్నాను. వాటిలో ఇప్పటికి 20 పతకాలు సాధించాను. స్కేటింగ్‌లో అయితే 56 పతకాలు నెగ్గాను. అందులో 23 స్వర్ణాలు, 22 రజతాలు ఉన్నాయి. నాతోపాటు మా తమ్ముడు జోయల్ ఆదర్శ్ కూడా స్కేటింగ్‌లో శిక్షణ తీసుకొంటున్నాడు. వాడికి టెక్నిక్స్ నేర్పుతున్నాను.

బాల పురస్కార్...

2024 నా కెరీర్‌లోనే మరిచిపోలేని సంవత్సరం. న్యూజిలాండ్‌లో విజయం తరువాత 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైంది నేను ఒక్కదాన్నే అని తెలిసి ఎంతో గర్వంగా అనిపించింది. గత ఏడాది డిసెంబరు... ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డును అందుకున్నా. అది నాకు ఎనలేని ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన తైవాన్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాను. రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచాను. అంతేకాదు... గత నెల 24 నుంచి 29 వరకు దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాను.

లక్ష్యం... ఒలింపిక్స్...

స్కేటింగ్‌లో నేను మరిన్ని అద్భుత విజయాలు అందుకోవాలని అమ్మానాన్న ఆకాంక్షిస్తున్నారు. దాంతోపాటు రన్నింగ్‌లో కూడా చాంపియన్‌గా ఎదగాలని నేను కోరుకొంటున్నాను. రెండిటినీ నెరవేర్చాలనే దృఢ సంకల్పం నాది. ప్రస్తుతం విజయవాడ ఎన్ఎస్ఎం స్కూల్లో పదో తరగతి చదువుతున్నా. చదువులో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించి... ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని అనుకొంటున్నా. అన్నిటికంటే పెద్ద లక్ష్యం... ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, పతకం సాధించడం. దాని కోసం మెరుగైన శిక్షణ తీసుకొంటున్నా. కఠోర సాధన చేస్తున్నా."

• పి.దుర్గారావు
దెందులూరు

కౌన్సెలింగ్

ఈ అసహజ లక్షణాలు ఎందుకు?

Q డాక్టర్! మా బాబుకు పదేళ్లు. మిగతా పిల్లలతో పోలిస్తే బాబు శిశ్నం మరీ చిన్నదిగా, ఉందా లేదన్నట్టుగా ఉంది. వృషణాల ఎదుగుదల కూడా చాలా తక్కువ. భౌతిక లక్షణాలే కాకుండా బాబు ప్రవర్తన కూడా ఆడపిల్లల్లాగే ఉంది. అదే ఈడు మగపిల్లల్లా కాకుండా ఆడపిల్లలని మరిపిస్తున్నాడు. వాడి పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఏం చేయమంటారు?

\- ఓ సోదరి, వరంగల్.

A మీరు చెప్పిన లక్షణాలు అసహజంగానే అనిపిస్తున్నాయి. అయితే ఇంత చిన్న వయసులో కేవలం లక్షణాల ఆధారంగా పిల్లల జెండర్‌ను నిర్ధారించడం సరికాదు. అలాగని అలక్ష్యం కూడా చేయకూడదు. బాబుకు పుట్టుకతో సంక్రమించిన జెండర్‌ను తెలుసుకోవాలనుకుంటే క్రోమోజెమ్ అనాలసిస్ పరీక్ష 'కార్యోటైపింగ్' చేయించాలి. ఈ పరీక్షలో బాబు క్రోమోజోమ్స్‌నుబట్టి ఆడా, మగా? అన్నది కచ్చితంగా నిర్ధారించవచ్చు. ఒకవేళ పరీక్షలో ఎక్స్, వై అనే పురుష క్రోమోజోములు ఉండి, లక్షణాలు మాత్రమే విరుద్ధంగా ఉంటే, యుక్తవయసుకు చేరుకునేవరకూ ఆగక తప్పదు. 18 ఏళ్ల వయసుకు బాబుకు నిర్దిష్ట వ్యక్తిత్వం రూపుదిద్దుకున్న తర్వాత సైకియాట్రిస్టు, ఆండ్రాలజిస్ట్‌ల సహాయంతో మరికొన్ని కీలక పరీక్షలు జరిపి, తర్వాతే సెక్సువల్ ఓరియెంటేషన్ అవసరాన్ని గమనించాలి.



కొంతమంది పురుష క్రోమోజోములతో మగపిల్లలుగానే పుట్టినా పెంపక లోపాల వల్ల, పరిసరాల ప్రభావం కారణంగా ఆడపిల్లల్లా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇలాంటి పిల్లలను కౌన్సెలింగ్‌తో సరిచేయవచ్చు. ఒకవేళ బాబుకు పరీక్షల్లో ఎక్స్, ఎక్స్ క్రోమోజోములు ఉన్నాయని తేలితే, దాన్ని జన్యుపరమైన లోపంగా భావించి, 18 ఏళ్ల దాటిన తర్వాత అవసరాన్ని బట్టి, మనస్తత్వం, వ్యక్తిత్వం, నిర్ణయాల ఆధారంగా సర్జరీ చేయించవచ్చు. ఈ పరిస్థితి ఆడపిల్లల్లో కూడా ఉంటుంది.

సెక్సువల్ ఓరియెంటేషన్ సర్జరీ

ఇది ఎంతో సంక్లిష్టమైన సర్జరీ! కృత్రిమ యోని, పురుషాంగాలను నిర్మించి, అవసరమైన హార్మోన్లను అందించే సర్జరీ ఇది. ఈ సర్జరీ ద్వారా రూపొందించిన మర్మాంగాలు నూటికి నూరు శాతం సహజసిద్ధంగా పని చేస్తాయని అనుకోకూడదు. పురుషాంగం నిర్మించగలిగినా అది అన్ని విధాలుగా ఉపయోగపడకపోవచ్చు. అలాగే యోని కూడా! అవసరమైన కండరాలను దగ్గరకు చేర్చి, యోని నిర్మాణం జరిగినా, దాన్ని డైలేటర్లతో క్రమం తప్పక వెడల్పు చేసుకుంటూ ఉండాలి. ఇలాంటి ఎన్నో ఇబ్బందులను జీవితాంతం భరించక తప్పదు. కాబట్టి సెక్సువల్ ఓరియెంటేషన్ సర్జరీకి ముందు వైద్యులు సదరు వ్యక్తులకు, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తారు. దాంతో కొందరు సర్జరీతో అవసరం లేకుండా అలాగే ఉండిపోవడానికి నిశ్చయించుకుంటే, మరికొందరు సర్జరీకి ఆసక్తి కనబరుస్తారు. ఇదంతా అనుభవజ్ఞులైన మానసిక నిపుణులు, ఆండ్రాలజిస్ట్, సెక్సువల్ స్పెషలిస్టుల పర్యవేక్షణలో సాగుతుంది.

డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్.

బెల్లంతోనూ ఫేస్‌ప్యాక్!

అందంగా కనిపించేందుకు అనేక రకాల ఫేస్‌ప్యాక్‌లు, స్క్రబ్‌లు వాడుతుంటారు. వంటింట్లో ఉండే బెల్లంతో కూడా ఫేస్‌ప్యాక్ తయారుచేసుకుని చర్మాన్ని మెరిపించవచ్చు. మరి వాటిని ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం...

- గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ బెల్లం తురుమును వేయాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్ చర్మం తేమ కోల్పోకుండా సహాయపడుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ బెల్లం తురుములో టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు వేసి బాగా కలిపి పేస్టులా తయారు చేయాలి. దీనిని ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. ఇది చర్మాన్ని నునుపు చేస్తుంది.
- టేబుల్ స్పూన్ బెల్లం తురుములో తేనె, పసుపు, నిమ్మ రసం ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగాలి. ఈ ప్యాక్ మొటిమలను తగ్గించి, చర్మాన్ని నిర్వీషికరణ చేస్తుంది.
- టేబుల్ స్పూన్ బెల్లం తురుములో టేబుల్ స్పూన్ గంధం పొడి, టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ పోసి బాగా కలిపాలి. దీనిని ముఖానికి రాసి పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే చర్మం సహజ మెరుపు సంతరించుకుంటుంది.



వీరికి కుక్కలే కుటుంబం!

అందరూ ఉండి అనాథలుగా మారిన ఇద్దరు మహిళలు వీధి కుక్కలనే ఆత్మీయులుగా ఆదరించారు. వాటిని కన్నబిడ్డల్లా కాపాడుకుంటూ, మూగ జీవాల పట్ల తమ ప్రేమను ప్రదర్శించుకుంటున్నారు. ఆ ఇద్దరు మహిళల ఆసక్తికరమైన కథల గురించి తెలుసుకుందాం!



ఆమె అసలు పేరు ప్రతిమా దేవి. కానీ ఆమె 'డాగ్ అమ్మ'గా పేరు తెచ్చుకుంది. ఆ పేరుకు తగ్గట్టే 200 వీధికుక్కలకు తల్లిగా మారిందామె. ఢిల్లీకి చెందిన ఈ 80 ఏళ్ల మహిళ కొన్నేళ్లుగా వీధికుక్కల ఆకలి తీరుస్తోంది. టీ దుకాణం నడుపుతూ, చెత్తను సేకరిస్తూ, పొట్ట పోసుకునే ప్రతిమ, 1984లో పశ్చిమ బెంగాల్‌లోని, నంది గ్రామ్ నుంచి ఢిల్లీలోని సాకేత్‌కు చేరుకున్నప్పటి నుంచి వీధికుక్కలను ఆదరించడం మొదలుపెట్టింది. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి వ్యతిరేకతలు, అవరోధాలు ఎదుర్కొంటున్నప్పటికీ వెనకడుగు వేయకుండా, తనకొచ్చే సంపాదనతో, ఇతరుల ఆర్థిక సహాయంతో వీధికుక్కల పోషణను చేపడుతోంది. ప్రతి రోజూ సివిక్ వ్యాన్ ద్వారా అందే పాలు, మాంసాలతో వీధికుక్కల ఆకలి తీరుస్తోందామె. మూగజీవాల పట్ల ప్రతిమ కనబరుస్తున్న ఆపేక్షకు ముగ్ధులైన ఇరుగుపొరుగు ఆమె టీ దుకాణాన్ని సందర్శిస్తూ, తోచిన మార్గంలో సహాయపడుతూ ఉండడం విశేషం. వీధికుక్కలకు చేస్తున్న సేవలకుగాను, ప్రతిమకు పలు జంతు సంక్షేమ సంస్థల నుంచి అవార్డులు కూడా అందాయి.

గూడు చెదిరినా...

ప్రతిమ తన గతం గురించి గుర్తు చేసుకుంటూ.. "నాకు ఏడేళ్లకే పెళ్లైంది. నాకంటే పదేళ్ల పెద్ద వ్యక్తి నాకు భర్తయ్యాడు. అతనొక తాగుబోతు. ప్రతి రోజూ నన్ను చితకబాదేవాడు. అత్తగారింట నేనెన్నో కష్టాలు పడ్డాను. మొదటి బిడ్డ పుట్టిన తర్వాత భర్త నుంచి విడిపోయి, ఇళ్లలో పనులు చేయడం మొదలుపెట్టాను. ఆ తర్వాత కొంతకాలం పాటు కోల్‌కతాలో పని చేసి, ఢిల్లీకి వచ్చేశాను. మొదట్లో నటుడు రాహుల్ దేవ్ ఇంట్లో పని చేశాను. నేను వండిన పరోటాలను ఆయన ఇష్టంగా తినేవారు. ఆయన ఇప్పటికీ నన్ను కలుస్తూ, ఆర్థికసహాయం అందిస్తూ ఉంటారు" అంటూ చెప్పుకొస్తోంది ప్రతిమ. ఈ ప్రయాణంలో ఆమె కొన్ని క్లిష్టమైన సవాళ్లను కూడా ఎదుర్కొంది. ఒక సందర్భంలో పొరుగింటివాళ్లు ఆమె ఇంటిని తగులబెట్టారు. ఆ ప్రమాదంలో ఆమెతో పాటు కుక్కలు కూడా గాయపడ్డాయి. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... "వాళ్లదొక డిపార్ట్‌మెంటల్ స్టోర్. వీధకుక్కల పీడ వదిలించుకోవాలనే ఆలోచనతో, పోలీసుల మద్దతుతో నా టీ దుకాణాన్నీ, ఇంటినీ తగులబెట్టేశారు. ఆ ప్రమాదం నుంచి బయటపడిన తర్వాత, దాచుకున్న కొద్దిపాటి సొమ్ముతో, సంగంలో ఒక ఇల్లు కొనుక్కున్నాను. కానీ ఆ ప్రాంతంలో వీధికుక్కల అనుమతి లేదు కాబట్టి మళ్లీ పాత ఇంటికే తిరిగొచ్చేశాను" అంటూ వీధికుక్కల పట్ల తనకున్న అనురాగాన్ని చాటుకుంటోంది ప్రతిమ.

భర్తను కోల్పోయిన ఢిల్లీకి చెందిన దేవి జి అనే 70 ఏళ్ల మహిళను ఆమె పిల్లలు ఇంటి నుంచి గెంటేశారు. అప్పటి నుంచి ఒక చిన్న పాకలో నివసించడం మొదలుపెట్టిన దేవి, ఏకంగా 70 నుంచి 80 కుక్కలకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పిస్తోంది. ప్రముఖ సోషల్ మీడియా క్రియేటర్, నీతు బిష్ట్ రావత్, తాజాగా ఢిల్లీలోని దేవి జీని సందర్శించి, ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈ మహిళ ఉదంతం వెలుగులోకొచ్చింది. ఆ వీడియోలో వీధికుక్కలతో సంతోషంగా ఆడుతున్న దేవిని చూసిన నెటిజన్లు ఆమె చిరునామా కోసం ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆ వీడియోను పోస్ట్ చేసిన నీతు, వీధికుక్కలకు ఆశ్రయం కల్పిస్తున్న దేవికి ఆర్థికంగా సహాయపడాలని ఫాలోవర్లను కోరడంతో, ఆమె అభ్యర్థనకు అనేక మంది స్పందించడం విశేషం.



ఈ జపనీస్ పద్ధతిలో ప్రయోజనాలెన్నో!



'ఎలాంటి నడక వల్ల ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి?'- చాలా కాలంగా ఈ విషయంపై చర్చ జరుగుతోంది. తాజాగా జపాన్‌కు చెందిన 'ఇంటర్వెల్ వాకింగ్' అనే పద్ధతికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. ఈ పద్ధతిలో మూడు నిమిషాలు వేగంగా నడుస్తారు. మరో మూడు నిమిషాలు నెమ్మదిగా నడుస్తారు. ఇలా వారానికి కనీసం నాలుగు సార్లు 30 నిమిషాల పాటు నడిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. జపాన్‌లో తాజాగా జరిపిన ఒక అధ్యయనంలో ఈ తరహాలో నడిచేవారికి బీపీ తగ్గుతుందని.. కాళ్ల కీళ్ల నొప్పులు తగ్గాయని తేలింది. కేవలం శారీరక ప్రయోజనాలు మాత్రమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వేగంగా నడిచి.. మళ్లీ నెమ్మదిగా నడవటం వల్ల ఎక్కువ శ్రమ అనిపించదని.. గాలిని ఒక క్రమ పద్ధతిలో పీల్చుకుంటారని వారు వెల్లడిస్తున్నారు.

థర్డ్‌క్లాస్ సీఎం పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదు!

- ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఏ కూటమీ సంప్రదించలేదు
- యూరియా ఇచ్చిన పార్టీ అభ్యర్థికే మద్దతిస్తాం: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి అభ్యర్థులకు మద్దతు కోరుతూ ఏ కూటమి కూడా తమను సంప్రదించలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తమది స్వతంత్ర పార్టీ అని.. ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఎన్డీయే, ఇండి సహా ఏ కూటమితోనూ తమకు సంబంధం లేదని చెప్పారు. బుధవారమిక్కడ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'మాకు మోదీ బాస్ కాదు.. రాహుల్ కూడా కాదు.. వారు చెప్పగానే మేం ఓటేస్తామా?' అని ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ తరఫున అభ్యర్థి రేవంత్‌రెడ్డి పెట్టిన వ్యక్తయితే కచ్చితంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ రాష్ట్ర ప్రజలను ఎంత అరిగోస పెడుతుందో అందరికీ తెలుసన్నారు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి, పార్టీ పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్ మాటలకే పరిమితమయ్యారని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీసీనే ప్రకటించేవారని అన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎవరికి మద్దతివ్వాలనేది ఇంకా నిర్ణయించలేదని, సెప్టెంబరు 9లోపు సమావేశమై తమ వైఖరి ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏవైనా సరే.. వచ్చే నెల 9లోపు 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తేవాలని డిమాండ్ చేశారు. ఓటింగ్‌లోపు రాష్ట్రానికి యూరియా తెచ్చిన పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తామని ఆయన ప్రకటించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తానంటున్న రేవంత్‌రెడ్డి.. ముందు కలవాల్సింది కష్టాల్లో ఉన్న రైతులనని సూచించారు.

బీసీ బిల్లులను బీజేపీ అడ్డుకుంటోంది

- ఆ పార్టీతో బీఆర్‌ఎస్ కుమ్మక్కైంది: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు కాకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆర్మూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో మహేశ్‌గౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కాగా, దమ్ముంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్‌ను తీసేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సవాల్ విసిరారు. గాంధీభవన్‌లో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. . కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను చూసి కేసీఆర్, హరీశ్‌రావులు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కమిషన్ నివేదికపై వారు హైకోర్టును ఆశ్రయించారంటే.. తప్పు చేశామని ఒప్పుకున్నట్లేనన్నారు.

బీసీని కాంగ్రెస్ ఎందుకు నిలుపలేదు?: రఘునందన్

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్.. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీసీని ఎందుకు బరిలో నిలుపలేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. బీసీలపై కాంగ్రెస్‌కు ఎంత చిత్తశుద్ధి ఉందో చెప్పేందుకు ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికే నిదర్శనమన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై తెలంగాణ బీసీలు ఆలోచించాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంజాబ్, మహారాష్ట్ర రైతులకు డబ్బులు పంచిందని, ఇప్పుడు బిహార్‌లో రాహుల్ గాంధీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం హెలికాప్టర్లు నడుపుతోందని ఆయన ఆరోపించారు.

అందరి వాడిని

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ పారికర్ కూడా తనను లోకాయుక్తగా నియమించారని గుర్తు చేశారు. అర్హులైన వ్యక్తిని ఎంచుకోవాలని ఎన్డీఏ పార్టీలను కూడా కోరుతున్నట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తిగా ఐదున్నర దశాబ్దాలు రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతనే నిర్వర్తించానని, ఇప్పుడు కూడా అదే బాధ్యత స్వీకరించేందుకు ముందుకొచ్చానని చెప్పారు. రాజ్యాంగమంటేనే సామాజిక న్యాయమని, రాజ్యాంగ పీఠికలో తొలి పదం సామాజిక న్యాయమని పేర్కొన్నారని చెప్పారు. ఈ మేరకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బుధవారం 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధితో మాట్లాడారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అన్న పదాలతో సరిపెట్టకుండా.. అన్ని వర్గాలను కలుపుకొనిపోయే 'సౌహార్ద్ర భావం' అన్న పదం చేర్చారంటే రాజ్యాంగ నిర్మాతలు ఎంత ముందుచూపుతో ఆలోచించారో అర్థమవుతుందన్నారు. "ప్రస్తుత తరుణంలో దేశంలో రాజ్యాంగం పూర్తిగా విధ్వంసం అయిందని చెప్పలేను కానీ, రాజ్యాంగ విలువలు మాత్రం దాదాపు పతనమయ్యాయని చెప్పగలను. ఎన్నికల కమిషన్ సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ కుప్పకూలిపోతున్నాయి. వాటిని పరిరక్షించాలంటే రాజ్యాంగ విలువల పట్ల పూర్తి నిబద్ధత, అవగాహన ఉన్న సరైన వ్యక్తులను వ్యవస్థల్లో నియమించాలి. వారిని నిర్ణయ క్రమంలో చేర్చాలి" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగం కుప్పకూలిపోతే సంపన్నులకు, మధ్యతరగతికి జరిగే నష్టం తక్కువైనా.. అణగారిన వర్గాలు పూర్తిగా సాధికారత కోల్పోతాయని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నవారే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు.

ఒప్పించే బాధ్యతను రేవంత్‌పై పెట్టారు..

ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై తనతో తొలుత కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ మాట్లాడారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసి 15 నిమిషాల్లో వస్తున్నానని చెప్పి ఆగమేఘాలపై వచ్చారని చెప్పారు. "మిమ్మల్ని ఒప్పించే బాధ్యతను నాపై పెట్టారు అని రేవంత్ అన్నారు. చివరగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంప్రదించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థిగా మాత్రం నేను పోటీ చేయనని అందరికీ చెప్పాను. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా మద్దతిస్తుందని, అనేక ఇతర పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని చెప్పినందుకే పోటీ చేసేందుకు ఒప్పుకొన్నాను. మిమ్మల్ని ఉపరాష్ట్రపతి పదవికి ఎంచుకోవడం మాకు గౌరవాన్ని కల్పించింది అని యుపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ అన్నారు" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు. దేశంలో 64 శాతం మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు తనను అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించాయని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌తోపాటు అన్ని పార్టీల నేతలు తనకు మద్దతు ప్రకటించారని చెప్పారు. గెలుపోటముల నేది ప్రశ్నే కాదని, ఉపరాష్ట్రపతి పదవికి జరిగే పోటీని సైద్ధాంతిక సమరంగా భావిస్తున్నామని ఖర్గే చెప్పినట్లు తెలిపారు.



అన్ని పార్టీల పట్ల సమాన దృక్పథం..

రాజకీయ పార్టీల పట్ల సమాన దృక్పథంతో వ్యవహరిస్తూ సభను సజావుగా నడపాలన్నదే తన ధ్యేయమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తనకు సత్సంబంధాలున్నాయని, వారు విజ్ఞులు, దూరదృష్టి గలవారని, సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్నవారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాకు సంబధించి ఎన్నికల కమిషన్ వివాదంలో ఇరుక్కోవడం గురించి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాకముందే దేశంలో ఓటర్ల జాబితాను తయారు చేశారని, ఆ బాధ్యతను రాజ్యాంగ సలహాదారైన బీఎన్ రావుకు అప్పజెప్పారని తెలిపారు. ప్రస్తుతం జాబితాలో ఉన్నవారిని తొలగిస్తున్నారని, బీఎన్ రావు మాత్రం శరణార్థులను కూడా ఓటర్ల జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. 1928లో అన్ని పార్టీల సదస్సులోనే పేద, ధనిక, వర్గ తారతమ్యాలు లేకుండా అక్షరాస్యతతో నిమిత్రం లేకుండా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారని, ఈ మేరకు నెహ్రూ నివేదిక సమర్పించారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అంతకన్నా పదేళ్ల ముందే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సౌత్‌బరో కమిటీ ముందు దళితులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారని వివరించారు. గాంధీజీ కూడా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను సమర్థించారని, ఈ విషయంలో గాంధీ, అంబేడ్కర్ ఏకీభావం వ్యక్తం చేశారని తెలిపారు. దేశ తొలి ఎన్నికల కమిషనర్ సుకోమల్ సేన్ కూడా నెహ్రూ కోరినా ఎన్నికలు జరిపేందుకు ఏడాదిపాటు సమయం తీసుకున్నారని, దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు శ్రమించారని వివరించారు ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న ఎన్నికల కమిషన్.. ఇప్పుడు రాజకీయ వివాదాల్లో చిక్కుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాల్‌లో రెడ్‌బెలూన్ నమూనా

సరుకుల రవాణా బెలూన్లు వస్తున్నాయ్..

- 2029 కల్లా 'రెడ్ బెలూన్' కార్గో సేవలు
- హైడ్రోజన్‌తో నడిచే ఎయిర్‌షిప్
- తక్కువ వ్యయంతో రవాణాకు వీలు
- ఆర్‌టీఐహెచ్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా విజయవాడ కంపెనీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సరుకుల రవాణా అంటే.. మనకు లారీలు, రైళ్లు, విమానాలు, నౌకలు గుర్తొస్తాయి. వీటికి ఇప్పుడు బెలూన్లు కూడా తోడవ్వనున్నాయి. ఎయిర్‌బస్ విమానానికి మూడింతలు ఉండే బెలూన్లు త్వరలోనే ఆకాశంలో ఎగురుతూ కనిపించనున్నాయి. గ్రీన్‌హైడ్రోజన్‌తో నడిచే ఈ బెలూన్లు 2029 కల్లా కార్గో సేవలను అందించేందుకు సిద్ధమవుతున్నాయి. విజయవాడకు చెందిన డీప్ టెక్ స్టార్టప్ కంపెనీ రెడ్ బెలూన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హెలిక్స్ పేరుతో కార్గో బెలూన్‌లను రూపొందిస్తోంది. ఏఐతో పని చేసే ఇలాంటి బెలూన్లు దేశీయంగా తయారు చేయడం ఇదే మొదటిసారి. వాణిజ్య, రక్షణ అవసరాల కోసం వీటిని అభివృద్ధి చేస్తున్నారు. బుధవారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాల్స్‌లో రెడ్‌బెలూన్ నమూనాను కూడా ప్రదర్శించారు. స్టాల్‌లో విమానం ఆకారంలో ఉన్న తెల్లటి బెలూన్‌ను అందరూ ఆసక్తిగా చూశారు. అంతరిక్షరంగంలో పరిశోధన-అభివృద్ధి విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉన్న డాక్టర్ సీవీఎస్ కిరణ్, శిరీష్ పల్లికొండ రెడ్ బెలూన్ సంస్థను స్థాపించారు. గ్రీన్ హైడ్రోజన్ సాయంతో బెలూన్ విధానంలో కార్గో సేవలను ఎందుకు అందుబాటులోకి తీసుకురాకూడదన్న ఆలోచనతో సంస్థను ప్రారంభించారు. ఈ బెలూన్ డిజైన్‌నూ కూడా వారే రూపొందించారు. సహజంగా ఎయిర్‌బస్ విమానం చాలా పెద్దదిగా ఉంటుంది. దానికి మూడింతల సైజులో కార్గో బెలూన్ ఉంటుంది. అతి తక్కువ గ్రౌండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో కార్గో బెలూన్లను నిర్వహించవచ్చు. రవాణా సదుపాయాలు లేని మారుమూల ప్రాంతాలు, ప్రకృతిపైపరీత్యాల ప్రభావిత ప్రాంతాలకు సులువుగా సరుకులు రవాణా చేయవచ్చు. హైడ్రోజన్ వినియోగం వల్ల వాతావరణ కాలుష్యం కూడా ఉండదు. ఈకార్గో ఎయిర్‌షిప్ గురించి సంస్థ ప్రతినిధులు కిరణ్, శిరీష్ పలు ఆసక్తికర అంశాలు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఈ బెలూన్‌లను రిమోట్ సాయంతో 20 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో వస్తువులను చేరవేయచ్చన్నారు. ఇలా వస్తువులను చేరవేసేందుకు కిలో బరువుకు రూ. 80 నుంచి రూ. 100 దాకా వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు శిరీష్ వివరించారు. రైలు, రోడ్డు రవాణా కంటే తక్కువ వ్యయం అవుతుందన్నారు. రెడ్‌బెలూన్ కార్గో సేవలు రాష్ట్రంలో 2029 నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు.

ఆవిష్కరణలు @ ఆంధ్రా

- క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐతో ప్రపంచ పటంలో అమరావతి: ఏపీ సీఎం
- అమరావతిలో ఇన్నోవేషన్ హబ్‌లు ప్రారంభం

అమరావతి/మంగళగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధతో అమరావతి నగరాన్ని ప్రపంచ పటంలో ఉంచుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సృజనాత్మక ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌పార్క్‌లో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రతన్‌టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలన్న సంకల్పంతో రాష్ట్రంలో ఆయన పేరిట ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించామన్నారు. అదేవిధంగా విశాఖ, తిరుపతి, అనంతపురం, రాజమండ్రి, విజయవాడల్లో ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్‌లు కూడా వర్చువల్‌గా ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ముఖ్యంగా అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. అలాగే విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లోనూ అపారమైన అవకాశాలున్నాయని వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించాలన్న ఆలోచనను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు సలహాలు, సూచనలు అందిస్తానని చెప్పారని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లలో గిన్నిస్ రికార్డు

ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల కోసం కేవలం 24 గంటల్లోనే రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఘనత సాధించిన ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ రికార్డు లభించింది. ముఖ్యమంత్రికి చంద్రబాబుకు గిన్నిస్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు.



చంద్రబాబుకు రోబో స్వాగతం

ముఖ్యమంత్రి కార్యక్రమం అనగానే.. అధికారులు, నాయకుల హడావుడి, ప్రొటోకాల్, స్వాగత ఏరాట్లు మామూలుగా ఉండవు.. అయితే సీఎం చంద్రబాబుకు ఊహించని స్వాగతం లభించింది. జాగిలం ఆకారంలో ఉన్న ఓ రోబో ఆయనకు ఎదురుగా వచ్చి లేచి నిల్చుని నమస్కారం చేసింది. రోబోను చూసి ముచ్చటపడ్డ చంద్రబాబు కూడా ప్రతి నమస్కారం చేశారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మోక్షజ్ఞ ఎంట్రీ అప్పుడే



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'సుందరకాండ' చిత్రం ఈ నెల 27 విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి మోక్షజ్ఞ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే సంవత్సరం ప్రారంభంలో ఆయన సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సినిమాల కోసమే తన లుక్‌ను మునుపటి కంటే ఎంతో చక్కగా మార్చుకున్నాడు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసమే చూస్తున్నట్లు చెప్పాడు. ఒక మంచి ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీతో ఆరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. తనకు అలాంటి కథ దొరికితే ఈ ఏడాదిలోనే పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వొచ్చు' అని వివరించారు నారా రోహిత్.

ఘాటీల జీవన శైలిని చూపించే దస్సోరా



అనుష్క అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నయాక్షన్ డ్రామా 'ఘాటీ' అన్ని హంగులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 5న విడుదల కావడానికి సిద్ధమవుతోంది.విక్రమ్ ప్రభు హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ సినిమాలోని సెకెండ్ సింగిల్ 'దస్సోరా'ను బుధవారం విడుదల చేశారు. ఘాటీల జీవన శైలి, వారి కల్చర్‌ను ప్రతిబింబిస్తూ ఈఎస్ మూర్తి ఈ పాట రాశారు. పాటలో అనుష్క, విక్రమ్ ప్రభు విజువల్స్ బాగున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'ఘాటీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. సాయిమాధవ్ మాటలు రాసిన ఈ చిత్రానికి మనోజ్ రెడ్డి కటాసాని సినిమాటోగ్రఫీని, తోట తరణి కళా దర్శకత్వాన్ని నిర్వహించారు.

అందరూ చూడాల్సిన సినిమా



బ్రహ్మానందం

ఆర్.నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ పేపర్ లీక్'. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రాన్ని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'హాయిగా తలార స్నానం చేసి నేత చీర కట్టుకున్న స్త్రీలా ఉన్న చిత్రమిది. అందరూ చూడాల్సిన సినిమా. ఇందులో నిజాలుంటాయి. బూతులుండవు. జీవితపు విలువలు ఉంటాయి' అని అన్నారు. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ 'సినిమా చూసి నన్ను ఆశీర్వదించి నాపై ప్రేమను చూపిస్తున్న బ్రహ్మానందం గారికి కృతజ్ఞతలు' అని అన్నారు.

రంగంలోకి రేవంత్ సర్కార్.. అతి త్వరలోనే పరిష్కారం!

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినీ కార్మికుల సమ్మె 17వ రోజుకు చేరుకున్న తరుణంలో.. బుధవారం ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి సినీ కార్మికుల సమ్మె అడ్డంకిగా మారుతోందని భావించిన ప్రభుత్వం.. సమస్యకు ముగింపు పలకడానికి నేరుగా రంగంలోకి దిగింది. ఈ మేరకు సమ్మె వ్యవహారంపై ఇరువర్గాలతో చర్చించి పరిష్కరించాలని హోమ్ శాఖ ప్రధాన కార్యదర్శి రవి గుప్తను, కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పాత్ర కీలకంగా మారనుంది. ప్రభుత్వ జోక్యంతో అతి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారమవుతుందని సినీ ప్రముఖులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులను పిలిపించుకుని చర్చలు జరిపినట్లు సమాచారం. 'ఇప్పటికే 30 శాతం వేతన పెంపును అంగీకరించిన నిర్మాతల సినిమాలకు మా కార్మికులు పనిచేస్తున్నారు. గురువారం నుంచి 20 శాతం వేతన పెంపును ఇచ్చే నిర్మాతల సినిమాలకు కూడా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు కమిషనర్ సీవీ ఆనంద్‌కు వివరించినట్లు తెలిసింది. త్వరలోనే జూబ్లీహిల్స్ నియోజక వర్గానికి ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న సినీ కార్మికుల ఓట్లు కీలకం కావడం కూడా ఈ తాజా పరిణామానికి కారణమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

అందరికీ నచ్చుతుంది



మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ బ్యానర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సెప్టెంబరు 12న థియేట్రికల్‌గా విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. తాజాగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అనిల్ రావిపూడి మాట్లాడుతూ "ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. టైటిల్ వింటే 'ప్రేమించుకుందాం రా' సినిమాలోని వెంకటేశ్ గుర్తొచ్చారు. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

సరికొత్త అంశాలతో...



గీత్ సైనీ, శ్రీచరణ్ రాచకొండ జంటగా సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కన్యాకుమారి'. నటి మధుశాలిని సమర్పిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథి హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలతోనే సినిమాపై ఆసక్తిని పెంచారు. సరికొత్త అంశాలతో సాగే వినూత్న కథాంశం అని తెలుస్తోంది' అని అన్నారు. మధుశాలిని మాట్లాడుతూ 'సృజన్ గారు ఓ మంచి చిత్రాన్ని మన ముందుకు తెచ్చారు' అని చెప్పారు.

ఈవీఎంలపై అనేక అనుమానాలు

- దొంగ ఓట్లు చేర్చి నిజమైన ఓట్లు తొలగిస్తున్నారు
- పలువురు వక్తల ఆరోపణ

పంజాగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న ఎన్నికలలో ఉపయోగిస్తున్న ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని, దొంగ ఓట్లు చేర్చి.. నిజమైన ఓట్లు తొలగిస్తున్నారని పలువురు వక్తలు ఆరోపించారు. తెలంగాణ స్టేట్ డెమొక్రటిక్ ఫోరం (టీఎస్డీఎఫ్), జాగో నవ భారత్, ఓట్ నీడ్ గ్యారంటీ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి- స్వతంత్ర ఎన్నికల కమిషన్' అంశంపై టీఎస్డీఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో జస్టిస్ బి.చంద్రకుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, వివిధ సంఘాలు, సంస్థల నాయకులు ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, చలపతిరావు, జానకీ రాములు, పోటు రంగారావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు.

రాష్ట్రంలో 1.18 కోట్ల ఎకరాల్లో పంటల సాగు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో 90 శాతం పంటల సాగు పూర్తయిందని వ్యవసాయ శాఖ బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలు కాగా ఇప్పటిదాకా 1,18,69,542 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగైనట్టు ఓ నివేదికలో పేర్కొంది. గత వారంతో పోలిస్తే ఈ వారం వరి సాగు అనూహ్యంగా పుంజుకుందని, వర్షాలు విస్తారంగా పడుతుండడంతో రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారని వ్యవసాయ శాఖ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 55 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారని తెలిపింది. మరో ప్రధాన పంట పత్తి 45 లక్షల ఎకరాల్లో సాగు చేశారని, మొక్కజొన్న సాగు విస్తీర్ణం అనూహ్యంగా 6 లక్షల ఎకరాలు దాటిందని పేర్కొంది.

మహోగ్ర గోదావరి!



- భద్రాచలం వద్ద 48 అడుగులకు ప్రవాహం.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రులు పొంగులేటి, తుమ్మల ఆదేశాలు
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోనూ ప్రమాద హెచ్చరికలు.. మునిగిన పంటలు
- సమ్మక్కసాగర్ బ్యారేజీకి 10.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కృష్ణాలో శ్రీశైలానికి 4.78 లక్షలు, సాగర్‌కు 4.85 లక్షల క్యూసెక్కులు
- నేడు, రేపు తేలికపాటి వర్షాలు..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



భద్రాచలం వద్ద కల్యాణకట్ట దిగువభాగానికి చేరిన నీరు, (ఇన్‌సెట్లో)సాయంత్రం 6గంటల వరకు 46.5 అడుగులకు చేరిన వరద

గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో పెద్ద ఎత్తున వరద నదిలో చేరుతుండటంతో పలు జిల్లాల్లో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా.. పంటపొలాలు నీట మునిగాయి. దీంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. భద్రాచలం వద్ద రాత్రి 10.05 గంటలకు గోదావరి 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దేవస్థానం స్నానఘట్టాలు మునిగిపోగా.. కల్యాణ కట్ట కింది భాగంలోకి వరద నీరు చేరింది. దీంతో భక్తులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే.. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, భద్రాచలం పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా అధికారులను వేర్వేరుగా ఆదేశించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు భద్రాచలం గోదావరి వరద కరకట్టపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద.. వాజేడు మండలం పేరూరు వద్ద అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యాక్ వాటర్‌తో చాలాచోట్ల పంట పొలాలు నీట మునగ్గా.. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 78 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ దివాకర తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తుపాకులగూడెం వద్ద సమ్మక్కసాగర్ బ్యారేజీకి అత్యధికంగా 10.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా.. దిగువన మేడిగడ్డ బ్యారేజీకి 10.20 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఆయా బ్యారేజీలకు వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. గోదావరి బేసిన్‌లో ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 2.30 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. ఔట్‌ఫ్లో 3.06 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఎల్లంపల్లికి 4.86 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. ఔట్‌ఫ్లో 5.31 లక్షల క్యూసెక్కులుగా ఉంది. సింగూరుకు 38 వేల క్యూసెక్కులు వస్తుండగా.. 43 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. నిజాంసాగర్‌కు 72 వేల క్యూసెక్కులు రాగా... ఔట్‌ఫ్లో 69 వేల క్యూసెక్కులుగా ఉంది.

కృష్ణా ప్రాజెక్టులకూ భారీగానే..

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగానే వరద చేరుతోంది. శ్రీశైలానికి 4.78 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 5.18 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నాగార్జునసాగర్‌కు 4.85 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో 4.78 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఆల్మట్టికి 2.45 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 2.50 లక్షల క్యూసెక్కులను వదిలారు. నారాయణపూర్‌కు 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 2.60 లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జూరాలకు 3.30 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 3.22 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి అనార్‌పల్లి వాగులో అంగన్‌వాడీ టీచర్‌ను భుజాలపై ఎత్తుకుని వాగు దాటిస్తున్న కుటుంబీకులు, గ్రామస్థులు

పలు జిల్లాల్లో వర్షాలు..

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. చాలాచోట్ల వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వానలు పడ్డాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అత్యధికంగా 6.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాలలో మంగళవారం ఈతకు వెళ్లి గల్లంతైన నందులాల్ (20) మృతదేహం లభ్యమైంది. డిండి రిజర్వాయర్ నిండింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్‌లో మంజీరా వరదతో మునిగిన పంటలను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ మహిళా రైతు ఎమ్మెల్యే కాళ్లపై పడి ఆదుకోవాలని వేడుకోవడం కంటతడి పెట్టించింది. ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని బోరిలాల్‌గూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పవార్ కవిత తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబీకులు, గ్రామస్థులు భుజాలపై ఎత్తుకుని వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. కాగా, రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారంఆదిలాబాద్, కొత్తగూడెం, హైదరాబాద్ సహా 18 జిల్లాల్లో వానలు కురిసే అవకాశముందని తెలిపింది.



నీటి ముంపునకు గురైన మంచిర్యాల కార్పొరేషన్ పరిధి వేంపల్లిలోని ఇళ్లు (ఫైల్)

చెడులోనూ మంచి!

- మేడిగడ్డ కుంగుబాటుతో మంచిర్యాలకు తప్పిన ముంపు
- నీటి నిల్వను ఆపేయడంతో ప్రవాహానికి తొలగిన అడ్డంకి
- భారీ వర్షాలు కురుస్తున్నా పట్టణం దరిచేరని వరద నీరు

మంచిర్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెడులోనూ మంచి అంటే ఇదేనేమో..! కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు తీవ్ర నష్టమే కలిగించినా.. మంచిర్యాల ప్రజలకు మాత్రం ఓ రకంగా మేలు చేసిందని చెప్పవచ్చు. మేడిగడ్డ కుంగుబాటు మంచిర్యాలను వరద ముంపు బాధ నుంచి తప్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి వర్షాకాలంలో మంచిర్యాలను వరదలు చుట్టుముట్టడం ఆనవాయితీగా మారింది. గోదావరి ఉప్పొంగిన ప్రతిసారి మంచిర్యాల జలమయం అయ్యేది. 2022 నుంచి మంచిర్యాలలో ఇదే పరిస్థితి. కానీ, ప్రస్తుతం కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా, గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోన్న వరదలు మంచిర్యాల దరిదాపులకు రాలేదు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగినప్పటి నుంచి అధికారులు అందులో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో గోదావరి ప్రవాహానికి అడ్డు తొలగిపోయి బ్యారేజీలోకి వచ్చిన నీరంతా ఎప్పటికప్పుడు దిగువకు వెళ్లిపోతోంది. దీంతో మంచిర్యాలకు వరద ముంపు తప్పింది.

దెబ్బతిన్న రోడ్లకు తక్షణ చర్యలు:కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతులపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 739 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ మంత్రికి వివరించారు. ఈ నష్టం సుమారు 854 కి.మీ మేర ఉందని తెలిపారు. ఇందులో 25 చోట్ల రోడ్లు పూర్తిగా తెగిపోగా, ఇప్పటికే 5 చోట్ల తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.46 కోట్లు ఖర్చు అవుతుందని, శాశ్వత నిర్మాణాలకు రూ.984 కోట్లు అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు.

ఫ్లాట్ అద్దెకు కావాలంటూ 12.75 లక్షల కాజేత!

- సైబర్ కేటుగాళ్ల బురిడీ.. బాధితుడి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సామాన్యులనే కాదు.. విద్యావంతులనూ బురిడీ కొట్టిస్తూ రోజుకో కొత్త మార్గంలో సైబర్ నేరగాళ్లు డబ్బులు దండుకుంటున్నారు. తాజాగా ఫ్లాట్ అద్దె కావాలంటూ ఆర్మీ అధికారుల్లా మాట్లాడి నమ్మించిన కేటుగాళ్లు.. అద్దె అడ్వాన్స్ చెల్లిస్తామంటూ ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.12.75 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. డీసీపీ ధార కవిత కథనం మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఫ్లాట్‌ను అద్దెకిచ్చేందుకు ఆ వివరాలను ఓ వెబ్‌సైట్‌లో పోస్టు చేశాడు. అది చూసి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను ఆర్మీ అధికారి ఆశీష్‌కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. తనకు పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిందని, ఫ్లాట్ బాగా నచ్చిందంటూ నమ్మబలికాడు. దీంతో బాధితుడు అద్దె అడ్వాన్స్ ముందే ఇవ్వాలన్నాడు. అందుకు ఒప్పుకొన్న ఆగంతకుడు.. అడ్వాన్స్ డబ్బులు తమ అధికారులు ఆన్‌లైన్‌లో చెల్లిస్తారని చెప్పాడు. ఆ తర్వాత మరో వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశాడు. 'ఫ్లాట్ అద్దె అడ్వాన్స్ కింద రూ.80 వేలు చెల్లించాలని మా అధికారి చెప్పారు. అయితే ఆర్మీ ప్రొటోకాల్ ప్రకారం.. పుల్వామా దాడులు జరిగిన తర్వాత యూపీఐ, ఐఎంపీఎస్ చెల్లింపులు నిలిపేశారు. మొదట మీరు డబ్బులు చెల్లింపులు చేస్తే వాటిని మా అధికారులకు చూపించి రెట్టింపు డబ్బు పంపిస్తాం' అని తెలిపాడు. ఇది నమ్మిన బాధితుడు ముందుగా రూ.80 వేలు చెల్లించాడు. తర్వాత విడతల వారీగా బాధితుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.12.75 లక్షలు దోచుకున్నారు.

ఫ్లై ఓవర్‌పై రైలింగ్‌ను ఢీకొట్టి ఇద్దరు మృతి

పంజాగుట్ట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తూ పంజాగుట్ట ఫ్లై ఓవర్‌పై రైలింగ్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో ముగ్గురు యువకులు గాల్లోకి ఎగిరి 30 అడుగుల కింద ఉన్న రహదారిపై పడిపోయారు. ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరు తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సికింద్రాబాద్ బాలంరాయ్ అన్నా నగర్‌కు చెందిన సి.భరత్(32), వేణు, శ్రీను కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి మద్యం సేవించి బిర్యానీ తినడానికి ద్విచక్ర వాహనంపై బంజారాహిల్స్‌కు బయలుదేరారు. శ్రీను వాహనం నడుపుతుండగా మిగతా ఇద్దరు వెనకాల కూర్చున్నారు. ప్రజా భవన్ ఎదురుగా పంజాగుట్ట ఫ్లై ఓవర్ ఎక్కారు. మితిమీరిన వేగంతో వెళ్తూ ఫ్లైఓవర్‌పై రైలింగ్‌ను ఢీకొని ఎగిరి కింద పడ్డారు. భరత్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన శ్రీను, వేణులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందారు.

చట్టసవరణ చేయాలని ప్రభుత్వానికి సూచించలేం..

- షెడ్యూల్ ఏరియా సర్పంచ్ పదవుల్లో గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్‌లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియాల్లోని గ్రామాల సర్పంచ్ పదవుల్లో గిరిజనులకున్న వంద శాతం రిజర్వేషన్ అంశంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. చట్టాన్ని మార్చాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయలేమని, అది శాసన వ్యవస్థ విచక్షణపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సదరు నిబంధనలను చేర్చారని, వాటిని మార్చాలని తాము ప్రభుత్వానికి చెప్పలేమని తెలిపింది. అలాగే రాజ్యాంగ సవరణ చేయాలని కోరలేమని పేర్కొంది. షెడ్యూల్ ఏరియాల్లోని కొన్ని గ్రామాల్లో ఎస్టీల జనాభా పది శాతం కూడా లేదని.. అయినా సర్పంచ్ పదవుల్లో గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, గిరిజనేతరులూ సర్పంచ్ పదవులకు పోటీచేసే అవకాశమివ్వాలని పేర్కొంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన నాన్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సూరెడ్డి రమణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. వందశాతం రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15లకు వ్యతిరేకమని.. అలాగే 'చేబ్రోలు లీలాప్రసాద్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టాన్ని సవరించాలని శాసన వ్యవస్థను తాము నిర్దేశించలేమని, అది శాసనవ్యవస్థ విచక్షణపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి తాము చెప్పలేమని తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే దాఖలైన ఈ పిటిషన్ ప్రీమెచ్యూర్ పిటిషన్ అని, ఇది విచారణార్హమైన పిటిషన్ కాదని కొట్టేసింది.

ఐదేళ్లుగా బహ్రెయిన్‌లోనే మృతదేహాలు

- ఎట్టకేలకు ఇద్దరు తెలుగువారికి దహన సంస్కారాలు
- భారత ఎంబసీ, ఏపీ ఎన్నార్టీఎస్ సహకారంతో అంత్యక్రియలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఏడడుగుల బంధం ఎడారి దేశాలకు వచ్చేసరికి ఎండమావిగా మారుతోంది. ఆర్థిక సమస్యల మధ్య కుటుంబ బంధాలు దూరమవుతున్నాయి. తమ వారి బంగారు భవిష్యత్తు కోసం సొంత ఊరిని వదిలి ఎడారి దేశాలకు వచ్చిన వారు.. ఇక్కడ రోడ్డు ప్రమాదాల రూపంలోనో, అనారోగ్యం కారణంగానో చనిపోతే.. వారి మృతదేహాలను తీసుకునేందుకు వారి కుటుంబ సభ్యులే ముందుకు రావడం లేదు. ఆర్థిక సమస్యల కారణంగా కొందరు.. కుటుంబ సభ్యులు పట్టించుకోక మరికొందరు బహ్రెయిన్‌లో అనాథ శవాలుగా పడి ఉన్నారు. అలాంటి ఇద్దరు ప్రవాసాంధ్ర మహిళల మృతదేహాలకు ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత బహ్రెయిన్‌లో దహన సంస్కారాలు జరిగాయి. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పరింపూడి గ్రామానికి చెందిన 32 ఏళ్ల కొరడా సత్యవతి 2020లో బహ్రెయిన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన 52 ఏళ్ల పల్లవాకాడ పైడమ్మ కూడా అదే ఏడాది గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. అయితే.. పేదరికం కారణంగా కుటుంబ సభ్యులు ఈ మృతదేహాలను స్వీకరించడానికి నిరాకరించారు. కనీసం స్థానికంగా దహన సంస్కారాలు నిర్వహించడానికి అవసరమైన అంగీకారపత్రాలు కూడా పంపించలేదు. దీంతో బహ్రెయిన్ ప్రభుత్వం వీరి మృతదేహాలను ఐదేళ్లుగా ఫ్రీజర్‌లోనే ఉంచింది. ఈ అంశాన్ని బహ్రెయిన్ ప్రభుత్వం భారత ఎంబసీ ద్వారా ఏపీ ఎన్నార్టీఎస్ సంస్థ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బహ్రెయిన్‌లోని ప్రముఖ సామాజిక సేవకుడు దోర్నాల శివకుమార్ వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు చొరవ చూపారు. ఏపీ ఎన్నార్టీఎస్ చొరవతో ఆయా జిల్లాల కలెక్టర్లు మృతుల కుటుంబాలను సంప్రదించి అవసరమైన పత్రాలు పంపించారు. దీంతో ఈ ఇద్దరు పేద మహిళలకు శివకుమార్ అన్నీ తానై బుధవారం దహన సంస్కారాలు జరిపించారు. బహ్రెయిన్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అనాథ మృతదేహాలన్నింటికీ ఆయనే దగ్గరుండి దహన సంస్కారాలు చేపడుతున్నారు.

ఏఐ ఆధారిత పెట్టుబడుల పేరుతో.. 850 కోట్ల మేర కుచ్చుటోపీ.. ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడతామని.. దాంతో భారీ లాభాలు ఆర్జించవచ్చని ప్రలోభపెడుతూ వేలాది మంది నుంచి డిపాజిట్లు సేకరించి మోసం చేసిన ముగ్గురిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం మాలవరప్పాడు గ్రామానికి చెందిన గడ్డం వేణుగోపాల్ మణికొండలో ఉంటున్నాడు. ఇతడు ఏవీ సొల్యూషన్స్, శ్రీనివాస్ ఎనలిటికల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థలను స్థాపించాడు. షేర్ మార్కెట్‌లో అధిక లాభాలు వచ్చేలా.. ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పెట్టుబడులు పెడుతున్నామని ప్రచారం చేసుకున్నాడు. తన ప్రాంతానికి చెందిన గడ్డం వెంకట్రావు, కర్ణాటకలోని బళ్లారికి చెందిన శ్రేయాస్ పౌల్‌తో కలిసి ఐవీటీ క్యాపిటల్ టెక్నాలజీస్, ట్రేడ్ బుల్స్ టెక్నాలజీ పేరుతో మరో రెండు సంస్థలను స్థాపించాడు. తమ సంస్థలకు ఎన్ఐఎస్ఎం/ఎన్ఎస్ఈ/బీఎస్ఈ సర్టిఫికెట్లు ఉన్నాయని నకిలీ పత్రాలు చూపి, కస్టమర్ల నమ్మకం సంపాదించుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసి, నెట్‌వర్క్ మార్కెటింగ్ తరహాలో 3 వేలమందికి పైగా సభ్యులను చేర్చుకున్నాడు. పెట్టుబడి పెడితే నెలకు 7 శాతం వడ్డీ ఇస్తానని నమ్మబలికాడు. దీనికి సంబంధించి ఐవీటీ స్టాక్‌మార్కెట్ డాట్‌కామ్, షైషేర్‌ప్రాఫిట్‌డాట్‌కామ్, ఏవీగ్రూప్స్‌డాట్ ఓఆర్‌జీ, షెహ ఫిన్‌డాట్‌కామ్, ట్రేడింగ్‌సెంబర్స్ డాట్‌కామ్, స్మాల్‌గోడాట్‌కామ్, శ్రీమాతాడాట్‌కామ్, మహేశ్వరఅడ్వైజరీ సర్వీసెస్ పేరుతో వెబ్‌సైట్‌లు తయారు చేసి, వాటి ద్వారా లాభాలు వచ్చినట్లు చూపేవాడు. ముందుగా కొంతమందికి వడ్డీలు చెల్లించడంతోపాటు, భారీగా ప్రచారం చేసుకోవడంతో దాదాపు 3 వేలమంది వీరిని నమ్మి రూ.618 కోట్లు పెట్టుబడి పెట్టారు. 2388 మంది నుంచి 441 కోట్లు సేకరించిన వేణుగోపాల్.. అందులో 337 కోట్లు తిరిగి చెల్లించి, 104 కోట్లు కాజేశాడు. గడ్డం వెంకట్రావు 776 మంది నుంచి రూ.409 కోట్లు సేకరించి.. అందులో రూ.281 కోట్లు చెల్లించి, మిగతా 128 కోట్లు తనఖాతాలో జమ చేసుకున్నట్లు విచారణ అధికారులు గుర్తించారు. సేకరించిన డబ్బుతో ఖరీదైన కార్లు కొని, విలాసవంతమైన జీవనం గడపడంతోపాటు రియల్ ఎస్టేట్‌లో కూడా వారు పెట్టుబడులు పెట్టినట్టు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు.. వారి నుంచి రెండు ఖరీదైన కార్లు, 11 ల్యాప్‌టాప్‌లు, 3 మొబైల్స్, 14 చెక్‌బుక్‌లు, 30 ప్రామిసరీ నోట్లు, మణికొండ హ్యాపీహోమ్స్‌లో 3.37 కోట్ల విలువైన ఫ్లాట్లకు సంబంధించిన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు.

వానలతో రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం

- 7 గంటలు ఆలస్యంగా హుస్సేన్ సాగర్, గౌతమి ఎక్స్‌ప్రెస్
- పలు రైళ్లను రీషెడ్యూల్ చేసిన దక్షిణ మధ్య రైల్వే
- ఇంటికన్నెలో 2 గంటలపాటు నిలిచిన 'ఎల్‌టీటీ'
- తీర్థయాత్రలకు వెళ్లి చిక్కుకుపోయిన తెలంగాణ వాసులు



ఇంటికన్నెలో ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు అమరుస్తున్న మరో ఇంజన్

హైదరాబాద్ సిటీ, కేసముద్రం, మంచిర్యాల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తోన్న భారీ వర్షాల ప్రభావం హైదరాబాద్ నుంచి బయల్దేరే పలు రైళ్ల రాకపోకలపై పడింది. ముంబై నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ 10 గంటలు ఆలస్యంగా వచ్చింది. బుధవారం హైదరాబాద్ నుంచి ముంబైకి బయల్దేరాల్సిన హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌ను 7గంటలు ఆలస్యంగా రాత్రి 9.55గంటలకు రీషెడ్యూల్ చేశారు. ముంబై నుంచి లింగంపల్లికి రావాల్సిన దేవగిరి ఎక్స్‌ప్రెస్ 7గంటలు ఆలస్యంగా వచ్చింది. ఇదే రేక్‌తో కాకినాడకు వెళ్లాల్సిన గౌతమి ఎక్స్‌ప్రెస్‌ను గురువారం ఉదయం 1.30కు(7గంటలు ఆలస్యం) రీషెడ్యూల్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లో విశాఖ నుంచి ముంబై వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ 2 గంటలపాటు నిలిచిపోయింది. ఇంజన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో వరంగల్ నుంచి కొత్త ఇంజన్ తీసుకువచ్చి అమర్చాక రైలు ముందుకు కదిలింది. దీంతో 2 గంటలపాటు అప్‌లైనులో వెనుక ఉన్న కొన్ని స్టేషన్ల వరకు రైళ్లు నిలిచిపోయాయి.

మహారాష్ట్రలో చిక్కుకుపోయిన తెలంగాణ వాసులు

తీర్థయాత్రలకు వెళ్లిన 28 మంది తెలంగాణ వాసులు భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలో చిక్కుకుపోయారు. మంచిర్యాల, గోదావరిఖనికి చెందిన కొందరు తీర్థయాత్రలో భాగంగా మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా గగన్‌బావడాకు చేరుకోగా వీరి బస్సును పోలీసులు నిలిపివేశారు. వరదల కారణంగా ముందుకు వెళ్లలేరంటూ అక్కడే ఓ దాబా హోటల్ సమీపంలో చిన్న రేకుల షెడ్డులో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. అయితే తమకు కనీసం ఆహారం, నీళ్లు కూడా ఇవ్వలేదని, కరెంటు కూడా లేకపోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని మహిళలు, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు.

చెరువులు నింపాలని రోడ్డెక్కిన రైతులు

- కాళ్లు మొక్కుతా అన్నా కనికరించని ఈఈ: రైతులు



ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

జనగామ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓబుల్ కేశవపూర్, పసరమడ్ల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, శామీర్‌పేట గ్రామ రైతులు బుధవారం జిల్లా కేంద్రంలోని వడ్లకొండ రోడ్డులోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఈఈ మంగీలాల్‌ను సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, పశువులకు కూడా నీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల ద్వారా చెరువులు నింపాలని ఇరిగేషన్ ఈఈ మంగిలాల్‌కు పలుమార్లు కోరినా, కాళ్లు మొక్కుతామన్నా పట్టించుకోకుండా అవమానించారని ఆరోపించారు. మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. రైతులతో అనుచితంగా ప్రవర్తించిన మంగీలాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని, అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడించి మూడు రోజుల్లో సాగు నీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించుకున్నారు.

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్

- సంఘం నుంచి జాగృతి నాయకుల తొలగింపు
- కొప్పుల ఎన్నిక అప్రజాస్వామికం: సింగరేణి జాగృతి



కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కోల్‌బెల్ట్ ప్రాంత మాజీ ఎమ్మెల్యేలు

గోదావరిఖని/హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు అనుబంధంగా సింగరేణిలో పనిచేస్తున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షుడిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన టీబీజీకేఎస్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్న పదవికి ఈశ్వర్‌ను ఎన్నుకున్నామని టీబీజీకేఎస్ ప్రకటించింది. టీబీజీకేఎస్‌కు సింగరేణి జాగృతిలో పనిచేస్తున్న వారికి ఎలాంటి సంబంధం లేదని సమావేశం తీర్మానించింది. టీబీజీకేఎస్‌లో ఉంటూ జాగృతిలో పనిచేస్తున్న ఎల్ వెంకటేష్, నరేష్ నేతలను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇటు టీబీజీకేఎస్‌లో అటు జాగృతిలో జోడు సవారీ చేయడం కుదరదని, ఊగిసలాటలో ఉన్న వారు ఏదో ఒకవైపే నిలబడాలని సూచించింది. 'సింగరేణి బచావో.. కాంగ్రెస్ హఠావో' పేరిట సింగరేణిలో యాత్ర నిర్వహించాలని తీర్మానించింది. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సింగరేణిలో కొత్త బొగ్గు బ్లాకుల సాధన, కార్మికుల ఆదాయ పన్ను రద్దు కోసం ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అప్రజాస్వామికమని, కార్మిక సంఘం విధానాలకు, సంస్కృతికి భిన్నంగా ఆయనను ఎన్నుకున్నారని సింగరేణి జాగృతి పేర్కొంది. గతంలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా కొనసాగిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దేశంలో లేని సమయంలో ఈ ఎన్నిక నిర్వహించడం దివాలాకోరుతనమని విమర్శించింది. గౌరవాధ్యక్షుని ఎన్నిక మహాసభల్లో జరగాలని, కార్యవర్గ సమావేశాల్లో కాదని పేర్కొంది.

టీబీజీకేఎస్ కోశాధికారి రాజీనామా

పదేళ్ల పాటు టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ఉన్న కవితను తప్పించి, ఉద్దేశపూర్వకంగా అవమానించారని, బీఆర్ఎస్ నిర్ణయానికి నిరసనగా టీబీజీకేఎస్ కేంద్ర కోశాధికారి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెంకట్ తెలిపారు. కవితకు మద్దతుగా తనతోపాటు పలువురు టీబీజీకేఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా, తెలంగాణ భవన్‌లో కూర్చుని ఎన్నిక ఎలా జరుపుతారని ప్రశ్నించారు.

రోహిత్‌కు రెండో ర్యాంక్

టాప్‌లోనే గిల్, అభిషేక్

ఐసీసీ ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలోని బ్యాటింగ్ విభాగంలో గిల్ 784 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత భారత్ ఒక్క వన్డే కూడా ఆడలేదు. అయితే, పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను వెనక్కునెట్టిన రోహిత్ రెండో ర్యాంక్‌కు చేరుకోగా.. కోహ్లీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, ర్యాంక్‌లు విడుదల చేసినప్పుడు రోహిత్, కోహ్లీ పేర్లు కనిపించకపోవడంతో ఫ్యాన్స్ షాకయ్యారు. వీరిద్దరూ వన్డేలకు కూడా వీడ్కోలు పలికారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, ఐసీసీ వీటికి ఫుల్‌స్టాప్ పెట్టింది. సాంకేతిక కారణాలతోనే వీరి ర్యాంక్‌లు కొంతసేపు కనిపించలేదని వివరణ ఇచ్చింది. బౌలర్ల విభాగంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో ర్యాంక్‌కు పడిపోగా.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ టాప్‌నకు చేరుకొన్నాడు. టీ20ల్లో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ టాప్-2లో కొనసాగుతున్నారు. కెప్టెన్ సూర్యకుమార్ 6వ, జైస్వాల్ 10వ స్థానాల్లో నిలిచారు.



సంజూ స్థానానికి ఎసరు?

న్యూఢిల్లీ: కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే ఇంగ్లండ్‌పై భారత జట్టును శుభ్‌మన్ గిల్ అద్భుతంగా నడిపించాడు. నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడంతోపాటు బ్యాటర్‌గానూ అదరగొట్టాడు. ఈనేపథ్యంలో..ఏడాదిగా 'పొట్టి' జట్టుకు దూరంగా ఉన్న గిల్‌ను ఆసియా కప్ టీ20 టోర్నీకి టీమిండియాలో చోటు కల్పించడమేకాదు..వైస్-కెప్టెన్‌గానూ నియమించారు. మరోవైపు ఆసియా కప్‌నకు సంజూ శాంసన్ జట్టులో చోటు లభించింది. కానీ గిల్‌ను వైస్-కెప్టెన్ చేయడంతో తుది జట్టులో సంజూకు స్థానంపై చర్చ మొదలైంది. ఆసియా కప్‌లో భాగంగా ఒమన్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో కలిసి గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఎక్కువగా ఉంది. తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వస్తారు. ఈ క్రమంలో చూస్తే టాపార్డర్‌లో సంజూకు చోటెక్కడనే ప్రశ్న తలెత్తుతోంది. కాగా..టీ20 జట్టుకు గిల్‌ను ఎంపిక చేయడంపై మాజీ స్పిన్నర్ అశ్విన్ విమర్శల బాణాలు ఎక్కుపెట్టాడు. 'భవిష్యత్‌లో అన్ని ఫార్మాట్లకు గిల్‌ను కెప్టెన్‌గా జట్టు యాజమాన్యం భావిస్తుండొచ్చు. కానీ ఒకడే అన్ని ఫార్మాట్లకు సారథిగా ఉండనవసరంలేదు' అని వ్యాఖ్యానించాడు. 'గిల్‌ను వైస్-కెప్టెన్‌గా ప్రకటించడం విచారకరం. అతడు ఓపెనర్‌గా వస్తాడు. అందువల్ల సంజూ స్థానానికి ముప్పు ఏర్పడినట్టే' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

ఐపీఎల్ ఫామ్ ప్రామాణికమైతే..

టీ20 జట్టులో చోటుకు ఐపీఎల్ ప్రదర్శనే ప్రామాణికమని కోచ్ గంభీర్ గతంలో స్పష్టంజేశాడు. ఆ కోణంలో చూస్తే ఆసియా కప్‌నకు ఆ ఆటగాళ్లు ఎందుకు ఎంపిక కాలేదనే చర్చ నడుస్తోంది. శ్రేయాస్ అయ్యర్, సాయి సుదర్శన్, కేఎల్ రాహుల్, ప్రసిద్ధ్ కృష్ణ ఈసారి ఐపీఎల్‌లో ఎలా రాణించారో చూశాం. వీరెవరూ తాజా ఆసియా కప్ జట్టులో లేరు. ఇక ప్రసిద్ధ్ కృష్ణను కంటితుడుపుగా స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.

అనంత్ గోల్డెన్ షూట్

సౌరభ్ జోడీకి కాంస్యం

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్


అనంత్‌జీత్


సురుచి సౌరభ్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్) : ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత తొలి స్వర్ణం దక్కించుకుంది. పురుషుల స్కీట్ విభాగంలో అనంత్‌జీత్ సింగ్ నరూక అగ్రస్థానంలో నిలిచాడు. ఇక..పిస్టల్ విభాగంలో భారత్ మరో కాంస్యం సాధించింది. బుధవారం ఉత్కంఠ భరితంగా జరిగిన పురుషుల స్కీట్ ఫైనల్లో అనంత్‌జీత్ 57-56 స్కోరుతో ఆసియా క్రీడల మాజీ చాంపియన్ మన్సూర్ అల్ రషీది (కువైట్)ని ఓడించి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. అలీ అహ్మద్ (ఖతార్) కాంస్యం అందుకున్నాడు. ఇక పిస్టల్ కేటగిరీలో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది.. 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సౌరభ్ చౌధరి/సురుచి ఇందర్ సింగ్ ద్వయం కాంస్యం సొంతం చేసుకుంది. కాంస్య పోరులో భారత జంట 17-9 స్కోరుతో తైపీ జోడీ లియు హెంగ్/సియాంగ్ చెన్‌పై గెలుపొందింది. చైనా స్వర్ణం, దక్షిణ కొరియా రజతం అందుకున్నాయి. జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో భారత్‌కు చెందిన వనిష్క చౌధరి/గవిన్ ఆంథోనీ జంట 16-14 స్కోరుతో కొరియా ద్వయం కిమ్ యేజిన్/కిమ్ డూయోన్‌ని ఓడించి కాంస్యం కైవసం చేసుకుంది.

బ్రస్సెల్స్ ఈవెంట్‌కు నీరజ్ చోప్రా దూరం

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ (డీఎల్) ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. డీఎల్ తుది అంచె బ్రస్సెల్స్ ఈవెంట్‌కు దూరమయ్యాడు. డైమండ్ లీగ్‌లో భాగంగా మొత్తం నాలుగు అంచెల్లో పోటీలు జరుగుతాయి. ఇప్పటికే మూడు ముగిశాయి. ఆఖరిదైన బ్రస్సెల్స్ టోర్నమెంట్ శుక్రవారం బెల్జియంలో జరగనుంది. ఇక.. డైమండ్ లీగ్ ఫైనల్స్ ఈనెల 28న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో జరగనుంది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో..

ఆసియా కప్‌నకు భారత హాకీ జట్టు

న్యూఢిల్లీ: ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు భారత జట్టును బుధవారం ప్రకటించారు. ఈనెల 29 నుంచి వచ్చేనెల 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. ఇందులో పాల్గొనే 18 మందితో కూడిన భారత జట్టును రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ముందుండి నడిపించనున్నాడు. కాగా, జట్టులో పెద్దగా మార్పులు లేవు. కాకపోతే ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన మిడ్‌ఫీల్డర్ రాజిందర్ సింగ్, ఫార్వర్డ్ ఆటగాళ్లు శిలానంద్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఇక.. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు వచ్చే ఏడాది ఆగస్టులో నెదర్లాండ్స్, బెల్జియం వేదికలుగా జరిగే ప్రపంచ కప్‌నకు నేరుగా బెర్త్ దక్కనుంది.

సెమీస్‌లో జెస్సికా జోడీ

కొలిన్స్ జంట కూడా

- అల్కారజ్, జొకో ద్వయాలకు నిరాశ
- యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ ఈవెంట్


డ్రేపర్, జెస్సికా
అల్కారజ్, రదుకాను

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో టాప్ సీడ్ జెస్సికా పెగుల, డేనియల్ కొలిన్స్ జోడీలు సెమీస్‌కు చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో అమెరికా-బ్రిటన్ జంట పెగుల-జాక్ డ్రేపర్ 4-1, 4-1తో ఆండ్రీవ-మెద్వెదెవ్ జంటపై గెలిచింది. అమెరికా జోడీల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్ 4-1, 5-4(2)తో టేలర్ టౌన్‌సెండ్-షెల్టన్‌పై గెలిచి ఫైనల్-4కు అర్హత సాధించింది. సెమీస్‌లో మూడో సీడ్ ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్‌తో జెస్సికా పెగుల జంట, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీతో కొలిన్స్-హ్యారిసన్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది.

రదుకాను జంటకు షాక్..: భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఎమ్మా రదుకాను-కార్లోస్ అల్కారజ్ జంటకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. బ్రిటన్-స్పెయిన్ జోడీ రదుకాను-అల్కారజ్ 2-4, 2-4తో టాప్ సీడ్ పెగుల-డ్రేపర్ చేతిలో, సెర్బియా జోడీ జొకోవిచ్-ఓల్గా డానిలోవిచ్ 2-4, 3-5తో మిర్రా ఆండ్రీవ-డానిల్ మెద్వెదెవ్ చేతిలో ఓడింది. జ్వెరెవ్-బెలిండా బెనిసిక్ 0-4, 3-5తో కొలిన్స్-హ్యారిసన్ చేతిలో చిత్తయింది.

హగ్‌కు నో: మ్యాచ్ ముగిసిన తర్వాత బ్రిటన్ ప్లేయర్ డ్రేపర్‌కు రదుకాను హగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. డ్రేపర్ హగ్ ఇవ్వడానికి ప్రయత్నించినా.. రదుకాను ఇష్టం లేనట్టుగా తప్పుకొంది. రదుకాను ఎందుకు ఇలా వ్యవహరించిందనేది ఎవరికీ అర్థం కాలేదు. అయితే, మ్యాచ్‌లో డ్రేపర్ తనను లక్ష్యంగా చేసుకొని ఆడడంపై రదుకాను కినుక వహించినట్టు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

గుకేష్‌కు గెలుపు

- సింక్వెఫీల్డ్ కప్ చెస్

సెయింట్ లూయిస్ (యూఎస్): తొలి రౌండ్‌లో ఓటమి ఎదురైనా.. వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు బలంగా పుంజుకొన్నాడు. సింక్వెఫీల్డ్ కప్ రెండో రౌండ్‌లో నోడిర్‌బెక్ అబ్దుస్తరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 49 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. కాగా, అమెరికా జీఎం కరువానాతో గేమ్‌ను జీఎం ప్రజ్ఞానంద డ్రా చేసుకొన్నాడు.

కాస్పరోవ్‌తో ఆనంద్ ఢీ

న్యూఢిల్లీ: చెస్‌లో చిరకాల ప్రత్యర్థులు, దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ మరోసారి తలపడనున్నారు. అక్టోబరు 7 నుంచి 11 వరకు జరిగే క్లచ్ చెస్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో వీరిద్దరూ మరోసారి అభిమానులను అలరించనున్నారు. 2021లో క్రొయేషియా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో చివరిసారి కాస్పరోవ్‌తో ఆనంద్ ఆడాడు. కాగా, ఇదే టోర్నీలో వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్‌తో వరల్డ్ చాంపియన్ గుకేష్ తలపడనున్నాడు.

అమ్మాయిల శుభారంభం

శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్

భారత్ చేతిలో నేపాల్ చిత్తు


అభిస్త

థింపు (భూటాన్): శాఫ్ దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 7-0తో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. నిరా చాను (25వ, 56వ), అభిస్త బాస్నెట్ (16వ, 41వ), అనుష్క (37వ, 62వ) తలో రెండు గోల్స్ సాధించగా.. కెప్టెన్ జులన్ (45+1వ నిమిషం) మరో గోల్ చేసింది.

సాయ్ ఆర్థిక పరిస్థితి దారుణం

- వేధిస్తున్న కోచ్‌ల కొరత ● పార్లమెంటరీ కమిటీ ఆందోళన

న్యూఢిల్లీ: భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని క్రీడలపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా'కు కేటాయించిన నిధులను తగిన రీతిలో ఖర్చు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వం వహించిన కమిటీలో మాజీ క్రికెటర్, ఎంపీ హర్భజన్ సింగ్, బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ సభ్యులుగా ఉన్నారు. అంతర్జాతీయ ఈవెంట్లలో భారత్ పరిస్థితి ఘోరంగా ఉన్నట్టు కమిటీ పరిశీలనలో తేలింది. సాయ్‌కు నిధులతోపాటు కోచ్‌ల కొరత తీవ్రంగా ఉందని తెలిపింది. ఆరునెలల్లో ఆయా ఖాళీలను భర్తీ చేయాలని క్రీడా మంత్రిత్వశాఖకు సూచించింది. 'ఖేలో ఇండియా' క్రీడలకు కేటాయించిన నిధులను సాయ్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీలకు బదలాయించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. క్రీడలకు బడ్జెట్ కేటాయింపులను ఇదే తరహాలో కొనసాగిస్తూనే 'ఖేలో ఇండియా' బాధ్యతలను కూడా సాయ్‌కు అప్పగించాలని సలహా ఇచ్చింది.

జీవిత, ఆరోగ్య బీమా ఇక చవక!



వ్యక్తిగత లైఫ్, హెల్త్ పాలసీలకు జీఎస్‌టీ మినహాయింపు

- కేంద్ర ప్రతిపాదనకు జీఓఎంలో ఏకాభిప్రాయం
- త్వరలో జీఎస్‌టీ కౌన్సిల్‌కు నివేదిక
- బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి వెల్లడి

న్యూఢిల్లీ: బీమా సేవలను చవకగా అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించాలని మోదీ సర్కారు ప్రతిపాదించింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందం (జీఓఎం) కన్వీనర్ సామ్రాట్ చౌదరి బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18% జీఎస్‌టీ ఉంది. బీమా జీఓఎం బుధవారం సమావేశమై కేంద్రం తాజా ప్రతిపాదనపై చర్చించింది. అన్ని రాష్ట్రాల మంత్రులు ఇందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, జీఓఎం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, జీఎస్‌టీ మినహాయింపు ప్రయోజనాలు కస్టమర్లకు చేరేలా చూడాలని జీఎస్‌టీ మండలిని సభ్యులు కోరినట్టు ఆయన చెప్పారు. ఇందుకు అవసరమైన విధానాన్ని జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుందన్నారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై జీఎస్‌టీ మినహాయింపుతో వార్షిక పన్ను రాబడి రూ.9,700 కోట్ల మేర తగ్గవచ్చన్నారు.

జీఎస్‌టీ మండలికి త్వరలోనే నివేదికను సమర్పించనున్నట్టు జీఓఎం సమావేశం అనంతరం సామ్రాట్ చౌదరి తెలిపారు. రాష్ట్ర మంత్రుల అభిప్రాయాలతో పాటు కొందరు వ్యక్తపరిచిన ఆందోళనలను సైతం నివేదికలో చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. పన్ను మినహాయింపుపై జీఎస్‌టీ మండలి తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. మలి తరం జీఎస్‌టీ సంస్కరణల్లో భాగంగా కేంద్రం లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలపై పన్ను మినహాయించాలని ప్రతిపాదించింది. బీమా పాలసీల జీఎస్‌టీ రేట్లపై సూచనలు చేసేందుకు 13 మంది రాష్ట్ర మంత్రులతో గత సెప్టెంబరులో జీఓఎం ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, బిహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, గోవా, గుజరాత్, మేఘాలయ, పంజాబ్ రాష్ట్రాల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ అక్టోబరు కల్లా జీఎస్‌టీ మండలికి జీఓఎం నివేదిక సమర్పించాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై రూ.8,262.94 కోట్లు, హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంపై రూ.1,484.36 కోట్ల ఆదాయం సమకూరింది.

సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధనకు కృషి

మలి తరం జీఎస్‌టీ సంస్కరణలను అమలు చేసేందుకు రాష్ట్రాల ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం కృషి చేయనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఈ సంస్కరణలు దోహదపడగలవన్నారు. నిర్మాణాత్మక సంస్కరణలు, రేట్ల హేతుబద్ధీకరణ, సులభతర నిబంధనలు అనే మూడు అంశాల ఆధారంగా మలి విడత సంస్కరణలను ప్రతిపాదించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. రేట్ల హేతుబద్ధీకరణ, బీమా రంగం, పరిహార సుంకంపై ఏర్పాటైన జీఓఎంలతో సీతారామన్ బుధవారం సమావేశమయ్యారు. మలితరం సంస్కరణల ఆవశ్యకత, తాజా ప్రతిపాదనలను జీఓఎం సభ్యులకు వివరించారు. ఈ మూడు జీఓఎంలు రెండు రోజులపాటు కేంద్ర ప్రతిపాదనలపై చర్చించనున్నాయని అన్నారు. దేశవాసులపై ధరాభారాన్ని తగ్గించేందుకు ఈ దీపావళి నాటికి జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం పన్ను శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల నిషిద్ధ ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చింది. ఆ సమయంలో సగటు జీఎస్‌టీ రేటు 14.4 శాతంగా ఉండగా.. 2019 సెప్టెంబరు నాటికది 11.6 శాతానికి దిగివచ్చిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. ప్రతిపాదిత రేట్ల హేతుబద్ధీకరణతో 9.5 శాతానికి తగ్గవచ్చని అంటోంది. అంతేకాదు, పన్ను రేట్ల తగ్గింపుతో దేశంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్ల మేర పెరగవచ్చని అంచనా వేసింది. ప్రభుత్వానికి వార్షిక పన్ను రాబడి మాత్రం రూ.85,000 కోట్ల వరకు తగ్గవచ్చని ఎస్‌బీఐ పేర్కొంది.

బిజినెస్

25,000 పైన నిఫ్టీ

ఐదో రోజూ మార్కెట్ ముందుకే...

ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా ఉండడంతో పాటు దేశీయ సంస్థల పెట్టుబడులు అందించిన ఊతంతో ఈక్విటీ మార్కెట్ ఐదో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. బుధవారం సెన్సెక్స్ 213.45 పాయింట్ల లాభంతో 81,857.84 వద్ద ముగియగా నిఫ్టీ 69.90 పాయింట్ల లాభంతో 25,050.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 15 లాభాలతో ముగియగా ఇన్ఫోసిస్ 3.88%, టీసీఎస్ 2.69% లాభంతో ముందు వరుసలో నిలిచాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌ఐఐ) మంగళవారం రూ.634.26 కోట్ల విలువ గల అమ్మకాలు జరిపారు.

రీగల్ రీసోర్సెస్ లిస్టింగ్ జోరు: బుధవారం లిస్టింగ్ అయిన రీగల్ రీసోర్సెస్ షేరు 29% లాభంతో ముగిసింది. బీఎస్ఈలో రూ.102 వద్ద లిస్టింగ్ అయిన ఈ షేరు మార్కెట్ ముగిసే సమయానికి రూ.131.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు అంతే లాభంతో రూ.131.58 వద్ద ముగిసింది. ఈ ధరలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,352.35 కోట్లుగా నిలిచింది.

ఐదు ఐపీఓలకు గ్రీన్‌సిగ్నల్: ప్రాథమిక పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) జారీ చేయడానికి ఐదు కంపెనీలకు సెబీ అనుమతి ఇచ్చింది. వాటిలో సెక్యూరిటీ సొల్యూషన్లు అందించే ఇన్నోవాటివ్యూ ఇండియా, ఆస్పత్రుల నిర్వహణలోని పార్క్ మెడి వరల్డ్‌తో పాటు రుణాల్ ఎంటర్‌ప్రైజెస్, జింకుషాల్ ఇండస్ట్రీస్, అడ్వాన్స్ ఆగ్రో లైఫ్ ఉన్నాయి.


నజారా టెక్నాలజీస్ షేరు 13% డౌన్: ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో రియల్ మనీ గేమింగ్ విభాగంలోని నజారా టెక్నాలజీస్ షేరు 13% నష్టపోయింది. బీఎస్ఈలో ఈ షేరు 12.82% నష్టంతో రూ.1,221.65 వద్ద ముగిసింది. అలాగే గేమింగ్ విభాగంలోని డెల్టా కార్పొరేషన్ షేరు 6.47% నష్టంతో రూ.87.24 వద్ద, ఆన్ మొబైల్ గ్లోబల్ షేరు 3.53% నష్టంతో రూ.53.27 వద్ద ముగిశాయి.

వచ్చే సెప్టెంబరుకి నిఫ్టీ 28,000

జీఎస్‌టీ సంస్కరణల ప్రభావంతో వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి నిఫ్టీ 28,000 స్థాయిని చేరుతుందని బ్రోకరేజి కంపెనీ ఎంకే రీసెర్చ్ అనాలిసిస్ అంచనా వేస్తోంది. జీఎస్‌టీ సుంకాల సవరణ ఆర్థిక వృద్ధికి, మార్కెట్‌కు ఉత్తేజం అవుతుందని పేర్కొంది. రాబోయే కాలంలో ధర-రాబడి నిష్పత్తి 20.7 రెట్లు ఉండవచ్చునన్న అంచనాతో నిఫ్టీ టార్గెట్‌ను నిర్ణయించింది. కన్స్యూమర్ విచక్షణా రంగానికి ఓవర్ వెయిట్ ప్రకటించడంతో పాటు మౌలిక ఆహార ఉత్పత్తులు, సిమెంట్ రంగాల్లోని స్మాల్-క్యాప్, మిడ్-క్యాప్ కంపెనీలకు పరిస్థితి అనుకూలంగా ఉంటుందని పేర్కొంది.

మౌలికం డీలా

మౌలిక వసతుల రంగానికి చెందిన ఎనిమిది కీలక పరిశ్రమల వృద్ధిరేటు జూలై నెలలో 2 శాతానికి పరిమితమయింది. బొగ్గు, క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల విభాగాల్లో ఉత్పత్తి క్షీణత ఇందుకు కారణం. ఈ రంగాల వృద్ధి గత ఏడాది జూన్‌లో 6.3% ఉండగా గత నెలలో 2.2 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్-జూలై నెలల మధ్య కాలంలో సైతం ఈ రంగాల వృద్ధిరేటు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 6.3% నుంచి 1.6 శాతానికి క్షీణించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,150 ▼	91,800 ▼	1,25,000 ▼
విజయవాడ	1,02,200 ▼	96,000 ▼	1,14,900 ▼
విశాఖపట్నం	1,02,200 ▲	91,800 ▼	1,25,000 ▼
రాజమండ్రి	1,00,150 ▼	91,800 ▼	1,14,400 ▼
ప్రొద్దుటూరు	1,00,300 ▼	92,280 ▼	1,14,700 ▼
ముంబై	98,950 ▼	90,640 ▼	1,11,190 ▼

'చాట్ జీపీటీ గో' ప్లాన్

నెలకు రూ. 399

న్యూఢిల్లీ: ఓపెన్ ఏఐ సంస్థ భారత వినియోగదారుల కోసం నెలకు రూ.399 ధరతో 'చాట్ జీపీటీ గో సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రారంభించింది. అత్యాధునిక ఏఐ టూల్స్‌ను దేశవ్యాప్తంగా మరింత మందికి సరసమైన ధరల్లో అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రారంభించినట్టు తెలిపింది. జీపీటీ-5తో ఈ చాట్ జీపిటీ గో పథకం నడుస్తుంది. ఉచిత చాట్ జీపీటీతో పోలిస్తే ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ద్వారా సబ్‌స్క్రైబర్లు భారతీయ భాషల్లో పదింతల సందేశాలు, ఇమేజిలు సృష్టించవచ్చు. ఫైల్స్, ఇమేజిల అప్‌లోడ్ కోసం పదింతలు పెంచుకోవచ్చని ఓపెన్ ఏఐ తెలిపింది. ఈ పథకాలు అన్నిటికి యూపీఐ చెల్లింపులు సైతం అనుమతిస్తున్నట్టు ప్రకటించింది.

ఇన్ఫీ ఉద్యోగులకు బోనస్

బెంగళూరు: ఇన్ఫోసిస్ కంపెనీ తన ఉద్యోగులకు బోనస్ బొనాంజా ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికిగాను అర్హులైన ఉద్యోగులకు పనితీరు ఆధారిత బోనస్ లెటర్లను బుధవారం జారీ చేసింది. వీరికి లభించనున్న సగటు బోనస్ 80 శాతంగా ఉందని, మార్చితో ముగిసిన త్రైమాసికం సగటు బోనస్ 65 శాతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

అమెరికాలో నాట్కో జనరిక్ బీపీ టాబ్లెట్లు

న్యూఢిల్లీ: నాట్కో ఫార్మా అమెరికా మార్కెట్‌లో కొత్త జనరిక్ ఔషధాన్ని విడుదల చేసింది. పిల్లల్లో వచ్చే బీపీ నియంత్రణ కోసం బొసెంటాన్ పేరుతో 32 ఎంజీ డోసేజిలో ఈ టాబ్లెట్లను విడుదల చేసినట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ట్రక్లీర్ పేరుతో అమెరికన్ కంపెనీ యాక్టెలియన్ ఫార్మాస్యూటికల్స్ మార్కెట్ చేస్తున్న బ్రాండెడ్ టాబ్లెట్లకు, బొసెంటాన్ టాబ్లెట్లు జనరిక్ వెర్షన్. అమెరికా మార్కెట్లో తమ బొసెంటాన్ టాబ్లెట్లకు 180 రోజుల పాటు ప్రత్యేక మార్కెటింగ్ హక్కులుంటాయని కంపెనీ తెలిపింది.

అరబిందో ఫార్మా చేతికి చెక్ కంపెనీ!

550 కోట్ల డాలర్లకు కొనుగోలు ఆఫర్

న్యూఢిల్లీ: అరబిందో ఫార్మా భారీ టేకోవర్‌కు సిద్ధమవుతోంది. చెక్ రిపబ్లిక్‌లోని జెంటివా ఫార్మా కంపెనీని కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతోంది. ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు జెంటివాలో ఉన్న మెజారిటీ వాటాను 500 కోట్ల డాలర్ల నుంచి 550 కోట్ల డాలర్లతో (సుమారు రూ.43,500 కోట్ల నుంచి రూ.47,850 కోట్లు) కొనుగోలు చేసినట్టు సమాచారం. ఈ వార్తలు నిజమైతే ఒక భారత ఫార్మా కంపెనీ ఒక విదేశీ ఫార్మా కంపెనీని, ఇంత పెద్ద మొత్తంతో కొనుగోలు చేయడం ఇదే మొదటిసారి అవుతుంది. అయితే అరబిందో ఫార్మా ఈ వార్తలను తోసిపుచ్చింది. చెక్ కంపెనీ కొనుగోలు కోసం చర్చలు జరుగుతున్నాయి తప్ప, ఇంకా తుది ఒప్పందమైతే కుదరలేదని స్పష్టం చేసింది.


గోద్రెజ్ 'అషిటక' కలుపు నాశని

- మొక్కజొన్న పంట కోసం ప్రత్యేకం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ మరో సరికొత్త ఉత్పత్తిని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసింది. 'అషిటక' పేరుతో విడుదల చేస్తున్న ఈ మందు మొక్కజొన్న పంటలో కలుపు మొక్కల నివారణకు బాగా పని చేస్తుందని కంపెనీ పంటల సంరక్షణ వ్యాపార విభాగం సీఈఓ ఎన్‌కే రాజవేలు చెప్పారు. మొక్కజొన్న పంట రెండు నుంచి నాలుగు ఆకుల దశలో ఉన్నపుడు ఈ మందు పిచికారీ చేస్తే ఫలితం మరింత మెరుగ్గా ఉంటుందన్నారు. ఈ నెలాఖరు నుంచే తెలుగు రాష్ట్రాల్లోని తమ డీలర్లకు ఈ మందు సరఫరా ప్రారంభమవుతుందన్నారు. తెలంగాణ సహా దేశంలో వెయ్యికి పైగా పంట పొలాల్లో పరీక్షల తర్వాత ఈ కలుపు నాశని మందును విడుదల చేస్తున్నట్టు రాజవేలు చెప్పారు. జపాన్ కేంద్రంగా పనిచేసే ఐఎస్‌కే అభివృద్ధి చేసిన ఈ మందును గోద్రెజ్ ఆగ్రోవెట్, ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి చేసుకుని రైతులకు సరఫరా చేయనుంది. ప్రభుత్వ అనుమతులు లభించిన వెంటనే దేశంలోనే ఈ మందును తయారు చేయబోతున్నట్టు చెప్పారు. ఎకరా మొక్కజొన్న చేనుకు సరిపోయేలా ఒకే ప్యాక్‌లో 50 ఎంఎల్ 'అషిటక' కీలక ఔషధాన్ని 400 ఎంఎల్ సర్ఫాక్టెంట్‌తో కలిపి రూ.1,800కు విక్రయించనున్నట్టు రాజవేలు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	114
వరంగల్	102	గుంటూరు	116
కరీంనగర్	102	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	90
కర్నూలు	102	నెల్లూరు	95
విశాఖపట్నం	110	అనంతపురం	95
గోదావరి	114		

మేడారం జాతరకు 150 కోట్లు మంజూరు

హైదరాబాద్, వరంగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అతిపెద్ద గిరిజన వేడుక మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లను మంజూరు చేసింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. 2026 మహాజాతరకు సుమారు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనా. 2024కంటే అదనంగా రూ.45కోట్లు పెంచడమే కాక 5 నెలల ముందే నిధులు విడుదల చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలపై మంత్రి సీతక్క.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతోపాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకే

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం న్యూఢిల్లీ వెళుతున్నారు. శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉంటున్న సీఎం.. ఓ మీడియా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పర్యటనల భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కూడా ఆయన కలిసే అవకాశముంది. శుక్రవారం రాత్రి లేదా శనివారం ఉదయం సీఎం రేవంత్ తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

స్పీకర్‌తో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు భేటీ అయ్యారు. స్పీకర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో శాసనమండలి నూతన సమావేశ మందిరం ఏర్పాట్లపైన సమీక్షించినట్లు సమాచారం. అలాగే, తన నియోజకవర్గ అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు సంబంధించి మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

ఔషధాలపై తప్పుదోవ పట్టించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోండి: దామోదర

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఔషధాల విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. డీసీఏ పనితీరుపై మంగళవారం వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, ఔషధాలు అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం శాశ్వతంగా మూసివేయాలని సూచించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేస్తామని ఆయన తెలిపారు.

పునరుత్పాదక ఇంధనంలో అగ్రస్థానమే లక్ష్యం

- రెడ్‌కో నూతన చైర్మన్ డాక్టర్ శరత్.. బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్‌కో) నూతన చైర్మన్ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. బుధవారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. సిబ్బంది, అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. పునరుత్పాదక రంగంలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలపడానికి ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు సంస్థ వీసీఎండీ అనిల, జీఎం జీఎస్‌వీ ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నర్సు పోస్టుల ప్రొవిజనల్ జాబితా విడుదల

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ జాబితాను వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు మంగళవారం విడుదల చేసింది. అభ్యర్థుల వివరాలను, పరీక్షలో వచ్చిన మార్కులతో పాటు వెయిటేజీ ద్వారా పొందిన మార్కులను జాబితాలో పొందుపర్చింది. అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 26 నుంచి సెప్టెంబరు 2 లోగా తెలియజేయాలని సూచించింది.

డీఎస్ఆర్, రంజిత్ రెడ్డి ఇళ్లలో ఐటీ సోదాలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎస్ఆర్ గ్రూపు, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి ఇళ్లలో ఐటీ అధికారులు రెండో రోజు బుధవారమూ సోదాలు నిర్వహించారు. డీఎస్ఆర్ గ్రూపు, రంజిత్ రెడ్డికి మధ్య జరిగిన కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఏపీ లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉన్న శ్రీనివాసా కన్‌స్ట్రక్షన్స్‌లోనూ రెండో రోజు సోదాలు కొనసాగాయి. కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఏసీబీకి చిక్కిన ఫారెస్టు బీట్ అధికారి

కోదాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ఫారెస్టు బీట్ అధికారి లంచం తీసుకుంటూ నల్లగొండ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. కోదాడలో ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో బీట్ అధికారిగా పనిచేస్తున్న అనంతుల వెంకన్న, కలప వ్యాపారాన్ని అడ్డుకోకుండా ఉండాలంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని ఓ కలప వ్యాపారిని డిమాండ్ చేశాడు. దీంతో ఆ వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వ్యాపారి ఆ నగదును వెంకన్నకు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు.

'స్థానికత' ఆధారంగా ఉద్యోగులకు డిప్యూటేషన్లు!

- రెండు మూడేళ్ల పాటు పంపాలన్న ప్రతిపాదన

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సర్దుబాటు జీవో 317పై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమై పలు అంశాలకు సంబంధించి చర్చించింది. బుధవారం సచివాలయంలో కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 317 జీఓకు సంబంధించిన ఉద్యోగ సమస్యలపై కమిటీ చర్చించింది. ఈ జీవోకు సంబంధించి ఇప్పటికే పరస్పర బదిలీలు, మెడికల్ గ్రౌండ్ బదిలీలు, భార్యాభర్తల(స్పౌజ్) కేసుల బదిలీలు పూర్తయ్యాయి. అయితే.. ఉద్యోగుల స్థానికతను ఆధారంగా చేసుకుని బదిలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై కమిటీ అధికారుల నుంచి వివరాలు కోరింది. ఎలా చేస్తే బాగుంటుందన్న అంశంపై చర్చించింది. స్థానికత ఆధారంగా జిల్లా, జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులను రెండు మూడేళ్ల పాటు డిప్యూటేషన్‌పై పంపితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనను ఆలోచించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. క్లియర్ వెకెన్సీలు ఉన్న చోటనే స్థానికత ఆధారంగా ఉద్యోగులకు డిప్యూటేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈమేరకు అధికారులు కార్యాచరణను చేపట్టాలని, వచ్చే సమావేశం నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది.

'బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించండి'

- పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ముందు ఆందోళన నిర్వహించారు. బుధవారం పార్లమెంట్ ఆవరణలోని మకర ద్వారం వద్ద తెలిపిన నిరసనలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. వీరి ఆందోళనకు ఇండియా కూటమి ఎంపీలు మద్దతు తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం బీజేపీకి ఇష్టం లేదని, అందుకే అడ్డు పడుతున్నారని ఎంపీలు ఆరోపించారు.

రాష్ట్రాల రాబడిపై ప్రభావం పడకూడదు

- రాబడులు తగ్గుతాయనుకుంటే పరిహారం చెల్లించాలి
- జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల ప్రతిపాదనపై కౌన్సిల్ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి
- 12 శాతం శ్లాబ్ తొలగింపును స్వాగతిస్తున్నామని ప్రకటన



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్‌టీ) శ్లాబుల్లో మార్పులతో రాష్ట్రాల రాబడులపై ప్రభావం పడకుండా చూడాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జీఎస్టీ కౌన్సిల్‌ను కోరారు. రాష్ట్రాల ఆదాయాలు తగ్గుతాయనుకుంటే పరిహారం చెల్లించే అంశాన్ని పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రం తరపున భట్టి విక్రమార్క మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలో ఉన్న 12శాతం జీఎస్టీ శ్లాబ్ తొలగింపును స్వాగతిస్తున్నామని ప్రకటించారు. కొన్ని వస్తువులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించాలన్న ప్రతిపాదనను కూడా స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే, జీఎస్టీలోని నాలుగు శ్లాబులను రెండుకు కుదించడం ద్వారా అంతిమంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నప్పటికీ... శ్లాబుల ఎత్తివేత, పన్ను రేట్ల తగ్గింపుతో రాష్ట్ర రాబడులు ప్రభావితం కాకుండా చూడాలని కోరారు. మరికొన్ని వస్తువులు, సేవలపై పన్ను రేట్లను పెంచే అంశంపై లోతైన అధ్యయనం చేయాలని సూచన చేశారు. రాష్ట్రాల ఆదాయాలు తగ్గుతాయనుకుంటే పరిహారం చెల్లింపు అంశాన్ని కౌన్సిల్ పరిశీలించాలని కోరారు. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ కోసం జీఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేసిన మంత్రుల బృందం(జీఓఎం)లో మరిన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, భట్టి అభిప్రాయపడ్డారు.

బీమా పాలసీలపై పన్ను మినహాయింపు లబ్ధి ప్రజలకు చేరాలి

జీవిత, ఆరోగ్య బీమా పాలసీపై పన్ను మినహాయింపు ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని భట్టి ప్రకటించారు.అయితే, పన్ను మినహాయింపు ప్రయోజనం ప్రజలకు చేరేలా విధానాన్ని రూపొందించాలని అభిప్రాయపడ్డారు. జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు జీఎస్టీ మినహాయింపు, తగ్గింపు పరిశీలన కోసం ఏర్పాటైన మంత్రుల బృందం(జీఓఎం) సమావేశంలో భట్టి ఈ వ్యాఖ్యలు చేశారు. పన్ను మినహాయింపు విధానం ప్రజలకు లబ్ధి చేకూర్చేలా లేకుంటే బీమా సంస్థల లాభాలను పెంచడానికి దారి తీస్తుందని భట్టి పేర్కొన్నారు.



గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల తదితరులు

నాడు హైటెక్ సిటీలా.. నేడు మూసీ ప్రక్షాళనను

వ్యతిరేకిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

శత్రువులేనని, అలాంటి దొంగల పని పట్టాల్సింది ప్రజలేనని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్, గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసిన తర్వాత సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. నాడు రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లే దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. హైటెక్ సిటీ అభివృద్ధికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన కంపెనీలు హైదరాబాద్ వచ్చాయంటే.. నాటి ముఖ్యమంత్రులు చేసిన కృషి వల్లనేనని అన్నారు. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదన్న సీఎం.. నాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని కొంతమంది అవహేళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీ లేదని న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ పాతబస్తీ అంటే ఓల్డ్ సిటీ కాదని ఒరిజినల్ సిటీ అని స్పష్టం చేసిన సీఎం.. మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. గోదావరి జలాలను తీసుకొచ్చి ఏడాది పొడవునా మూసీలో నీళ్లు ఉండేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామని తెలిపారు. మధ్యతరగతి ప్రజల కోసం హైదరాబాద్‌లో రాజీవ్ స్వగృహ భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివృద్ధితో పాటు నగర విస్తరణ జరగాలని, అందుకోసం తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని సీఎం చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫైవ్‌స్టార్ హోటల్, అంతర్జాతీయ విమానాశ్రయాల స్థాయిలో సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా ఈ కార్యాలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం పూర్తవ్వాలని వేదికపై ఉన్న మంత్రి పొంగులేటిని ఉద్దేశించి సీఎం పేర్కొన్నారు.

30 కోట్లతో భవనం: మంత్రి పొంగులేటి

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశలవారీగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. గచ్చిబౌలిలో 3 ఎకరాల్లో రూ.30 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో 50,000 చదరపు అడుగుల్లో భవనం నిర్మిస్తున్నామని వివరించారు. ఈ భవనంలో ఒక డీఐజీ, ఒక జిల్లా రిజిస్ట్రార్, ఆరుగురు సబ్ రిజిస్ట్రార్‌లు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ సేవలను సరళీకృతం చేసేందుకు మంత్రి పొంగులేటి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

శాసన సభకు పోటీ చేయడానికి

21 ఏళ్ల వయో పరిమితి చాలు

- రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్
- రాజీవ్ కాలంలోనే ఆధునిక భారతానికి పునాది : భట్టి



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల వయస్సును 21 ఏళ్లుగా నిర్ణయిస్తే సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఓటు హక్కు పొందడానికి 21 ఏళ్లు నిండాలన్న నిబంధన ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీకి కనీస వయో పరిమితిని 25 ఏళ్లుగా నిర్ణయించారని తెలిపారు. ఆ తర్వాత ఓటు హక్కు పొందడానికి ఉండాల్సిన వయసును మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్లకు తగ్గించారని చెప్పారు. పార్లమెంటుకు పోటీకి 25 ఏళ్లు నిండాలన్న నిబంధన ఉన్నా.. శాసనసభకు పోటీ చేయడానికి నిండాల్సిన వయసును 21 ఏళ్లకు తగ్గించాలని అభిప్రాయపడ్డారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి బుధవారం పుష్పాంజలి ఘటించిన అనంతరం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభలో ఉంటే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని రేవంత్ ఈ సందర్భంగా అన్నారు. ఇందుకోసం తెలంగాణ శాసనసభ ప్రయత్నిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక ఈ మేరకు శాసనసభలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమగ్రత కాపాడేందుకు ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు పునాది వేసింది, దేశానికి కంప్యూటర్ పరిచయం చేసింది, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది రాజీవ్‌గాంధీనేనని సీఎం ఈ సందర్భంగా అన్నారు. కాగా, రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని వీర్ భూమిలో రాజీవ్‌గాంధీ సమాధి వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ఆధునిక భారతానికి పునాదులు వేశారని గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, కడియం కావ్య, సురేశ్ షెట్కర్, గడ్డం వంశీకృష్ణ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యం దుకాణాల దరఖాస్తు రూ.3 లక్షలు!

(మొదటిపేజీ తరువాయి)

10 శాతం, ఎస్టీలకు 5 శాతం చొప్పున కేటాయించనున్నారు. అనుమతి పొందిన వారు వార్షిక రుసుముతోపాటు అదనంగా రూ.5 లక్షలు చెల్లిస్తే వాకిన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణ వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం దుకాణాల ఫీజుల వివరాలు

జనాభా	దుకాణం ఫీజు(రూ.లక్షల్లో)
5 వేలు	50
5-50 వేలు	55
50 వేల నుంచి లక్షలోపు	60
1-5 లక్షలు	65
5-20	85
20 లక్షల పైన	1.10 కోట్లు

అనుమతి పొందిన వారు వార్షిక రుసుముతోపాటు అదనంగా రూ.5 లక్షలు చెల్లిస్తే వాకిన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణ వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి.

20 నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు

- లైఫ్ సైన్సెస్ రంగంలో 54 వేల కోట్ల పెట్టుబడులు సాధించాం: దుద్దిళ్ల

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం అద్భుత ప్రగతి సాధించిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రం గత 20 నెలల్లో ఈ రంగంలో రూ.54 వేల కోట్ల పెట్టుబడులు సాధించి 'గ్లోబల్ లీడర్'గా ఎదిగిందని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ బోర్డు సమావేశానికి చైర్మన్ హోదాలో ఆయన అధ్యక్షత వహించారు. లైఫ్ సైన్సెస్‌లో భాగమైన ఔషధ తయారీ, టీకాల ఉత్పత్తి, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో కొత్తగా 2 లక్షల పైచిలుకు ఉద్యోగాలు సృష్టించగలిగామని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందన్నారు. దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక నగరం హైదరాబాద్ కావడం గర్వకారణమన్నారు. లిల్లీ, యామ్‌జెన్, ఎంఎస్‌ఎన్, జోయెటిస్, ఎవర్ నార్త్, ఒలింపస్ లాంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నాయని చెప్పారు. త్వరలో తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ విధానం ప్రకటిస్తామని తెలిపారు.

ఎయిర్‌టెల్ కేబుళ్ల తొలగింపు ఆపండి

- రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఆదేశాలు
- బీఆర్‌కే భవన్‌కూ కేబుల్ కట్
- 31 ప్రభుత్వ సైట్ల సర్వర్ డౌన్.. పునరుద్ధరణ



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు అనుసంధానంగా ఉన్న ఎయిర్‌టెల్ ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల తొలగింపు ప్రక్రియను నిలిపేయాలంటూ హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అయితే కేబుల్ వైర్ల కారణంగా కరెంట్‌షాక్‌తో చనిపోయిన వారి ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎస్పీడీసీఎల్ తమ కేబుళ్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ.. భారతీ ఎయిర్‌టెల్ బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై మధ్యాహ్నం తర్వాత జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎయిర్‌టెల్ తరపున.. సీనియర్ న్యాయవాది ఎస్.రవి వాదనలు వినిపించారు. టెలీకమ్యూనికేషన్స్ యాక్ట్-2023, సంబంధిత రూల్స్-2024 ప్రకారం టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.21 కోట్లు అద్దెగా చెల్లించామని పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలులో ఉండగా.. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అకస్మాత్తుగా కేబుల్స్ తొలగింపునకు ఆదేశాలు జారీచేశారని.. దీనివల్ల హాస్పిటళ్లు, కోర్టులు సహా లక్షల మంది వినియోగదారులకు ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయని ఆయన వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీలకు నోటీసులు జారీచేసింది. అత్యవసరమైన ఇంటర్‌నెట్ సేవలను, టెలికాం మౌలిక వసతులను ఏకపక్షంగా తొలగించడం సమంజసం కాదని.. కేంద్ర ప్రభుత్వం సైతం అకస్మాత్తుగా సేవలకు అంతరాయం కలిగించరాదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎయిర్‌టెల్ కేబుళ్లను కట్ చేయరాదన్న తమ ఆదేశాలను తక్షణం టీజీఎస్పీడీసీఎల్ అధికారులకు తెలియజేయాలని ఆ సంస్థ న్యాయవాదికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది. కాగా.. కేబుళ్ల తొలగింపు కార్యక్రమం నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఫైబర్ నెట్‌వర్క్ కంపెనీలు జాగ్రత్త పడుతున్నాయి. తమ కేబుళ్ల కోసం ప్రత్యేకంగా స్తంభాల ఏర్పాటుకు అనుమతి తీసుకుంటున్నాయి. ముషీరాబాద్ సర్కిల్‌లో 1333 స్తంభాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్ ఇప్పటికే దరఖాస్తు చేసింది. ఒక్కో స్తంభానికీ ఏటా రూ.1000 చొప్పున జీహెచ్ఎంసీకి సదరు సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఈ స్తంభాల ఏర్పాటు ప్రతిపాదనలను గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ భేటీలో ప్రస్తావించనున్నారు. కమిటీ అభిప్రాయం మేరకు దీనిపై ఒక నిర్ణయం తీసుకోనున్నారు.

నిలిచిన సేవలు..

ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో నగరవ్యాప్తంగా విద్యుత్ స్తంభాలకు ఉన్న ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను అధికారులు తొలగిస్తున్న నేపథ్యంలో.. బీఆర్కే భవన్‌కు వచ్చే బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కేబుల్ కూడా కట్ అయింది. దీంతో రాష్ట్రప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల వెబ్‌సైట్ల సర్వర్లు బుధవారం డౌన్ అయ్యాయి. అప్రమత్తమైన అధికారులు రాత్రి 9 గంటలకల్లా ఇంటర్నెట్‌ను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు. మరోవైపు.. దక్షిణ డిస్కం చేపట్టిన కేబుల్ కటింగ్ పనులను వెంటనే ఆపాలని కోరుతూ తెలంగాణ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఖైరతాబాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ నేతలు చర్చలు నిర్వహించారు. ఈ ప్రక్రియతో తాము అందించే సేవలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఆందోళన వెలిబుచ్చారు. విద్యుత్ స్తంభాలపై అనవసరంగా ఉన్న తీగల తొలగింపునకు తమకు కొంత సమయం కావాలని అడిగారు. చర్చల సమయంలో తమ డిమాండ్లకు సరేనని ఒప్పుకొని.. తర్వాత మళ్లీ తీగలు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తీరు కొనసాగిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కేబుల్, ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్రశ్నార్థకంగా ఓటు హక్కు

- రాజ్యాంగ సంస్థగా పని చేయని ఈసీ
- ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలిస్తే రాజకీయాలపై సానుకూల ప్రభావం
- లౌకిక పార్టీలన్నీ ఆయనకే మద్దతివ్వాలి
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు ప్రారంభం



ప్రసంగిస్తున్న డి.రాజా. వేదికపై జాతీయ, రాష్ట్ర నాయకులు

హైదరాబాద్, గాజులరామారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా పని చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలంటే కేంద్రంలో బీజేపీని, ప్రధాని మోదీని అధికారం నుంచి దించివేయాల్సిందేనన్నారు. ఇందుకోసం లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదిక మీదకు వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారం (కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావునగర్)లోని మహారాజా గార్డెన్స్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. . మూడు రోజుల పాటు జరిగే మహాసభల్లో తొలి రోజు సభలో రాజా మాట్లాడుతూ.. దేశం ప్రస్తుతం సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగంపై దాడి పెరిగిందని ఆరోపించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో తమకు నచ్చని ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించే కార్యక్రమం చేపడుతున్నారని మండిపడ్డారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘానికి రాజ్యాంగపరమైన అధికారాలున్నా.. ప్రస్తుతం రాజ్యాంగబద్ధ సంస్థగా అది పనిచేయడం లేదన్నారు. ఇండియా కూటమిలో పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకమని, ఈ ఎన్నిక రాజకీయ యుద్ధం అని ఆయన చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి సీపీఐ మద్దతు ప్రకటించిందన్నారు. లౌకిక పార్టీలన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని, ఆయన గెలిస్తే దేశ భవిష్యత్తు రాజకీయాలపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

ఇది గడ్డుకాలం: రామకృష్ణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో సీపీఐ తెలంగాణకు మద్దతివ్వడం ద్వారా లబ్ధి పొందుతామనుకున్నా ఆశించిన ఫలితాలు రాలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తెలంగాణకు మద్దతివ్వడం వల్ల ఏపీలోనూ పార్టీకి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని.. ఇప్పుడిప్పుడే మళ్లీ ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. వామపక్షాలకు ఇది గడ్డు కాలమన్నారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. 140 కోట్ల మంది ప్రజలను అవమానించే రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మతోన్మాద బీజేపీని అడ్డుకునే శక్తి వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకంకావాలని సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అరెస్టు

- హైవేపై ఓ హోటల్ ముందు గుంతలు తవ్వించి యజమానికి వేధింపులు
- లంచం కోసం మధ్యవర్తితో బేరసారాలు
- రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పీడీని, మధ్యవర్తిని అరెస్టు చేసిన సీబీఐ

హైదరాబాద్/బీబీనగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఒక హోటల్ యాజమాని నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటూ సీబీఐ అధికారులకు పట్టుబడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద మంగళవారం రాత్రి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసిన సీబీఐ అధికారులు బుధవారం ఆ వివరాలను ఒక ప్రకటనలో తెలిపారు. అతనికి మధ్యవర్తిగా వ్యవహరించిన మరో హోటల్ యజమాని వేణు యాదవ్‌ను కూడా అరెస్టు చేశారు. జాతీయ రహదారిపై గూడూరు టోల్ ప్లాజా వద్ద జూన్‌లో ఓ వ్యక్తి తాజా కిచెన్ అనే హోటల్ ప్రారంభించాడు. ఆ హోటల్ సర్వీసు రోడ్డుకు దగ్గరగా ఉందంటూ ఎన్‌హెచ్‌ఏఐ వరంగల్ రీజియన్ అధికారులు నోటీసు జారీ చేశారు. తర్వాత రాకపోకలకు వీలు లేకుండా హోటల్ ముందు గుంతలు తీయించారు. హోటల్ యజమాని గుంతలు పూడ్చివేయడంతో అధికారులు మళ్లీ జేసీబీతో మరింత పెద్ద గోతులు తవ్వించారు. ఈ క్రమంలో అతనికి సమీపంలోని కింగ్స్ హోటల్ యజమాని వేణు యాదవ్ ఫోన్ చేసి తనను కలవాలని కోరాడు. తాను దుర్గాప్రసాద్ తరఫున హోటళ్ల నుంచి మామూళ్ల వ్యవహారాలను చూస్తుంటానని, లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దుర్గాప్రసాద్ అక్కడ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాలుగేళ్లు ఉంటారని, ఆయన అడిగినంత ఇస్తే ఏ ఇబ్బందులు రాకుండా చూసుకుంటారని చెప్పాడు. అంత మొత్తం ఇవ్వలేనని తాజా కిచెన్ యజమాని చెప్పడంతో రూ.60 వేలకు బేరం కుదిరింది. అయితే పీడీ వేధింపులతో విసిగిపోయిన అతను హైదరాబాద్‌లోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దాంతో సీబీఐ అధికారులు వల పన్ని ఆ హోటల్ వద్ద దుర్గాప్రసాద్, వేణు యాదవ్‌లు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సంపులో ఇద్దరు పిల్లలను పడేసి.. తానూ దూకి!

- ఓ తల్లి అఘాయిత్యం.. పిల్లలు మృతి.. ఆమె సురక్షితం
- దంపతులకు నలుగురు కొడుకులు.. పోషణకు తిప్పలు
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ విషయంలో గొడవలు

నిజాంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా వచ్చే ఆ కొన్ని పైసలు ఉన్న నలుగురు పిల్లల పోషణకు ఏమాత్రం చాలకపోవడంతో ఆ దంపతుల మధ్య కలతలు మొదలయ్యాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుందామన్న భర్త వినకపోవడంతో భార్య మనోవేదనకు గురైంది. ఇద్దరు కుమారులను నీళ్లతో నిండి ఉన్న సంపులో పడేసి తాను దూకింది. ఈ ఘటన నుంచి ఆమె సురక్షితంగా బయటపడ్డా ఆ చిన్నారులు ప్రాణాలు కోల్పోవడమే తీవ్ర విషాదం. హైదరాబాద్ బాచుపల్లిలో ఈ ఘటన జరిగింది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్ష్మణ్, రత్నమ్మ(30) భార్యభర్తలు. వీరికి జగన్ (8), పవన్ (7), అరుణ్ (3), సుభాష్ (8 నెలలు) కుమారులున్నారు. పెద్ద పిల్లలు ఇద్దరూ సొంతూర్లో లక్ష్మణ్ తల్లిదండ్రుల వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. రెండేళ్ల క్రితం అరుణ్‌ను వెంటబెట్టుకొని లక్ష్మణ్ దంపతులు బతుకుదెరువు కోసం బాచుపల్లికి వచ్చారు. అక్కడ వారికి నాలుగో సంతానంగా సుభాష్ కలిగాడు. లక్ష్మణ్ లారీల్లో ఇసుక లోడింగ్ అన్‌లోడింగ్ పని చేస్తుండగా రత్నమ్మ కూలీ పనులకు వెళుతోంది. పిల్లల పోషణ కష్టంగా మారిందని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకుందామని భర్తను రత్నమ్మ పలుమార్లు అడిగినా అతడు నిర్లక్ష్యంగా మాట్లాడాడు. ఈ విషయంలోనే దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి భార్యాభర్తలు మరోసారి తగవుపడ్డారు. తర్వాత రత్నమ్మ.. నిద్రలో ఉన్న చిన్నారులు అరుణ్, సుభాష్‌ను ఇంటిముందున్న నీటి సంపులో పడేసి, తాను దూకింది. పక్కనే ఉంటున్న ఓ వ్యక్తి అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు లేవడం.. సంపులోంచి అరుపులు వినిపించడంతో చూసి ఇరుగుపొరుగును అప్రమత్తం చేశాడు. వారొచ్చి రత్నమ్మను బయటకు తీశారు. పిల్లలను బయటకు తీసే లోపే ఆ చిన్నారులిద్దరూ మృతిచెందారు. పోలీసులొచ్చి రత్నమ్మను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

సాదాబైనామాల క్రమబద్ధీకరణపై స్టేను ఎత్తేయాలి

- హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- భూభారతి చట్టం ప్రకారం సాదాబైనామాల క్రమబద్ధీకరణ అధికారం ప్రభుత్వానికుందన్న అడ్వకేట్ జనరల్
- స్టే ఉత్తర్వులు ఎత్తివేస్తే ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభిస్తుందని వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామాలపై 2020లో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన తెలంగాణ భూభారతి చట్టం ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి ఉందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు గతంలో ఉన్న స్టేను ఎత్తేయాలని పేర్కొంటూ మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా పిటిషనర్ వాదన వినాల్సి ఉన్నందున విచారణను ఈనెల 26కు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020 అక్టోబరు 12న జారీ చేసిన జీవో 112ను కొట్టేయాలని పేర్కొంటూ నిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై అప్పట్లో విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అందిన దరఖాస్తులు క్రమబద్ధీకరించరాదని ఆదేశించింది. కొత్త చట్టం అమల్లోకి వచ్చాక పాత చట్టం ప్రకారం క్రమబద్ధీకరణ చేయడాన్ని తప్పుబట్టింది. కొత్త చట్టం (ధరణి) రాకముందు (2020 అక్టోబరు 29) వరకు 2,26,693 దరఖాస్తులు, 29 తర్వాత 6,74,201 దరఖాస్తులు వచ్చినట్టు సర్కారు అప్పట్లో వెల్లడించింది. గడువుకు ముందు వచ్చిన దరఖాస్తులపై నిర్ణయం కూడా తామిచ్చే తీర్పునకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. కాగా 2020లో ఇచ్చిన స్టే ఎత్తేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా పిల్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2020లో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తేయాలని, పిల్‌ను కొట్టివేయాలని కోరారు. రాష్ట్రంలో భూభారతి చట్టం-2025 అమల్లోకి వచ్చిందని, ఇందులోని సెక్షన్ 6 ప్రకారం 2014 జూన్ 2 ముందు 12ఏళ్ల భూమి తమ ఆధీనంలో ఉన్నట్లు ఆధారాలు చూపిన చిన్న, సన్నకారు రైతులకు సాదాబైనామా క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. కొత్తచట్టం నేపథ్యంలో 2020లో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని, స్టే ఉత్తర్వులు ఎత్తివేస్తే ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ మధ్యంతర అప్లికేషన్లపై తమ వాదన వినిపించడానికి సమయం కావాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జే ప్రభాకర్ కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది.

'బెట్టింగ్ యాప్'ల్లో వాటా.. కంపెనీలకు నష్టాల మూట!

బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తూ కేంద్రం తెచ్చిన చట్టంతో భారీగా పడిపోయిన షేర్లు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లతో జనాలు భారీగా నష్టపోగా.. ఆ కంపెనీల్లో వాటాలు కొన్న సంస్థలూ రూ.వందల కోట్లు నష్టపోతున్నాయి. బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధిస్తూ కేంద్రం తీసుకొచ్చిన చట్టం.. కొన్ని కంపెనీలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. రూ.వందల కోట్లు వెచ్చించి, గేమింగ్ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో వాటాలను కొనుగోలు చేసిన కంపెనీలకు కేంద్రం తెచ్చిన చట్టం శరాఘాతమైంది. ఇటీవలి కాలంలో నజారా టెక్నాలజీస్ అనే సంస్థ ఒక గేమింగ్ కంపెనీ నుంచి 47.7% వాటా కొనుగోలు చేసింది. ఆ కంపెనీ షేరు విలువ నిన్నమొన్నటి వరకు చాలా బాగా ఉండేది. తాజాగా బెట్టింగ్ యాప్‌లపై నిషేధ చట్టం తేగానే ఈ కంపెనీ షేర్లు భారీగా పడిపోయాయి. ఒక్క రోజులోనే ఏకంగా రూ.179 పడిపోయింది. రూ.832 కోట్లతో మూన్ షైన్ టెక్నాలజీస్ నుంచి వాటాను కొనుగోలు చేసిన నజారా టెక్నాలజీస్ పరిస్థితి ఇది. వాటా అమ్ముకున్న సంస్థకేమో మోదం.. కొనుక్కున్న సంస్థకేమో ఖేదం. బెట్టింగ్ యాప్‌లు పెట్టి ప్రజల సొమ్ములు కొల్లగొట్టిన కంపెనీలు.. అలాంటి కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసిన సంస్థల పరిస్థితి ఇక అయోమయమే! ఎప్పటినుంచో ఈ రంగంలో ఉండి భారీగా డబ్బులు దండుకున్న పాత కంపెనీలకు ఇకపై ఆదాయం ఉండకపోవచ్చు. ఇక కొత్తగా కొనుగోలు చేసిన కంపెనీల పరిస్థితి.. బెట్టింగ్ యాప్‌లో జూదం మాదిరిగా తయారైంది! సామాన్య ప్రజలతోపాటు బడావ్యాపారులనూ కొన్ని బెట్టింగ్ యాప్ సంస్థలు నిలువునా ముంచాయి. దుబాయ్ కేంద్రంగా ఏర్పాటైన కంపెనీలో లండన్, ఇతర దేశాల నుంచి పెట్టుబడులు పెట్టినవారి పరిస్థితి కూడా ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. వందల కోట్లతో బెట్టింగ్ యాప్ సంస్థలను కొనుగోలు చేసిన వ్యాపారులు కుదేలవుతున్నారు.

14కోట్ల మంది ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ యూజర్లు

దేశంలో 14 కోట్ల మంది క్రమం తప్పకుండా ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో పాల్గొంటున్నారు. ఐపీఎల్, ఇతర క్రీడలు, ప్రధాన కార్యక్రమాల సమయంలో ఆ సంఖ్య 37 కోట్ల దాకా ఉంటోంది. ఈ విషయం కన్స్యూమర్ యూనిటీ అండ్ ట్రస్ట్ సొసైటీ (సీయూటీఎస్) సంస్థ తాజా నివేదికలో వెల్లడైంది. గత మార్చి, ఏప్రిల్‌లో టాప్ 15 గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫాంలకు 5.4 బిలియన్ విజిట్‌లు వచ్చినట్లు తెలిపింది. బెట్టింగ్ యాప్‌ల బారినపడి బలవుతున్నవారిలో 18-25 ఏళ్ల వయసున్నవారే ఎక్కువగా ఉన్నట్లు ప్రహార్ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. 96% మందికి బెట్టింగ్ చట్టవిరుద్ధమని తెలిసీ ఆడుతున్నారు. బెట్టింగ్ యాప్‌లు వాడుతున్న వారిలో 38% మంది నెలకు రూ.15 వేలు, అంతకంటే తక్కువ సంపాదిస్తున్నవారే ఉన్నారు. బెట్టింగ్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టిన వారిలో కనీసం 80% మంది రూ.50 వేలకుపైగా నష్టపోయినట్లు వెల్లడైంది.



పూర్తిస్థాయి నిఘాతోనే కట్టడి..

బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో నిషేధం అమల్లో ఉన్నా.. పంటర్లు (పందెం వేసేవాళ్లు) వ్యక్తిగత లింకులు పంపించి బెట్టింగ్ పెట్టిస్తున్నారు. పంటర్ల నుంచి ఏజెంట్లకు, వారినుంచి ఆటగాళ్లకు ఈ లింకులు వెళ్తుంటాయి. ఆట ముగియగానే లింక్ ముగిసిపోతుంది. ఎప్పటికప్పుడు ఈ తరహాలో కొత్త లింకులు పంపించి నిఘాకు చిక్కకుండా ఆట ఆడిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో బెట్టింగ్ యాప్‌లను పూర్తి స్థాయిలో నిషేధించడం కష్టమేనని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఐపీ అడ్రస్‌లను బ్లాక్ చేసినా, వ్యక్తిగత లింకులు, వాట్సాప్, టెలిగ్రామ్, డార్క్‌వెబ్.. ఇతరత్రా మార్గాల్లో బెట్టింగ్ యాప్ నిర్వాహకులు మార్కెట్‌లోకి వస్తుంటారు. తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌లపై నిషేధం ఉన్నప్పటికీ నకిలీ జీపీఎస్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, లొకేషన్ మార్చుకుని ఇతర రాష్ట్రాల లొకేషన్‌తో ఇక్కడ బెట్టింగ్ యాప్ వాడుకుంటున్నారు. దేశవ్యాప్తంగా నిషేధం విధించినా.. నకిలీ జీపీఎస్‌తో బెట్టింగ్ యాప్‌లకు అనుమతి ఉన్న దేశాల లొకేషన్ల తో ఇక్కడ బెట్టింగ్ యాప్‌లు వాడుకునే అవకాశం కల్పిస్తారని చెబుతున్నారు. ఇలా అయితే వాటిని గుర్తించడం దర్యాప్తు సంస్థలకూ కష్టంగా మారుతుంది.

నిరంతర నిఘాతోనే సాధ్యం

బెట్టింగ్ యాప్‌ల పూర్తిస్థాయి నిషేధం అంత సులువుగా అయ్యేపని కాదని సైబర్ ఇంటెలిజెన్స్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల తెలిపారు. నిరంతర నిఘాతోనే అది సాధ్యమవుతుందన్నారు. సింగపూర్ ఐపీ అడ్రస్‌తో కొనసాగుతున్న బెట్టింగ్ యాప్‌ను బ్లాక్ చేస్తే క్షణాల్లో హాంకాంగ్ ఐపీ అడ్రస్‌తో మనుగడలోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు.

బెట్టింగ్ యాప్‌లపై నిషేధం హర్షణీయం: సజ్జనార్

బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్వాగతించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కట్టడికి తన వంతు కృషి చేస్తున్న సజ్జనార్.. కేంద్ర నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిషేధం విధించినా.. వివిధ మార్గాల్లో బెట్టింగ్ యాప్‌లు మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్ యాప్‌లు దేశంలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

భూముల వేలానికి హెచ్‌ఎండీఏ నగారా!

- రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో లేఅవుట్లలోని ప్లాట్లు, ఖాళీ స్థలాల విక్రయం
- వచ్చే నెల 17-19వరకు ఆన్‌లైన్‌లో వేలం

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) మరోసారి ప్లాట్లు, స్థలాల వేలానికి సిద్ధమైంది. సుమారు రెండేళ్ల విరామం తర్వాత ఆన్‌లైన్‌లో ఈ-వేలానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలోని తుర్కయాంజల్ లేఅవుట్‌లో 12 ప్లాట్లు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లి లేఅవుట్‌లో 70 ప్లాట్లు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 11 ఖాళీ స్థలాలను విక్రయించనున్నట్టు ప్రకటించింది. వేలంలో పాల్గొనదలచినవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను బుధవారం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎంఎస్‌టీసీ ఈకామర్స్' ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17, 18, 19 తేదీల్లో ఈ వేలం జరగనుంది. ప్లాట్లకు గజానికి కనీస ధర తుర్కయాంజల్‌లో రూ.65వేలు, బాచుపల్లిలో రూ.70వేలుగా హెచ్ఎండీఏ నిర్ణయించింది. తుర్కయాంజల్ ప్లాట్లు బహుళ అంతస్తుల భవనాలకు, బాచుపల్లిలోని ప్లాట్లు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి అనుగుణంగా ఉన్నాయని తెలిపింది. ఇక రంగారెడ్డి జిల్లాలో గండిపేట మండలం బైరాగిగూడ, కోకాపేట, పుప్పాలగూడ, శేరిలింగంపల్లి మండలం చందానగర్‌లలోని ఖాళీ స్థలాలను... మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లి, గండిమైసమ్మ, దుండిగల్ మండలంలోని బౌరంపేట్, మేడిపల్లి మండలంలోని చెంగిచెర్ల, కుత్బుల్లాపూర్ మండలంలోని సూరారంలోని ఖాళీ స్థలాలను విక్రయించనుంది. మొత్తంగా ఈ ప్లాట్లు, స్థలాల విక్రయంతో సుమారు రూ.700 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

7.8 ఎకరాలు.. రూ.547 కోట్లు

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని భూమి ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించింది. హౌజింగ్ బోర్డు బుధవారం 7.8 ఎకరాల భూమిని వేలం వేయగా.. ఎకరానికి రూ.70 కోట్ల చొప్పున మొత్తం రూ.547 కోట్లకు గోద్రెజ్ ప్రాపర్టీస్ సంస్థ దక్కించుకుంది. ఇక రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన టౌన్‌షిప్‌లలో అసంపూర్తిగా ఉన్న 3 బహుళ అంతస్తుల భవనాల విక్రయం ద్వారా రూ.70.11 కోట్లు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

సీఎం అత్త పారిజాతమ్మకు అస్వస్థత

ఆస్పత్రిలో చేరిక.. ఐసీయూలో చికిత్స

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్త పారిజాతమ్మ తీవ్ర అస్వస్థతతో బుధవారం మాదాపూర్ హైటెక్‌సిటీలోని మెడికవర్ ఆస్పత్రిలో చేరారు. వైద్య బృందం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కరోనరీ యాంజియోగ్రామ్ నిర్వహించి గుండెలో పెద్దగా అడ్డంకులు లేవని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి సున్నితంగా ఉండటంతో ఐసీయూలో ఉంచారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.

ఈఎన్‌సీగా మహ్మద్ అంజద్

నీటిపారుదల శాఖలో మార్పులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నీటిపారుదల శాఖలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు చీఫ్ ఇంజనీర్ (ఎంక్వయిరీస్)గా పనిచేస్తున్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌ను ఈఎన్‌సీ (జనరల్)గా పూర్తి స్థాయిలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, ఇటీవల సూపరింటెండెంట్ ఇంజనీర్లు (ఎస్‌ఈ)గా పదోన్నతి పొందిన 43 మంది ఈఈల స్థానంలో ఇతర అధికారులకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మరో జీవో జారీ చేశారు. కాగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (డీఈఈ)కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పించడానికి ఈనెల 23న జరగాల్సిన డీపీసీ సమావేశం వాయిదా పడే అవకాశాలున్నాయని సమాచారం.

కారుణ్య నియామకాలకు ధ్రువీకరణ పత్రాలు సమర్పించండి

- ముఖ్యకార్యదర్శులకు సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో కారుణ్య నియామకాలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తులతో సహా సమర్పించాలని, ఈ విషయంలో ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) ఆదేశించింది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల కారుణ్య నియామకాల్లో జాప్యం జరుగుతోందని జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఉద్యోగులు మరణించినప్పుడు లేదా మెడికల్ ఇన్‌వాలిడేషన్ కారణంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంబంధీకులకు కారుణ్య నియామకాలు ఉంటాయని తెలిపారు. నియామకాలకు సంబంధించి ఉద్యోగి మరణ ధ్రువీకరణ పత్రం, మెడికల్ ఇన్‌వాలిడేషన్ సర్టిఫికెట్, వారసత్వ ధ్రువీకరణ తదితర పత్రాలన్నింటినీ దరఖాస్తులతో జతపర్చాలని సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.